అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 15-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 74 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

పశ్చిమ బెంగాల్‌లో 16 స్థానాలకు పోటీ

అభ్యర్థులను ప్రకటించిన లెఫ్ట్ ఫ్రంట్

సీపీఐ(ఎం) 13, సీపీఐ 1, ఫార్వర్డ్ బ్లాక్ 1, ఆర్ఎస్‌పీ 1



12లో..

అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తున్న బిమన్ బసు

జమిలిపై నివేదిక

రాష్ట్రపతికి సమర్పించిన కోవింద్ కమిటీ

రాజ్యాంగ సవరణలు అవసరమని సూచన

- రెండంచెలుగా ఎన్నికలు తొలుత లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు
- ఆ తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థలకు
- ఒకే ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డు



రాష్ట్రపతి ముర్ముకు జమిలీ నివేదికను సమర్పిస్తున్న కమిటీ

దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణలో సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ గురువారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి 18,626 పేజీల నివేదికను అందజేసింది. దేశంలో రెండంచెలుగా ఎన్నికలు జరపాలని అందులో సూచించింది. అందుకోసం రాజ్యాంగంలో అనేక సవరణలు చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. పలు సవరణలకు రాష్ట్రాల అంగీకారం అవసరం లేదని తెలిపింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక సంఘం మాజీ చైర్మెన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కశ్యప్‌తో పాటు కమిటీలోని ఇతర సభ్యులు కూడా రాష్ట్రపతిని కలిశారు.

న్యూఢిల్లీ : జమిలి జరగాలంటే...ముందుగా లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. ఆ తర్వాత 100 రోజులలో స్థానిక సంస్థలైన పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరపవచ్చునని తెలిపింది. అవిశ్వాస తీర్మానం కారణంగా ప్రభుత్వం పతనమైనా, వేరే ఏ ఇతర పార్టీ లేదా కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్యాబలం లేకపోయినా చట్టసభ పదవీకాలంలో (ఐదు సంవత్సరాలు) మిగిలిన కాలానికి ఎన్నికలు జరపాలని కమిటీ సూచన చేసింది. అప్పుడే జమిలి ఎన్నికలు సాధ్యపడతాయని స్పష్టం చేసింది.

ముందస్తు ప్రణాళికలు అవసరం

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, భద్రతా దళాల కోసం ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుందని కోవింద్ కమిటీ అభిప్రాయపడింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒకే ఓటర్ల జాబితాను రూపొందించే విషయంలో రాష్ట్రాల ఎన్నికల అధికారులతో చర్చించాలని, ఓటరు గుర్తింపు కార్డులను కూడా జారీ చేయాలని సూచించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచడానికి, ఓటర్లలో విశ్వాసాన్ని కల్పించడానికి జమిలి ఎన్నికలు దోహదపడతాయని తెలిపింది. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ...3లో

ప్రజాస్వామ్య విరుద్ధం

"ఏకకాల ఎన్నికల భావన" అభ్యంతరకరం.ఇది "ప్రాథమికంగా ప్రజాస్వామ్య విరుద్ధమైనది".అలాగే ఇది "రాజ్యాంగంలో నిర్దేశించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క మూలాన్ని దెబ్బతీస్తుంది".

- సీపీఐ(ఎం)

ప్రజాస్వామ్యం తారుమారు : కాంగ్రెస్

ఏకకాల ఎన్నికలను అమలు చేయడం వల్ల "రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో గణనీయమైన మార్పులు" వస్తాయి. ఫెడరలిజం హామీలకు విరుద్ధం గా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేస్తుంది.

ప్రజాస్వామ్యం, రాష్ట్ర హక్కులకు పరిమితి : సీపీఐ

"ప్రజాస్వామ్యం, రాష్ట్ర హక్కులకు పరిమితి". ఏకకాలం లో ఎన్నికలు నిర్వహించడం "అభిప్రాయాల వైవిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం" .ఏకరూపతను విధించడం దేశాన్ని ఒకే పార్టీ పాలన వైపు నెట్టడమే.

ఒకే దేశం.. ఒకే ఎన్నికకు 19 పార్టీలు నో

- నాలుగు జాతీయ పార్టీలతో సహా వ్యతిరేకించిన 15 ప్రధాన పార్టీలు 3లో..
- అనుకూలంగా 32 పార్టీలు
- అభిప్రాయాన్ని వెల్లడించని వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్

రాజ్యాంగ విరుద్ధం : డీఎంకే

ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల రాష్ట్ర అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేయాల్సి ఉంటుంది. ఇది "రాజ్యాంగ విరుద్ధం".ఇది కేంద్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి కమిటీ అధికార పరిధిని ప్రశ్నించింది.

కాంగ్రెస్ పాలనకు 100 రోజులు



5లో..

అనుమానాలు.. అవహేళనలను అధిగమించి ముందుకు

- శ్వేతపత్రాలు..విచారణ కమిటీలతో సీఎం దూకుడు
- ఎన్నికల సభల్లో తనదైన శైలిలో వాగ్బాణాలు
- ఆరు గ్యారెంటీల్లో ఐదింటికి శ్రీకారం
- మరికొన్నింటిపై ప్రకటనలు
- అప్పులు..ఆర్థిక పరిమితులున్నా అమలు చేసి తీరతామంటూ భరోసా
- కొత్త ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల కోటి ఆశలు

'ఈ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో చూద్దాం.. కొద్ది రోజులు, వారాల్లోనే అది పడిపోవటం ఖాయం...' అంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు చెందిన నేతల బెదిరింపులు ఒకవైపు... 'కాంగ్రెస్ సర్కార్ అనేది తుమ్మితే ఊడిపోయే ముక్కు... ఇతర రాష్ట్రాల్లో ఏం జరుగుతుందో తెలుసుకదా..? ఇక్కడ కూడా అదే జరిగి తీరుతుంది...' అంటూ కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ రాష్ట్ర నేతల హెచ్చరికలు మరోవైపు... ఇలాంటి అవమానాలు, అవహేళనలను పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు 'సెంచరీ' పూర్తి చేసుకుంది. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉండి, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ పాలనకు శుక్రవారంతో వంద రోజులు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ విశ్లేషణ..

ఎన్నికల కమిషనర్లుగా జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు

మాజీ ఐఏఎస్‌లను ఎంపిక చేసిన ప్రధాని నేతృత్వంలోని ప్యానెల్

వివరాలు 6లో..



కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరకట్లేదు

- పక్కపార్టీల్లో టికెట్ రాని నేతల కోసం పాకులాట : కొండా

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదనీ, అందుకే పక్కపార్టీల్లో టికెట్లు దక్కని నేతల కోసం పాకులాడుతున్నారని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లు సీఎం రేవంత్‌రెడ్డిని కూడా బయట నుంచి తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జితేందర్‌రెడ్డి తనకు మంచి మిత్రుడనీ, ఆయనకు టికెట్ రాకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన పార్టీ మారుతాడని తాను భావించడంలేదని తెలిపారు. బీజేపీలోకి రంజిత్‌రెడ్డి వస్తానన్నా తనకేం అభ్యంతరం లేదనీ, తానెవ్వరినీ పార్టీలోకి రాకుండా అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో 12 నుంచి 13 సీట్లు, తమిళనాడులో ఐదారు సీట్లను బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీకి ఓ సిద్ధాంతం ఉందన్నారు. కొన్ని పార్టీలు అవసరాలకు అనుగుణంగా సిద్ధాంతాలను మార్చుకుంటాయని విమర్శించారు. విమోచన దినోత్సవంపై మొదటి నుంచీ బీజేపీ ఒకే అభిప్రాయంతో ఉందన్నారు. సీఏఏ ఎవ్వరికీ వ్యతిరేకం కాదని చెప్పారు. ముస్లింలు పౌరసత్వం కోల్పోతారని కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల ఎవ్వరికీ నష్టం ఉండదని నొక్కి చెప్పారు. చేవెళ్లలో సర్వే చేయించామనీ, బీజేపీ గెలువబోతున్నదని రిపోర్టు వచ్చిందని చెప్పారు. ఇతర పార్టీలు అభ్యర్థులను ప్రకటించకముందే తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఒక రౌండ్ ప్రచారం పూర్తయిందన్నారు. లిక్కర్ కేసులో రాష్ట్రానికి చెందిన డబ్బులున్నాయనీ, రాష్ట్ర ప్రభుత్వం మారినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

వయస్సుతో నిమిత్తం లేకుండా మూత్రపిండాల వ్యాధుల వ్యాప్తి

- డాక్టర్ నగరి బీరప్ప

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల వారిలో మూత్రపిండాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప హెచ్చరించారు. ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ నిమ్స్‌లో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శరీరం చక్కెర స్థాయిని, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం, వాటికి సంబంధించిన మాత్రలను క్రమం తప్పకుండా వాడటం, ఆస్ప్రిన్, బ్రూఫిన్ వంటి నొప్పి నివారణ మందులను విచ్చలవిడిగా వాడకపోవడం, పొగ, మద్యపానానికి దూరంగా ఉండటం, నీరు సమృద్ధిగా తాగడం ద్వారా ఈ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రోగులకు సేవలందించేందుకు రాష్ట్రంలో వందలాది సంఖ్యలో డయాలసిస్ కేంద్రాలు పని చేస్తున్నాయనీ, అయితే ఆ కేంద్రాల సంఖ్య పెంచడం కన్నా కిడ్నీ రోగుల సంఖ్య పెరగకుండా చూడటంలోనే నిజమైన ఆనందం ఉందని తెలిపారు. నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి నెల రెండో గురువారాన్ని ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్య నారాయణ, నెఫ్రాలజీ ప్రొఫెసర్ గంగాధర్, భూషణ్ రాజు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీలో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తొలి రోజు నుంచే అమలు

- ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సంతకం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీ రూ.10 లక్షలకు పెంపు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి గరిష్టంగా రూ.10 లక్షల వరకు కవరేజీ పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ప్రారంభించింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి అంతకు ముందు ఉన్న గరిష్ట పరిమితి రూ.5 లక్షలను రూ.10 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. క్యాబినెట్ ఆమోదంతో గతేడాది డిసెంబర్ 9 నుంచి ఇది అమల్లోకి వచ్చింది.

ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ సేవలను ఆరోగ్యశ్రీ కార్డుదారులకు అందిస్తున్న విషయం తెలిసిందే. దీనిక ఉచిత వైద్యం, ఉచిత మందుల అందజేత, ఉచితంగా టెస్టులు అందిస్తున్నారు. రాష్ట్ర దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబం ఈ కార్డు ద్వారా సౌకర్యాన్ని పొందేందుకు అర్హత కలిగి ఉంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకం కింద 1,672 రకాల వైద్య సదుపాయాలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 87.5 లక్షల కుటుంబాలు లబ్దిదారులుగా ఉన్నారు. వైద్య ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో గతంలో ఉన్న గరిష్ట పరిమితి రూ.5 లక్షలు మాత్రమే కావడంతో పలు సందర్భాల్లో పేదలకు ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. పరిమితి పెంపు పట్ల పేద రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు ఐఏఎస్‌ల బదిలీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సిహెచ్.శివలింగయ్యను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రెటరీగా నియమించారు. వరంగల్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీని వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న మల్లయ్య బట్టు తెలంగాణ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమితులయ్యారు.

మహిళా భద్రతకు ప్రథమ ప్రాధాన్యం

- మహిళలను వేధించే వారిమీద ఉక్కుపాదం : రాచకొండ సీపీ తరుణ్ జోషి



నవతెలంగాణ–సిటీబ్యూరో

మహిళల భద్రతకు ప్రథమ పాధాన్యత ఇస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వారి ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి తగిన విధంగా న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గురువారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే షీటీమ్స్ బిల్డింగ్‌తోపాటు ఈ చలాన్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ సరూర్‌నగర్‌లోని సాయిబాబా ఆలయాన్ని సందర్శించి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని, ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే విధంగా పని వాతావరణం ఉండాలన్నారు. ట్రాఫిక్ ఈ–చలాన ఆఫీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు ప్రయాణాల్లో, పని ప్రదేశాల్లో, ఇతర చోట్ల ఎదురయ్యే వివిధ రకాల వేధింపుల నుంచి రక్షణ కోసం షీటీమ్స్ బృందాలు అన్ని వేళలా అందు బాటులో ఉంటాయన్నారు. హింస, నిరాదరణ ఎదుర్కొంటూ పోలీస్ స్టేషన్‌కు స్వయంగా రాలేని బాధితులు రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూమ్ 8712662111 నెంబర్‌కిగానీ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందించి న్యాయం చేకూరుస్తామని చెప్పారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ వెంకటేశం ఉన్నారు.

రాజాసింగ్‌పై అనుమానం అక్కర్లేదు

- ఆరూరి పార్టీలో చేరుతారో లేదో తెలియదు
- ప్రజల వద్దకు అభివృద్ధి ఎజెండాతో ప్రధాని మోడీ
- 15, 16, 18 తేదీల్లో రాష్ట్రానికి ప్రధాని రాక : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాజాసింగ్‌పై ఎవ్వరికీ అనుమానం అక్కర్లేదనీ, బీజేపీ పట్ల నిబద్ధత గల ఆయన సేవలను పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగించుకుంటామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తమ పార్టీలో చేరుతారా? లేదా? అనేది తనకు తెలియదన్నారు. ప్రజల వద్దకు ప్రధాని మోడీ అభివృద్ధి ఎజెండాతో ముందుకెళుతున్నారనీ, రాష్ట్రంలో శుక్ర, శని, ఆదివారాల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీ 15 రోజులుగా దేశంలో లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని తెలిపారు. విపక్షాలు అభివృద్ధి ఎజెండాను పక్కదోవ పట్టించేందుకు కుటుంబ, వంశపారంపర్య రాజకీయాలను తెరపైకి తెస్తున్నాయని విమర్శించారు. సీఏఏపై తప్పుడు ప్రచారం చేస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల పౌరసత్వాలను రద్దు చేస్తామని ఎవ్వరూ చెప్పలేదన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తామంటే కుదరదనీ, తర్వాత చేస్తామంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమ సర్కార్‌ను కూలగొట్టాలని చూస్తున్నాయని రేవంత్‌రెడ్డి పదేపదే ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. అభద్రతాభావంతో ఆయన ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సర్కారును కాపాడుకోకుంటే ఆయన ఖర్మ అన్నారు. ఎన్నికల ద్వారానే తెలంగాణలో అధికారంలోకి వస్తామని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టుల కంచుకోట త్రిపురలో జీరో సీటు నుంచి ఏకంగా అధికారంలోకి వచ్చామనీ, అలాంటిది ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు.

పార్టీ అన్ని కోణాల్లో ఆలోచించే నేతలను చేర్చుకుంటున్నదనీ, దాడి చేసిన వారికి టికెట్లు ఎలా ఇస్తున్నారని మానేతలు ప్రశ్నిస్తే వారికి జవాబు చెప్పి నచ్చజెప్పుతామన్నారు.

మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్

- మల్కాజిగిరి నుంచి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే మరో ఇద్దరు అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించింది. మల్కాజ్‌గిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పేర్లను ఆ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ఖరారు చేశారు. రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను ఇప్పటి వరకు బీఆర్ఎస్ 11 మందిని ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో చవిచూసిన ఫలితాల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగు వేస్తోంది.

సీట్లను దక్కించుకోవాలని వ్యూహరచన చేస్తోంది. తాజాగా ప్రకటించిన రెండు నియోజకవర్గాలు కీలకమైనవే. మల్కాజిగిరి స్థానం కోసం నిన్నటి వరకు బీఆర్ఎస్‌లో అందరూ పోటీ పడ్డారు. మాజీ మంత్రి మల్లారెడ్డి తన కుమారుడికి టికెట్ తెచ్చుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. చివరికి టికెట్ వద్దు రాజకీయాలు వద్దంటూ ప్లేటు ఫిరాయించారు. ఇక శంభీపూర్ రాజు పేరును అధిష్టానం దాదాపు ఖరారు చేసిందని భావించినప్పటికి ఒక్కరోజులో సీన్ మొత్తం మారిపోయింది. ఎవరూ ఊహించని విధంగా రాగిడి లక్ష్మారెడ్డికి టికెట్ దక్కింది.

ఫారం నెం.యుఆర్‌సి–2
కంపెనీల చట్టం, 2013లోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు గురించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిస్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014 లోని రూల్ 4(1)నకు అనుగుణంగా)

1) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా కంపెనీల చట్టం, 2013లోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్I క్రింద నమోదు కాబడుతున్న మెసర్స్ లైవో రిక్రూట్‌మెంట్ కన్సల్టింగ్ ఎల్ఎల్‌పి, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్‌కు సంబంధించి రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్(సిఆర్‌సి), కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ/రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ వారికి పదిహేను రోజుల తరువాత కానీముప్పైరోజులు ముగియుటకు ముందు దరఖాస్తు చేయుటకు ప్రతిపాదించబడిందని కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366 యొక్క ఉప–సెక్షన్ (2)నకు అనుగుణంగా ఇందుమూలంగా తెలియజేయడ మైనది.
2) కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు: రిక్రూట్‌మెంట్, శిక్షణ మొదలైన ప్రక్రియలో జాబ్ ప్రొవైడర్స్ మరియు ఉద్యోగార్థులకు ఇద్దరికి సహాయపడేఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్ ద్వారా రిక్రూట్‌మెంట్ సర్వీస్ వ్యాపారంలో భారతదేశం/విదేశాలలో పాల్గొనడం మరియు కనెక్టివిటీ పరిష్కారాలను అందించడం.
3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ముసాయిదా ప్రతిని ఆఫీసు ప్లాట్ నెం.48, నవనిర్మాన్ నగర్, జూబ్లీహిల్స్, రోడ్‌నెం.71, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ దగ్గర, హైదరాబాద్ వద్ద పరిశీలించుకోవచ్చును.
4) ఈ దరఖాస్తును వ్యతిరేకించదలచిన ఏ వ్యక్తి అయినా వ్రాతపూర్వకంగా వారి అభ్యంతరాలను కంపెనీకి దీని రిజిస్టర్డు ఆఫీసు వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవైఒక రోజుల్లోపు రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్(సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్‌అఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నెం.6,7,8, సెక్టార్–5, ఐఎంటి మనేసర్, జిల్లా గుర్గామ్ (హర్యానా), పిన్‌కోడ్–122050, ఇండియా వారికి వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను.

తేది: 14 మార్చి, 2024
దరఖాస్తుదారు పేరు
1. సందీప్ కట్టమూరి
డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్
డిఐఎన్: 03128742
2. శౌడిమ హర్షి
డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్
డిఐఎన్: 09442194

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులివ్వాలి

విద్యా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శులకు సీఐటీయూ వినతి




బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ నేతలు ఎస్వీ.రమ, వై.స్వప్న

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి ఈ కుబేరులో ఉన్న పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, ఉపాధ్యక్షులు వై.స్వప్న వినతిపత్రాలను అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 2023 నవంబర్ నుంచి కార్మికులకిచ్చే గౌరవ వేతనం, అల్పాహారం, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్న తీరును వివరించారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయనీ, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని తెలిపారు. సుదీర్ఘకాలం పోరాటాల తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు ఉన్న వేతనంపై రూ.2 వేలు పెంచారనీ, దాన్ని కూడా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోయారు. బిల్లులను కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలని కోరారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలను పెంచాలని విన్నవించారు. ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదనీ, ఇప్పుడు కొత్తగా అల్పాహారం పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. టిఫిన్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. గుడ్లకు బడ్జెట్ అదనంగా కేటాయించాలనీ, లేకుంటే అంగవాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టుగానే మధ్యాహ్న భోజన పథకానికి కూడా సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలనీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, గుర్తింపు కార్డులివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కాటన్ బట్టల యూనిఫాం, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.





అప్పుడు మోడీ.. ఇప్పుడు అంబానీ

- రామ మందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమంతో విపరీతమైన ప్రచారం పొందిన ప్రధాని
- ఇప్పుడు తన కుమారుడి ప్రీవెడ్డింగ్ వేడుకలతో ముఖేశ్‌ది అదే దారి
- ప్రపంచ సంపన్నులు బిల్‌గేట్స్, జుకర్‌బర్గ్ సహా దేశ, విదేశీ ప్రముఖులు హాజరు
- ప్రధాన స్రవంతి మీడియాతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రచారం

న్యూఢిల్లీ : భారత్ త్వరలో ఎన్నికల మహాసంగ్రామాన్ని ఎదురు చూడబోతున్నది. మరికొన్ని రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాబోతోంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని అధికార ఎన్డీయే సర్కారు ఇప్పటికే తన రాజకీయ ప్రచారాన్ని షురూ చేసింది. ఇందుకు అందివచ్చిన ఏ ఒక్క విషయాన్నీ మోడీ సర్కారు వదలటం లేదు. ఈ ఏడాది జనవరిలోనే అయోధ్యలోని రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పుడు వివాదాస్పద సీఏఏనూ అమలు చేస్తున్నది. అయితే, ఈ కార్యక్రమాలకు బీజేపీ అనుకూల మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియా సైతం విపరీత ప్రచారాన్ని కల్పిస్తున్నది. ఇదే తీరు ఆసియాలోనే అత్యంత సంపన్నుడు ముఖేశ్ అంబానీ కుమారుడి ప్రీవెడ్డింగ్ వేడుకల్లోనూ కనిపించింది. దేశంలోని సమస్యలపై దృష్టి సారించకుండా.. ఇలాంటి విషయాలపై దృష్టి సారిస్తూ ప్రజలను ప్రభావితం చేస్తున్న మీడియా తీరుపై సామాజికవేత్తలు, మేధావులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

'బాధ్యత మరిచిన మీడియా'

దేశంలో ఇప్పటికే అనేక సమస్యలు, సవాళ్లు ఉన్నాయనీ, వాటిని చూపెట్టి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత గల మీడియా తన కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించటం లేదని సామాజికవేత్తలు, మేధావులు ఆరోపిస్తున్నారు. దేశ ప్రజలు కూడా ఇలాంటి వార్తలతో ప్రభావితం కాకుండా.. వాస్తవాలను గమనంలో ఉంచుకొని విజ్ఞతతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఇలాంటి వార్తలు, ప్రచారాలతో ఏ మాత్రమూ ప్రభావితం కాకుండా మంచి, చెడులను తెలుసుకోగలగాలని వారు చెప్తున్నారు.

అయోధ్యలో అంతా మోడీనే అన్నట్టుగా..

యూపీలోని అయోధ్య అంశం అనేక ఏండ్లుగా కోర్టులో నానుతూ వచ్చింది. ఎట్టకేలకు 2019, నవంబర్‌లో రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, మోడీ సర్కారు దీనిని కూడా తన ఖాతాలో వేసుకున్నది. ప్రధానిగా తెర వెనక మోడీ కృషి ద్వారానే ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైందని ప్రచారం చేసుకున్నది. బీజేపీ అనుకూల సోషల్ మీడియాతో పాటు బీజేపీ అనుకూల మీడియా సైతం ఆ ప్రచార భారాన్ని తన భుజస్కంధాలపై వేసుకున్నది.

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఏడాదే అయోధ్యలో రామ మందిర నిర్మాణ పనులకు ప్రధాని హెూదాలో మోడీ శంకుస్థాపన చేశారు. ఆ ఏడాది దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభించినప్పటికీ.. ఆగస్టు 5న ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక లౌకిక, ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఉండి.. ఒక మతానికి చెందిన కార్యక్రమంలో మోడీ పాల్గొనటం ఏమిటి? అంటూ అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు, ఆరోపణలు వెలువడ్డాయి.

నాలుగేండ్ల తర్వాత..

ఇక దాదాపు నాలుగేండ్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది జనవరి 22న ఆలయంలో 'ప్రాణప్రతిష్ట' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని ప్రధాని చేతుల మీదుగా చేయించింది. అయితే, ఆలయం పూర్తి కాకుండానే ఇలాంటి క్రతువు చేపట్టటం ఏమిటనీ సాక్షాత్తూ హిందూ వర్గాలకు చెందిన మత పెద్దల నుంచే విమర్శలు వినిపించాయి. పలువురు ఈ కార్యక్రమాన్ని సైతం బహిష్కరించారు. అలాగే, రాష్ట్రపతిగా ఉన్నటువంటి ద్రౌపది ముర్మును ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవటాన్ని కూడా పలువురు సామాజికవేత్తలు, రాజకీయ విశ్లేషకులు విమర్శించారు. కానీ, అవేమీ పట్టించుకోని మోడీ.. ప్రచారమే ప్రధానాస్త్రంగా ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రచారం కల్పించింది మోడీ సర్కారు. కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలైతే ఆ రోజు (జనవరి 22న) సెలవు దినంగా ప్రకటించాయి. బీజేపీ అనుబంధ హిందూ సంఘాలు, సంస్థలైతే.. అయోధ్య అక్షింతలు అంటూ ఇంటింటికీ పంచిపెట్టాయి. అయోధ్యలోని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రముఖులు, వీవీఐపీలకు అభివాదం చేస్తూ మోడీ ముందుకు కదిలారు. ఈ కార్యక్రమానికి కనీవినీ ఎరుగని ప్రచారం కల్పించిన బీజేపీ అనుకూల మీడియా మోడీని ఒక హీరోగా చిత్రీకరించింది.

ఇక బీజేపీ, ఇతర హిందూత్వ సంస్థలు, సంఘాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సినవసరం లేదు. తమ సోషల్ మీడియా ఖాతాల్లో మోడీని ఒక అవతారపురుషుడు, కారణ జన్ముడు, దైవ సమానుడంటూ వీడియోలు, ఫోటోలతో నానా హంగామా సృష్టించాయి. మొత్తానికి, ఒక మతానికి చెందిన ప్రభుత్వేతర కార్యక్రమానికి ప్రధాని స్థాయిలో వెళ్లి.. దానిని రాజకీయంగానూ తనకు ప్రచారాస్త్రంగా వాడుకోవటం మోడీకే చెల్లిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అంబానీ కుమారుడి పెండ్లి వేడుకల్లో..

అప్పటి అయోధ్య ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంతో మోడీ దేశ ప్రజల దృష్టిని తన వైపు మరల్చుకున్నట్టే.. అంబానీ కూడా తన చిన్న కుమారుడి పెండ్లి వేడుకలతో దేశ దృష్టిని తన వైపునకు తిప్పుకున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ నెల 1 నుంచి 3 వరకు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ముఖేశ్ అంబాన్ని కుమారుడు అనంత్ అంబానీ– రాధిక మర్చంట్‌ల ప్రీవెడ్డింగ్ వేడుకలు ఘనంగా జరిగాయి. బిల్‌గేట్స్, మార్క్ జుకర్ బర్గ్ వంటి అత్యంత సంపన్నులు, అంతర్జాతీయ ప్రముఖులు మొదలుకొని.. దేశంలోని పలువురు వీఐపీలు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ ఈవెంట్ కోసం జామ్‌నగర్‌కు దాదాపు 130 విమానాలు వచ్చాయి. కేంద్రం అనుమతితో కొన్ని రోజులు ఇది అంతర్జాతీయ విమానాశ్రయం హెూదానూ పొందింది. ఈ ఈవెంట్‌లో ప్రదర్శననివ్వటానికి వచ్చిన రిహాన్నాకు అక్షరాల రూ.58 కోట్లు చెల్లించినట్టు తెలుస్తున్నది. ఈ వేడుకలకు సంబంధించి బయటకు వచ్చిన ప్రతి ఒక్క చిన్న వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంబానీకి చెందిన వార్తా ఛానెళ్లతో పాటు ప్రధాన స్రవంతి మీడియా సైతం ఈ కార్యక్రమానికి అధిక ప్రచారాన్ని కల్పించింది.

బీజేపీలో అసంతృప్త రాగాలు

- చర్చనీయాంశంగా జితేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి కలయిక
- తీవ్ర అసంతృప్తిలో ఎంపీ సోయం బాపూరావు
- వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరుతారంటూ ప్రచారం
- సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న నల్లగొండ నాయకత్వం
- వరంగల్ సీటు కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్న మాజీ డీజీపీ కృష్ణప్రసాద్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఓవైపు వేగంగా అభ్యర్థులను ప్రకటిస్తూ ముందుకెళ్తున్న బీజేపీలో అంతే స్థాయిలో అసంతృప్త రాగాలు తీవ్రమవుతున్నాయి. మహబూబ్‌నగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఆశించి భంగపడి తీవ్ర నైరాశ్యంలో ఉన్న జితేందర్‌రెడ్డిని స్వయంగా ఇంటికెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి కలవటం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రేవంత్‌రెడ్డి తరుచూ వచ్చిపోతుంటారనీ, టికెట్ రాలేదన్న బాధలో ఉన్న తనకు ఓదార్పు ఇచ్చేందుకు వచ్చారని జితేందర్‌రెడ్డి కప్పిపుచ్చుకునే యత్నం చేశారు. ఆదిలాబాద్ టికెట్ దక్కకపోవడంతో ఆదివాసీనేత, ఎంపీ సోయంబాపూరావు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. బీజేపీకి ఏమాత్రం పట్టులేని సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఆదివాసీల సహకారంతో ఎంపీగా గెలిచిన తనను పార్టీ పక్కనబెట్టడంపై ఆయన గుర్రుగా ఉన్నారు. జితేందర్‌రెడ్డి, సోయం బాపూరావు త్వరలోనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ప్రచారం కోడై కూస్తున్నది. వారిద్దరికీ కాంగ్రెస్ పార్టీ టికెట్లు కూడా ఆఫర్ చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. నల్లగొండ పార్లమెంటరీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని ప్రకటించడంపై రాష్ట్ర నాయకత్వమే రెండుగా చీలిపోయింది. ఆయన్ను చేర్చుకునే సమయంలోనే పార్టీ శ్రేణులను కొట్టించిన వ్యక్తిని ఎలా చేర్చుకుంటారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ తన అసంతృప్తిని వ్యక్తపరిచిన విషయం విదితమే. సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని నల్లగొండ జిల్లా బీజేపీ నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఆయన్ను మార్చాల్సిందేనని రాష్ట్ర నాయకత్వం వద్ద పట్టుపడుతున్నది. దీనిపై ఆ పార్టీ పార్లమెంట్ బోర్డు కమిటీ సభ్యులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ స్పందిస్తూ..'దాడి చేసిన వారికి టికెట్లు ఎలా ఇస్తున్నారని ప్రశ్నిస్తున్న నేతలకు మేం జవాబు చెప్పుకుంటాం. నచ్చజెప్పుకుంటాం. పార్టీ అన్ని కోణాల్లో ఆలోచించే చేర్చుకుంటున్నది' అని చెప్పారు. వరంగల్ సీటును బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌కు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఆయన ఇంకా పార్టీలోనే చేరలేదు. బుధవారం వరంగల్ జిల్లాలో ఆయన కోసం బీజేపీ–బీఆర్ఎస్ శ్రేణులు బాహాబాహికి దిగడం, ఆ తర్వాత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయన్ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దగ్గరకు తీసుకెళ్లడం దాకా మొత్తం సీన్ సినిమా తరహాలో రక్తికట్టించింది. అయితే, మాజీ డీజీపీ కృష్ణప్రసాద్ తనకు వరంగల్ సీటు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యాలయం చుట్టూ, అగ్రనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా, ఆయన మొరను ఎవ్వరూ పట్టించుకోకవడంతో ఆయన కూడా నైరాశ్యంలో ఉన్నారు. తీవ్ర పోటీ మధ్య మెదక్ సీటు దక్కించుకున్న రఘునందన్‌రావుకు మరో నేత అంజిరెడ్డి ఏమేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకమే. ఇప్పటిదాకా బీజేపీ ప్రకటించిన 15 మంది అభ్యర్థుల్లో 8 మంది వారం, పది రోజుల కింద పార్టీలో చేరిన వారే కావడం గమనార్హం. అందులో బీఆర్ఎస్ నుంచి వచ్చినవారు ఆరుగురు, కాంగ్రెస్ నుంచి ఒకరు, ఏ పార్టీకి సంబంధం లేకుండా డైరెక్ట్‌గా హైదరాబాద్ స్థానం దక్కించుకున్న మాధవిలత ఉన్నారు. వీరంతా ఒక పార్టీలో స్థిరంగా ఉండరనీ, ఎవరు అధికారంలో ఉంటే వారివైపు కొమ్ముకాసే వారికి పార్టీలో ప్రాధాన్యత ఇచ్చి సీట్లు ఇచ్చి ఆర్ఎస్ఎస్, బీజేపీనే నమ్ముకుని దశాబ్దాలుగా పనిచేస్తున్న తమను అవమానించడమేనని హార్డ్‌కోర్ కార్యకర్తలు వాపోతున్నారు. మాధవిలతకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంపై రాజాసింగ్ ఫైర్ అయ్యారు. 'ఆ స్థానంలో పోటీచేయించేందుకు మొగోడే దొరకలేదా?' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. సంగారెడ్డిలో జరిగిన మోడీ బహిరంగ సభలోగానీ, హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో జరిగిన అమిత్‌షా సభలోగానీ రాజాసింగ్ కనిపించలేదు. ఆయన ఇంకా అలక వీడలేదు. దీనిని కవర్ చేసుకునేందుకు అగ్రనేతలు తిప్పలు పడుతున్నారు.



జమిలిపై నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్లకు కూడా వెసులుబాటు ఉంటుందని చెప్పింది.

జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ సుమారు 191 రోజులు అధ్యయనం జరిపింది. పలు రంగాల నిపుణులతో సంప్రదింపులు జరిపింది. జమిలి ఎన్నికలపై దేశంలోని 47 రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలు తెలపగా 32 పార్టీలు మద్దతు తెలిపాయి. కమిటీకి ప్రజలు, వివిధ వర్గాలకు చెందిన వారి నుంచి 21,558 సూచనలు అందాయి. వీరిలో 80 శాతం మంది జమిలి ఎన్నికలను సమర్థించారని కమిటీ తెలిపింది.

2029లోనే జమిలి ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏర్పడే నూతన ప్రభుత్వం కోవింద్ కమిటీ సిఫార్సులను ఆమోదించి, వెంటనే వాటికి అనుగుణంగా చర్యలు ప్రారంభించిన పక్షంలో 2029లో తొలిసారి దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2024 జూన్, 2029 మే మధ్య కాలంలో శాసనసభ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు తమ చట్టసభల పదవీకాలం 18వ లోక్‌సభతో పాటే ముగిసేలా చూసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల కొన్ని రాష్ట్రాల శాసనసభల పదవీకాలం ఐదు సంవత్సరాల కంటే తక్కువగానే ఉంటుంది. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో 2026లో, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 2027లో, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలలో 2028లో శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటన్నింటి పదవీకాలం 2029లో 18వ లోక్‌సభ పదవీకాలంతో పాటే ముగిసేలా చూసుకోవాలి.

వెంటనే సన్నాహాలు ప్రారంభించాలి

'కేంద్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం జమిలి ఎన్నికల నిర్వహణ కోసం ఎక్కడ తొలి అడుగు వేయాలో నిర్ణయించుకోవాలి. 2029లో జమిలి ఎన్నికలు జరపాలంటే సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత వెంటనే సన్నాహాలు మొదలు పెట్టాలి. ఒకవేళ 2034లో జమిలి ఎన్నికలు జరపాలని అనుకుంటే మాత్రం 2029 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రయత్నాలు మొదలు పెట్టాలి' అని కమిటీ సభ్యుడొకరు తెలిపారు. ప్రయత్నాలు ఎక్కడ మొదలు పెట్టాలో కమిటీ చెప్పదని, ఫార్ములాను మాత్రమే ప్రతిపాదిస్తామని ఆయన అన్నారు. అవిశ్వాస తీర్మానం, హంగ్ సభ లేదా ఏ ఇతర కారణం వల్ల అయినా పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభ ముందుగానే రద్దు అయితే ఒకేసారి ఎన్నికల నిర్వహణకు విఘాతం కలగకుండా చూసుకోవాలని కమిటీ సూచించింది. మిగిలిన పదవీకాలానికి మాత్రమే చట్టసభకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

రాజ్యాంగ సవరణలు అవసరం

ఒకే ఓటర్ల జాబితా, ఒకే ఓటరు గుర్తింపు కార్డు తయారు చేయాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 325ను సవరించాల్సి ఉంటుందని కమిటీ సిఫార్సు చేసింది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల కమిషన్లను సంప్రదించాలని సూచించింది. ఇక మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను ఒకేసారి జరపాలంటే ఆర్టికల్ 324–ఏను సవరించాలని, దీనిపై పార్లమెంటులో చట్టాన్ని తీసుకురావాలని తెలిపింది. 'వేగవంతమైన అభివృద్ధి దిశగా సుపరిపాలన సాగించాలంటే స్థిరత్వం అవసరం. అస్థిరత కారణంగా పరిపాలన స్తంభిస్తుంది. మూడంచెల ప్రభుత్వంలో లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపాలన్న కమిటీ సూచన పరిపాలనను మెరుగుపరుస్తుంది' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కశ్యప్ ప్రతిపాదనకు 'నో'

జమిలి ఎన్నికల నిర్వహణలో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు గత సంవత్సరం సెప్టెంబర్ 2న కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పడింది. ఈ కమిటీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్యసభలో గతంలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన గులాం నబీ ఆజాద్, ఆర్థిక సంఘం మాజీ ఛైర్‌పర్సన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ సి కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి సభ్యులుగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ విషయంలో జర్మనీ మోడల్‌ను అనుసరించాలని కమిటీ సభ్యుడైన కశ్యప్ సూచించారు. ఈ పద్ధతి ప్రకారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాలంటే ముందుగా ప్రత్యామ్నాయ నేతనో లేదా ప్రభుత్వాన్నో సూచించాల్సి ఉంటుంది. అయితే కశ్యప్ ప్రతిపాదనతో కమిటీ ఏకీభవించలేదు. అవిశ్వాస తీర్మానం విషయంలో ప్రస్తుతం అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని, అందులో ఎలాంటి మార్పులు అవసరం లేదని కమిటీ అభిప్రాయపడింది.

ఒకే దేశం.. ఒకే ఎన్నికకు 19 పార్టీలు నో

నాలుగు జాతీయ పార్టీలతో సహా వ్యతిరేకించిన 15 పార్టీలు

- అనుకూలంగా 32 పార్టీలు
- అభిప్రాయాన్ని వెల్లడించని వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్



నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

ఏకకాల ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ప్యానెల్‌కు తమ అభిప్రాయాన్ని తెలిపిన 47 రాజకీయ పార్టీలలో 32 ఈ ఆలోచనకు మద్దతునివ్వగా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ మద్దతిచ్చిన పార్టీలలో రెండు మాత్రమే జాతీయ పార్టీలు. బీజేపీ, కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ), ఇది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో భాగమైనది. ఎన్నికల సంఘం గుర్తించిన మిగిలిన నాలుగు జాతీయ పార్టీలు కాంగ్రెస్, సీపీఐ(ఎం), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఏకకాల ఎన్నికలను వ్యతిరేకించాయి.

ప్యానెల్ మొత్తం 62 రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాన్ని కోరింది. 18 పార్టీలతో వ్యక్తిగతంగా సంప్రదింపులు జరిపింది. బీజేపీ, ఎన్పీపీ కాకుండా, ఏకకాల ఎన్నికలకు మద్దతిచ్చిన పార్టీలలో అన్నాడీఎంకే, బీజేపీ మిత్రపక్షాలు ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ), అప్నాదళ్ (సోనీలాల్), అస్సాం గణ పరిషత్, లోక్ జనశక్తి పార్టీ (ఆర్), నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (నాగాలాండ్), సిక్కిం క్రాంతికారి మోర్చా, మిజో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ ఆఫ్ అస్సాం, ఇటీవల ఎన్డీఏ గూటికి వచ్చిన జేడీయూ, బిజు జనతా దళ్ (బీజేడీ), శివసేన (ఒక వర్గం ఎన్డీఏలో ఉంది), అకాలీదళ్ పార్టీలు ఉన్నాయి.

ఏకకాల ఎన్నికలను వ్యతిరేకించిన పార్టీలలో నాలుగు జాతీయ పార్టీలే కాక, డీఎంకే, ఏఐయూడీఎఫ్, టీఎంసీ, ఎంఐఎం, సీపీఐ, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మొదలైన ప్రధాన పార్టీలున్నాయి. వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్, ఐయుఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, జేడీఎస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, కేరళ కాంగ్రెస్ (ఎం), ఎన్సీపీ, ఆర్జేడీ, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ), ఆర్ఎల్డీ పార్టీలు తమ అభిప్రాయాన్ని వెల్లడించలేదు.

సమాఖ్య నిర్మాణ స్ఫూర్తిని ఓడిస్తుంది : ఎన్పీఎఫ్

నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్) జనవరి 12 నాటి ఒక లేఖలో ఏకకాల ఎన్నికలు "సమాఖ్య నిర్మాణ స్ఫూర్తిని నిరంతరం ఓడిస్తాయని పేర్కొంది. "జాతీయ ఎజెండా ప్రాంతీయ, స్థానిక సమస్యలను కప్పివేస్తుంది" అని పేర్కొంది. ఇది "రాజ్యాంగం సమగ్ర పరిశీలన"పై కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది.

ప్రాథమిక ఎన్నికల సూత్రాలకు వ్యతిరేకం: టీఎంసీ

2024 జనవరి 11న తన ప్రతి స్పందనన తెలిపిన టిఎంసి "ఒక దేశం, ఒకే ఎన్నిక" రాజ్యాంగ, నిర్మాణపరమైన చిక్కులను ప్రశ్నించింది. రాజ్యాంగం సమాఖ్య నిర్మాణానికి, "ప్రాథమిక ఎన్నికల సూత్రాలకు" వ్యతిరేకంగా పేర్కొంది. రాష్ట్రాలను ముందస్తు ఎన్నికలకు బలవంతం చేయడం రాజ్యాంగ విరుద్ధం, రాష్ట్ర సమస్యల అణిచివేతకు దారితీస్తుందని పేర్కొంది.

జాతీయ పార్టీలతో రాష్ట్ర స్థాయి పార్టీలు పోటీ పడలేవు: ఎస్పీ

సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) జనవరి 11న తన స్పందనను పంపి, ఫిబ్రవరి 6న ప్యానెల్‌ను కలిసి అభిప్రాయాన్ని తెలిపింది. ఏకకాల ఎన్నికలు ప్రాంతీయ సమస్యలపై జాతీయ సమస్యలకు దారితీస్తాయని కూడా పేర్కొంది. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర స్థాయి పార్టీలు ఎన్నికల వ్యూహం, వ్యయంలో జాతీయ పార్టీలతో పోటీ పడలేవని పార్టీ పేర్కొంది.

రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుంది : ఆప్

ఆప్ ఈ ఏడాది జనవరి 18న ప్యానెల్‌కు తన ప్రతి స్పందనను సమర్పించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 8న వ్యక్తిగతంగా పరస్పర చర్చ జరిగింది. దాని ప్రతిస్పందనగా, ఆప్ ఏకకాల ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని, దేశ సమాఖ్య విధానాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది. "అవిశ్వాసం ఓటింగ్‌తో తొలగించబడని రాష్ట్రపతి పాలనను సంస్థాగతంగా మారుస్తుంది" అని పేర్కొంది.

ఎన్నికల ప్రజాస్వామ్యం బలహీనమైన పరిశీలనలకు లోబడి ఉండకూడదు: ఎంఐఎం

ఎంఐఎం 2024 జనవరి 15 లేఖలో, ఫిబ్రవరి 14న వ్యక్తిగతంగా తన స్పందనను తెలిపింది. అటువంటి "ప్రాథమిక మార్పు"ను చేర్చడానికి రాజ్యాంగ అనుమతిని ప్రశ్నించింది. ఎన్నికలు కేవలం లాంఛనాలు కాదని, ఓటర్లను రబ్బరు స్టాంపులుగా పరిగణించరాదని పేర్కొంది. ఎన్నికల ప్రజాస్వామ్యం బలహీనమైన పరిశీలనలకు లోబడి ఉండకూడదని పేర్కొంది.

సంపాదకీయం

బైడెనోమిక్స్ బండారం!



విఫల రాజకీయ నేతలు ప్రపంచమంతటా అనుసరించే పద్ధతి ఒక్కటే. ఒకరిని చూసి ఒకరు నినాదాలను కాపీకొడుతుంటారు. గతంలో అమెరికాలో రోనాల్డ్ రీగన్ అనుసరించిన విధానాలకు రీగనోమిక్స్ అని పేరు పెట్టారు. ఇప్పుడు బైడెనోమిక్స్ అంటున్నారు. మన దేశంలో మోడినోమిక్స్ గురించి తెలిసిందే.ఎవరు ఏ పేరు పెట్టుకున్నా పూసల్లో దారంలా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలే తప్ప మరొకటి కాదు. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయంటూ చెప్పినచోట చూస్తే చిన్న నీటి కుంటకూడా కనిపించదు. గతంలో దేశం వెలిగిపోతోందని వాజ్‌పాయి చెబితే ఇప్పుడు వికసిత భారత్ అంటూ నరేంద్రమోడీ ఊరూరా తిరుగుతున్నారు. అమెరికాలో ఈ ఏడాది నవంబరులో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే డెమోక్రటిక్ పార్టీ తరపున జో బైడెన్, రిపబ్లికన్ల అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ ఖరారైనట్లు వార్తలు.ఇద్దరూ రెండోసారి గెలిచేందుకు పోటీ పడుతున్నారు. ట్రంప్ అమెరికాకే అగ్రతాంబూలం అంటుంటే మరోసారి అమెరికాలో సూర్యోదయం అని జోబైడెన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు చూస్తున్నారు. పదేండ్ల తరువాత నరేంద్రమోడీ గ్యారంటీలంటూ టీవీలు, ఇతర మాధ్యమాల్లో ఊదరగొడుతున్నారు. బైడెన్ కోసం రూపొందించిన ఒక నిమిషపు ప్రచార ప్రకటన " అమెరికాలో మరోసారి సూర్యోదయం, దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా నేడు పురుషులు, మహిళలు పనులకు వెళుతున్నారు. ఒక చిన్న పట్టణంలో ఐదున్నరవేల మంది వివాహం చేసుకోబోతున్నారు. గతేడాదితో పోలిస్తే ద్రవ్యోల్బణం ఇప్పుడు సగమే ఉంది, ప్రగాఢ విశ్వాసంతో భవిష్యత్‌ను మనం చూడవచ్చు" అని దానిలో ఊదరగొట్టారు. అది నిజమా?

జో బైడెన్ ఎన్నికైనపుడు అమెరికా "దౌర్భాగ్యం లేదా దుర్దశ లేదా యాతన రెండవ సూచిక 17.65శాతం" గా ఉంది. ఇప్పుడు రెండోసారి ఓట్లడుగుతున్నపుడు 23శాతం ఉందని, జనం పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయానికి 24శాతానికి పెరగవచ్చని బ్లూమ్‌బెర్గ్ ఎకనమిక్స్ తాజాగా ప్రకటించింది.దీని అర్థం ఏమిటంటే సగటు అమెరికన్ పౌరుడి జేబులు ఖాళీ అవుతున్నాయి. నిజవేతనాలు పెరగటం లేదు, ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది. బైడెన్ కంటే ముందు నాలుగేండ్లలో నిజ వేతనాలు 2.8శాతం పెరిగితే మూడేండ్ల బైడెన్ ఏలుబడిలో పెరిగింది కేవలం 0.76శాతమే. అంటే పరిస్థితి దిగజారిందని దౌర్భాగ్య సూచిక నిర్ధారించినట్లే కదా! ఇలాంటి స్థితిలో ఓటర్లు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. బహుశా ఈ వైఫల్యాన్ని పసిగట్టే మన నరేంద్రమోడీ గారి జిగినీ దోస్తు డోనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారానికి వస్తాననే ధీమాను వెల్లడిస్తున్నాడేమో.ప్రపంచంలో అత్యంత పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ కలిగినదిగా, ఇటీవలి దశాబ్దాలలో అత్యంత బలీయమైనదిగా బైడెన్ ప్రచారం చేసుకుంటున్న అమెరికాలో అంతా బాగుంటే జనాల పరిస్థితి ఎందుకు దిగజారుతున్నట్లు? నిజవేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగక పోవటం, 2022లో మధ్యతరగతి ఆదాయ కుటుంబాలపై 20 నుంచి 30శాతం పన్నులు పెంచటం, కార్పొరేట్ల మీద పెంచిన పన్నుల్లో 70శాతం భారాన్ని కార్మికులే భరించాల్సి వచ్చిందని టాక్స్ పాలసీ సెంటర్, టాక్స్ ఫౌండేషన్ సంస్థల అధ్యయనంలో తేలింది.

సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్ అన్నట్లుగా జన జీవితాలు దుర్భరం కావటానికి ద్రవ్యోల్బణమే కారణమని ప్రభుత్వం, దాని సమర్థకులు నమ్మించేందుకు చూస్తారు. సాధారణ జన పరిస్థితి దిగజారుతున్నది తప్ప కార్పొరేట్లకు ఎలాంటి ఇబ్బంది లేదు. అంటే ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిజవేతనాల స్తంభన తప్ప మరొకటి కాదు. బైడెనోమిక్స్ ట్రంప్‌నోమిక్స్ పేరు ఏదైనా అమెరికా పౌరుల పరిస్థితి దిగజారుతున్నది.శ్రామిక శక్తి భాగస్వామ్యం, ఉపాధి 2019 స్థాయికంటే తక్కువగా ఉంది. ఏటా రెండులక్షల కోట్ల డాలర్ల ప్రభుత్వ లోటు, 34లక్షల కోట్ల డాలర్ల అప్పు ఉంది.2021-23 మధ్య వినిమయ ధరల ద్రవ్యోల్బణం 17.6శాతం కాగా ఆహార 33.7, గృహవసతి 18.8, ఇంధనం 32.8, ఒకసారి కొన్న తరువాత తిరిగి వెనక్కు తీసుకోని వస్తువుల ద్రవ్యోల్బణం 30శాతం ఉన్న తరువాత నిజవేతనాల్లో సగటున 0.7శాతం పెరిగితే జనాలు విషాదంతో నవ్వుకోవటం తప్ప మరొకటి కాదు. ఈ వైఫల్యాలకు తోడు అంతర్జాతీయంగా ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతల పట్ల అనుసరిస్తున్న వైఖరి మీద జనాల్లో వ్యతిరేకత పెరుగుతోంది. అందుకే వారి ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకు ఇజ్రాయిల్ మీద విమర్శలు చేసినా, రష్యాను వెనక్కు కొడతామని ప్రగల్భాలు పలుకుతున్నా ప్రయోజనం కనిపించటం లేదు. అందుకే ఎన్నికల ముందు జో బైడెన్ ఇంటా బయటా తీవ్ర వ్యతిరేకత, విమర్శలను ఎదుర్కొంటున్నారు.

> **ప్రపంచంలో అత్యంత పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ కలిగినదిగా, ఇటీవలి దశాబ్దాలలో అత్యంత బలీయమైనదిగా బైడెన్ ప్రచారం చేసుకుంటున్న అమెరికాలో అంతా బాగుంటే జనాల పరిస్థితి ఎందుకు దిగజారుతున్నట్లు? నిజవేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగక పోవటం, 2022లో మధ్యతరగతి ఆదాయ కుటుంబాలపై 20 నుంచి 30శాతం పన్నులు పెంచటం, కార్పొరేట్ల మీద పెంచిన పన్నుల్లో 70శాతం భారాన్ని కార్మికులే భరించాల్సి వచ్చిందని టాక్స్ పాలసీ సెంటర్, టాక్స్ ఫౌండేషన్ సంస్థల అధ్యయనంలో తేలింది.**

ఆయుష్మాన్ భారత్ అంటే - ఆయుష్మాన్ బీజేపీ అనా?

రామ్‌నామ్ కి లూట్ హై సకేతో లూట్
అంత్‌కాల్ పఛ్‌తాయేగా జబ్ సత్తా జాయెగి ఛూట్ - అని కబీర్‌దాస్ దోహేను తిరగరాసుకుని రాముని పేరు చెప్పి, ప్రాణప్రతిష్ఠ పేరు చెప్పి, భక్తి పారవశ్యంలో తేలిపోతున్నట్టు నటిస్తూ.ఫొటో షూట్ చేసుకుంటూ ప్రజల సొమ్మును తప్పుడు మార్గంలో దోచుకోవడం బీజేపీ నాయకులకు అలవాటు. క్రిమినల్స్ కీలకస్థానాల్లో కొనసాగుతుండగా పరిస్థితులు నీతిమంతంగా సక్రమంగా ఉంటాయని ఎలా అనుకుంటాం? అమ్ముడుపోయిన ప్రధాన మీడియా నోరు మెదపకున్నా, నిజాయితీ నిబద్ధత గల మిగతా మీడియా బీజేపీ అక్రమాల్ని వెలుగులోకి తెస్తూనే ఉంది. వివేచన గల దేశ పౌరులు ఆలోచించి సరైన నిర్ణ యం తీసుకోవాలి. దేశాన్ని ఫాసిజం వైపు నియంతృత్వం వైపు తీసుకుపోయే ప్రభుత్వం కావాలా? ప్రజాస్వామ్య బద్ధంగా అందరి హక్కుల్ని, స్వేచ్ఛని పరిరక్షించే ప్రభుత్వం కావాలా? ఆలోచించుకోవాలి! అలాంటి ప్రభుత్వాన్ని తెచ్చుకోవడానికి ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు సమైక్యంగా కృషిచేయాలి!!



డాక్టర్ దేవరాజు మహారాజు

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా అవినీతి జరిగిందని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో - బయటా చాలా సుదీర్ఘమైన ఉపన్యాసాలు ఇస్తుంటారు. 2జి, 3జి, 4జి వంటి అనేక స్కాంలు జరిగాయనీ, అప్పటి ప్రభుత్వం భ్రష్టుపట్టి పోయిందనీ ఒంటికాలి మీద లేస్తుంటారు. అవినీతి ఎక్కడ ఎప్పుడు జరిగినా బయటపెట్టడం మంచి పనే - అభినందించదగిందే!!. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్:CAG ఇచ్చిన రిపోర్టు చూపించి ఆ ఆరోపణలు చేశారు. ఆ రోజుల్లో సిఎజి ఛీఫ్ వినోద్ రాయ్ ఉన్నాడు. ఇక్కడ నవ్వుకోవాల్సిన పరిస్థితి ఏమిటంటే అంతగా అప్పుడు ఎగిరిపడ్డ బీజేపీ ఆ అవినీతి నిరూపించి బాధ్యుల్ని జైలుకు పంపాలి కదా? మరి ఎందుకు పంపలేదూ? అది ఈనాటి ఈ బీజేపీ ప్రభుత్వపు అసమర్థత కాదా? సరే. అప్పటి విషయం అలా ఉంచి. ఇప్పటి ఈ బీజేపీ ప్రభుత్వం గురించి అదే CAG (కాగ్) ఇచ్చిన రిపోర్టు తెరచి చూద్దాం! ప్రధాన మీడియా మోడీకి దాసోహమంటోంది గనక, ఇలాంటి విషయాలు అది బయటపెట్టదు. బాధ్యత గల స్వతంత్ర జర్నలిస్టులు సత్యాన్వేషణకు పూనుకున్న కొన్ని పత్రికలు అధికార బీజేపీ అవినీతిని బయటపెడుతూనే ఉన్నాయి. స్వేచ్ఛాలోచనను బలపరిచే మనమూ-ఎవరు ఎక్కడ అవినీతికి పాలుపడ్డా, ఎవరెక్కడ నిజాయితీకి నిప్పుపెట్టినా స్పందిస్తూనే ఉండాలి కదా?

ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి, మోడి ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా చేసింది. ఇక, తాజా సిఎజి (CAG) రిపోర్టు ప్రకారం 'ఆయుష్మాన్ భారత్' పేరుతో బీజేపీ ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో... బయటపడింది. ఈ పథకాన్ని భారతీయ జన ఆరోగ్య యోజన (PMJAY) అని అంటారు. దీనితో భారతీయ పౌరులకు, ముఖ్యంగా పేదలకు ఆరోగ్య సమస్యలేవైనా ఉంటే, చికిత్స కోసం భారత ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఉచితంగా ఖర్చు చేస్తుంది. ఆరోగ్య పథకం బావుంది దేశ ప్రజల ఆరోగ్యం చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే - అందులో సందేహం లేదు! కానీ, అది నిర్వహించబడుతున్న తీరు ఎలాగుందో అధ్యయనం చేసి CAG రిపోర్టు విడుదల చేసింది. ఈ పథకం (స్కీం)లో లాభం పొందాలనుకునే వారు మొదట PMJAY ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు తీసుకోవాలి. తర్వాత ఆ స్కీంలో రిజిస్టర్ చేసుకోవాలి. అంటే తమ పేరు అందులో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత చికిత్స చేయించుకోవాలి. ఎంత పెద్ద ఆసుపత్రిలో నైనా సరే-వచ్చే ఖర్చులో రూ.ఐదు లక్షలు భారత కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీనితో అట్టడుగు పేదలకూ ఖర్చు భరించలేని మధ్యతరగతి వారికి ఎంతో ఊరట లభిస్తుంది. అలా బాగానే ఉంది కదా? ఇందులో అవినీతి ఏముందీ అని ఎవరికైనా అనుమానం వస్తుంది.

ఆయుష్మాన్ భారత్‌ను అడ్డుపెట్టుకుని, అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేసిందో CAG వివరాలు ఇచ్చింది. అవి ఇలా ఉన్నాయి. 1. వేరు వేరు కారణాల వల్ల అంతకు ముందే చనిపోయిన వారికి ప్రభుత్వం 5లక్షల చొప్పున డబ్బు చెల్లించింది-అంటే, చెల్లించినట్టు రాసి పెట్టారు! అసలైతే ఆ డబ్బు ఏ దేశ నాయకుడి ఖాతాలోకి పోయిందో ప్రజలు సులభంగానే ఊహించుకోవచ్చు. 2. దేశ పౌరులు మొదట ఆ స్కీమ్‌లో తమ పేరు నమోదు చేసుకుంటారు కదా? అలా నమోదు చేసుకున్న విధానం చూస్తే మతిపోతుంది. ఎందుకంటే ఒకే ఒక్క మొబైల్ నెంబర్ నుండి లక్షల మంది పేర్లు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఒక కుటుంబంలోని సభ్యులు ఈ పథకం కింద లబ్ది పొందాలనుకుంటే, ఇంట్లో ఉన్న ఒక మొబైల్ నెంబర్‌తో నలుగురో, అయిదుగురో రిజిస్టర్ చేసుకుంటారు-నిజమే! అంతవరకు మనం అర్థం చేసుకోవచ్చు కానీ, ఒక్క మొబైల్ నెంబర్‌తో లక్షల మంది పేర్లు రిజిస్టర్ కావడం సాధ్యమా? పైగా అంతకు ముందెప్పుడో చనిపోయిన వారి ఎకౌంట్‌లలోకి డబ్బులు పంపినట్లు దొంగ లెక్కలు రాసుకున్నారు. అంటే వందల కోట్ల రూపాయల్లో ఎవరికీ ఏమి ఇచ్చింది లేదు. ఒక COOKED UP STORY తయారు చేసి దేశ నాయకులు డబ్బు లాగేశారన్నమాట. 3. దీని వల్ల ఆయుష్మాన్ భారత్ అంటే ఆయుష్మాన్ బీజేపీ అయిపోయిందన్న మాట: 4. ఈ పథకం వల్ల దేశ ప్రజలకు ఏ మాత్రం లాభం చేకూరలేదన్న విషయం CAG చెప్పకనే చెప్పింది. 5. ఏడున్నర లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారని చూపించిన ఒక మొబైల్ నెంబరు గురించి ఎంక్వయిరీ చేస్తే - బిఐయస్ డేటా విశ్లేషకులు చెప్పిన దాని ప్రకారం అసలు ఆ నెంబర్‌తో సిమ్ కార్డు లేదు. లక్షా ముప్పయి తొమ్మిది వేల మూడు మంది రిజిస్ట్రేషన్ 8888888888 (పి సార్లు8) నెంబరుగల మొబైల్‌తో చేశారు. తొంబయి ఆరువేల నాలుగు వందల అరవై మంది-అంటే సుమారు లక్ష మంది మొబైల్ నెంబరు 9000000000 (9-9 సున్నాలు)తో రిజిస్టరయ్యారు. ఇంకా 20 వేల మంది ఇలాంటి ఒక లేని, తప్పుడు మొబైల్‌తోను, మరో 15 వేల మంది మరో దొంగ మొబైల్ నెంబర్‌తోనూ అలా అలా లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. వారివారి దొంగ ఖాతాల్లోకి డబ్బులు పంపినట్లు రికార్డులు సృష్టించుకున్నారు అని CAG నిరూపించింది.

పొరపాటున విషయం బయటపడి విచారణ జరిగితే ఎలాగా? అన్న భయం లేకుండా, తెగించి రికార్డులు తయారు చేసుకున్నారు. ఇంకా సిఎజి చెప్పిన విషయమేమంటే- "లబ్దిదారులు" చనిపోయిన తేదీ తర్వాత- కొంత కాలం తర్వాత.. ఎప్పుడో వారి ఎకౌంట్లో డబ్బులు వేసినట్టు రికార్డు సృష్టించారన్నమాట! ప్రభుత్వ శాఖలో ఉండే మరణాల లిస్టు బయటికి తీసి ఇలా ఆరోగ్య పథకానికి డబ్బులిచ్చామని చక్కగా కథ అల్లుకున్నారు. మూర్ఖుల తెలివితేటలు ఇదిగో ఇలా ఉంటాయి! అందుకే జర్మన్ నవలా రచయిత ఫ్రాంజ్ కాఫ్కా అన్నాడు "వారి మూర్ఖత్వం వల్లనే వారికి వారిపై అంతగా నమ్మకం ఉంటుంది!" అని! మూర్ఖుల గురించి చెప్పాడు. ఆనాడు యూపిఎ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టడానికి సిఎజి ఇచ్చిన రిపోర్టు మార్చి కాంగ్రెస్‌ను దుమ్మెత్తి పోశారు కదా? మరి పదేండ్లుగా దోషుల్ని జైలుకు ఎందుకు పంపలేదూ? - అని సామాన్యుడు ప్రశ్నిస్తాడు కదా? అంటే - అవినీతి ఆనాటి ప్రతిపక్ష బీజేపీ దేనని తేలిపోయింది. ఇప్పుడు కూడా అధికార బీజేపీదే అవినీతి అని తేటతెల్లమయ్యింది. ఎందుకంటే ఈ వివరాలు తెచ్చి ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం లేదు. (న్యూట్రల్‌గా ఉండే మీడియా ఇచ్చిన ఆధారాలను బట్టే నేను విషయాలు తెలియజేస్తున్నాను) విపక్షాలు గెలిచినచోట డబ్బులు ఎగజల్లి అధికారం స్వంతం చేసుకోవడం అధికార బీజేపీకి మామూలై పోయింది. ఒక రకంగా అదీ అవినీతే. అన్నన్ని డబ్బులు ఎలా వెదజల్లుతున్నారంటే ఇదిగో ఇలా ప్రజలకు తెలియకుండా ప్రజల సొమ్ము స్వాహా చేస్తున్నారన్నమాట! బ్యాంకులు దోపిడీ చేసి లక్షల కోట్లు కొల్లగొట్టుకుపోయిన గుజరాత్ దొంగల్ని దేశం దాటించడం తర్వాత రుణమాఫీ పేరుతో అవన్నీ మాఫీ చేయడం బీజేపీ ప్రభుత్వపు అవినీతి కాదా? బీజేపీ పార్టీ ఒక 'వాషింగ్ మిషన్' అని అందులో వేసి ఉతుక్కుంటే ఎంతటి వారైనా నీతిమంతులుగా, పని మంతులుగా తయారై వచ్చి దేశ భక్తులవుతారని ఆ పార్టీ చెప్పకుంటుంది. అదే విధంగా ఈడీ బెదిరింపులకు లొంగి బీజేపీకి లొంగి అందులో చేరిపోయిన వారెం దరూ? అజిత్‌పవార్, యడ్యూరప్ప, జ్యోతిరాధిత్య, సిధియా, సుమేందు అధికారి, హిమంత బిశ్వశర్మ, ముకుల్ రాయ్, ప్రఫుల్ పటేల్, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమేశ్ పోఖ్రియాల్ -లాంటి వారు ఒకప్పుడు అవినీతిపరులు. బీజేపీలో చేరాక ఇప్పుడు నీతిపరుల య్యారు. ఇదంతా బీజేపీ ఆరెస్సెస్ - మోడీ ప్రభుత్వపు అవినీతి కాదా?



అర్హులైన వారికి ఇవ్వాల్సిన పెన్షన్ డబ్బును అక్రమంగా మళ్లించి - ప్రభుత్వ ప్రకటనలకు వాడుకున్నారని సిఎజి రిపోర్టు చేసింది. 2019 ఎన్ని కలకు ముందు పెద్ద పెద్ద హోర్డింగ్‌లకు, పేపర్, టి.వి. ప్రకటనలకు వాడుకుంది వృద్ధులకు, వికలాంగులకు, రిటైరయిన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వడం కన్నా- తమ ప్రభుత్వ ప్రకటనలే ముఖ్య మను కుంది - బీజేపీ కేంద్ర ప్రభుత్వం! మరో విషయమేమంటే 'బిజినెస్ లైన్' పత్రిక 31 జులై 2023న హర్యానా - ఫరీదాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌కు సంబంధించిన ఒక స్కాంపై సవివరమైన వ్యాసం ప్రచురించింది. 2015 - 2020 మధ్యకాలంలో వేర్వేరు పనులకు సంబంధించిన చెల్లింపులు కేవలం ఒకే ఒక్క కాంట్రాక్టర్‌కు చెల్లించారు. నియమ నిబంధనలకు నీళ్లొదిలి, కండ్లు మూసుకుని అదే ఫరీదాబాద్‌కు చెందిన బీజేపీ సపోర్టరయిన సత్‌బీర్‌సింగ్ అనే కాంట్రాక్టర్‌కు 5వేల వోచర్ల ద్వారా విడతల వారిగా రూ.వందకోట్ల పైచిలుకు డబ్బు చెల్లించారు. అక్కడేమైనా అభివృద్ధి జరిగిందా అంటే అదీ లేదు.అంతా పేపర్ మీదే ఉంది. ఆ కాంట్రాక్టర్ ద్వారా డబ్బంతా బీజేపీ అగ్ర నాయకులకు చేరిందని ప్రత్యేకంగా ఊహించనక్కర లేదు. మోడీ ప్రభుత్వంలో అవినీతి జరగలేదనీ, జరగడం లేదనీ కాదు- మీడియా ప్రజలకు చెప్పడం లేదు- అంతే!!

కోవిడ్ సమయంలో చూశాం. దేశ ప్రజలకు ఈ బీజేపీ ప్రభుత్వం కల్పించిన రక్షణ ఏమీలేదు. పైగా తమది నిజాయితీ గల ప్రభుత్వమని అగ్రనాయకులే ప్రచారం చేసుకుంటున్నారు. గ్యాసు, పెట్రోలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. టాక్సులు విపరీతంగా పెరిగాయి. 'హంగర్ ఇండెక్స్'లో దేశం అట్టడుగున ఉంది. మత కలహాలు చెలరేగే దేశాల జాబితాలో పైస్థానం ఆక్రమించింది. రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. రామాలయం పేరుమీద దాని చుట్టూ అభివృద్ధి చేస్తున్నామని చెప్పకుంటూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ ఒక్కొక్కటి బయటికి వస్తోంది. యువత అధికంగా ఉన్న దేశం మనది. అందుకే దేశ భవిష్యత్తు యువత నిర్ణయం మీదే ఆధార పడి ఉంది. జై శ్రీరామ్ నినాదం ఎవరికీ తిండిపెట్టదు. కూడు గుడ్డనివ్వదు. మోడీ ప్రభుత్వం పెంచి పోషిస్తున్న మూర్ఖత్వాన్ని బద్దలు కొట్టుకుని యువత బయటపడాలి! ఒకప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీని తన్ని తగలేసినట్టే ఇప్పుడు ఈ నార్త్ ఇండియా కంపెనీని కూడా వదిలించుకోవాలి. ప్రాథమిక హక్కుల్ని హరిస్తూ, రాజ్యాంగస్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న అవినీతి బీజేపీ ప్రభుత్వం అవసరమా? ఈ దేశ పౌరులు తక్షణం ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

> **కోవిడ్ సమయంలో చూశాం. దేశ ప్రజలకు ఈ బీజేపీ ప్రభుత్వం కల్పించిన రక్షణ ఏమీలేదు. పైగా తమది నిజాయితీ గల ప్రభుత్వమని అగ్రనాయకులే ప్రచారం చేసుకుంటున్నారు. గ్యాసు, పెట్రోలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. టాక్సులు విపరీతంగా పెరిగాయి. 'హంగర్ ఇండెక్స్'లో దేశం అట్టడుగున ఉంది. మత కలహాలు చెలరేగే దేశాల జాబితాలో పైస్థానం ఆక్రమించింది. రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. రామాలయం పేరుమీద దాని చుట్టూ అభివృద్ధి చేస్తున్నామని చెప్పకుంటూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ ఒక్కొక్కటి బయటికి వస్తోంది.**

> **ఆయుష్మాన్ భారత్‌ను అడ్డుపెట్టుకుని, అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేసిందో CAG వివరాలు ఇచ్చింది. అవి ఇలా ఉన్నాయి. 1.వేరు వేరు కారణాల వల్ల అంతకు ముందే చనిపోయిన వారికి ప్రభుత్వం 5లక్షల చొప్పున డబ్బు చెల్లించింది-అంటే, చెల్లించినట్టు రాసి పెట్టారు! అసలైతే ఆ డబ్బు ఏ దేశ నాయకుడి ఖాతాలోకి పోయిందో ప్రజలు సులభంగానే ఊహించుకోవచ్చు. 2. దేశ పౌరులు మొదట ఆ స్కీమ్‌లో తమ పేరు నమోదు చేసుకుంటారు కదా? అలా నమోదు చేసుకున్న విధానం చూస్తే మతిపోతుంది. ఎందుకంటే ఒకే ఒక్క మొబైల్ నెంబర్ నుండి లక్షల మంది పేర్లు రిజిస్టర్ అయి ఉన్నాయి. ఒక కుటుంబంలోని సభ్యులు ఈ పథకం కింద లబ్ది పొందాలనుకుంటే, ఇంట్లో ఉన్న ఒక మొబైల్ నెంబర్‌తో నలుగురో, అయిదుగురో రిజిస్టర్ చేసుకుంటారు-నిజమే! అంతవరకు మనం అర్థం చేసుకోవచ్చు కానీ, ఒక్క మొబైల్ నెంబర్‌తో లక్షల మంది పేర్లు రిజిస్టర్ కావడం సాధ్యమా?**

సోషల్ మీడియాపై అణచివేత



సోషల్ మీడియా మన దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ఒకప్పుడు ఫొటోల షేరింగ్, చాటింగ్ వరకే పరిమితమైన సోషల్ మీడియా- ప్రస్తుతం రోజువారీ రాజకీయ పరిణామాలు సహా అన్నిరకాల విశేషాలకు వేదికగా వుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి దీనిని మలుచుకుంటున్నాయి. అంతేకాదు..ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టే ఉద్యమాలు, నిరసనలకు ఇది వేదిక కూడా. దేశంలోని అత్యధిక విజువల్ మీడియాను బ్లాక్ మెయిల్ చేసి బెదిరిస్తున్న మోడీ సర్కార్ కన్ను ఇప్పుడు సోషల్ మీడియాపై పడింది. 'సోషల్ మీడియా అనేది అంతిమ సమీకరణం. దీనిలో నిమగ్నం కావాలనుకునేవారికి ఇది గొంతుక అవుతుంది' అంటారు అమి జో మార్టిన్. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటానికి, ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశంలో చెలరేగిన నిరసనలకు ఎంతగానో తోడ్పడింది. బీజేపీ ప్రభుత్వం రెండు సమ్మెలను నిరంకుశంగా అణిచివేసేందుకు యత్నించినప్పుడు సోషల్ మీడియా వేదికగా నిరసనాగ్రహాలు వెల్లువెత్తాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సివచ్చింది.

ట్యునీషియా వంటి దేశాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజావెల్లువ రావడంలో సోషల్ మీడియా కీలక భూమిక వహించింది. నియంతలను అధికారం నుండి తరిమికొట్టడానికి ప్రజల చేతిలో వజ్రాయుధంగా మారింది. గ్రీస్, స్పెయిన్, ఇజ్రాయిల్‌లో కార్మికుల నిరసనలు, గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న విధ్వంసకాండ వంటి పలు అంశాలను కార్పొరేట్ మీడియా కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తే, సోషల్ మీడియా ఆ గుట్టును రట్టు చేసింది. ముఖ్యంగా భారతదేశంలో పాలకులు తమ ఎజెండాకు అనుగుణంగా నకిలీ వార్తలు, వక్రీకరించిన వాస్తవాలు, తప్పుడు ప్రచారాలను వ్యాప్తిచేయడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని నినదిస్తున్న రైతు సంఘాల ఆందోళనను అణిచివేయడంలో భాగంగా ప్రభుత్వం సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపుతోంది. రైతు నాయకులు, రైతు సంఘాలు, జర్నలిస్టులు, మీడియా సంస్థలు తమ సోషల్ మీడియా ఖాతాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నోటీసులు పంపడమే ఇందుకు ఉదాహరణ.

ఒక్క 'ఎక్స్' (ట్విటర్)కే కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటివరకు 177 నోటీసులు అందాయి. ట్వీట్లను ఉపసంహరించుకోవాలని, ఖాతాలను మూసివే యాలని లేని పక్షంలో చర్యలు తప్పవని బెదిరించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ఇతర సామాజిక మాధ్యమాలకు కూడా రైతు నిరసన పోస్టులు, వీడియోలు, చిత్రాలను ఉపసంహరించుకోవాలని కేంద్రం నుండి ఇటీవల నోటీసులు వెళ్లాయి. మరీ దారుణమైన విషయమేమిటంటే, 2020-21 రైతుల నిరసనపై రూపొందించిన 'కిసాన్ సత్యాగ్రహ' డాక్యుమెంటరీ బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మార్చి ఒకటిన ప్రదర్శించాల్సి వుండగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆ ప్రదర్శనను అడ్డుకుంది. 'నేను వజ్రాల ధరకు గాజును కొనుగోలు చేయను. మానవత్వంపై దేశభక్తి గెలవడానికి నేను ఎన్నటికీ అనుమతించను' అన్న ఠాగూర్ మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం ఎంతైనా సముచితం. గతంలోనూ నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌పై తీసిన 'భారతీయ తార్కికుడు' అనే డాక్యుమెంటరీనీ ఇలాగే అడ్డుకున్నారు.

చివరికి గూగుల్ ఏఐ సాధనం 'జెమిని'పై కూడా కేంద్రం జోక్యం చేసుకుంది. 'మోడీ ఫాసిస్టు కాదా?' అని అడిగితే, 'ఆయన విధానాలు ఫాసిస్టు తరహాలోనే ఉన్నాయని' జెమిని సమాధానమివ్వడం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. జమ్మూ-కశ్మీర్ విభజన విషయంలో, మణిపూర్ విషాదంలో- నెలల తరబడి ఇంటర్నెట్‌ను నిషేధించారు. రైతుల సమ్మె దృష్ట్యా ఎటువంటి కారణం లేకుండా హర్యానా, యూపీ, రాజస్థాన్‌లలో ప్రభుత్వం ఇంటర్నెట్‌ను బంద్ చేసింది. 2012 నుండి 2023 మధ్యకాలం వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 741 సార్లు ఇంటర్నెట్ నిషేధించబడింది. ఒక్క ఇంటర్నెట్ బ్యాన్ వల్ల దేశానికి జరిగిన ఆర్థిక నష్టం దాదాపు రూ.5వేల కోట్లు. మోడీ పాలనలో భావప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఎలా కుంచించుకు పోతున్నాయో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ప్రయివేటీకరణ..కేంద్రీకరణ...కాషాయీకరణ

2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర పాలకులు విద్యపై పెట్టుబడి అనేది ఉత్తమ ఫలితాలను ఇస్తుందని విద్యారంగానికి జీడీపీలో కొఠారి కమిషన్ సూచించిన విధంగా ఆరు శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దశాబ్దకాలంలో 2014 నుండి 2024 మధ్య సరాసరిన జీడీపీలో 0.44 శాతం నిధులు మాత్రమే ప్రతి ఏడాది కేటాయించడం జరిగింది.కానీ ఇదేకాలంలో కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. 14.5 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ల రుణాలను రద్దు చేశారు.కార్పొరేట్ పన్నుల మినహాయింపులను విద్యపై ఖర్చుతో పోల్చినట్లయితే ఈ నూతన సంస్కరణల యుగంలో పాలకుల ప్రాధాన్యత దేనికో అర్థమవుతుంది.ఈ పాలకులు కార్పొరేట్ల పట్ల చాలా పెద్ద మనసుతో వ్యవహరిస్తున్నారు. అదే పేదల చదువుల విషయంలో సబ్సిడీలను అభివృద్ధి నిరోధకాలు అని ప్రచారం చేస్తున్నారు. ప్రజలు కడుతున్న పన్నులన్నీ ఎక్కడికి వెళ్తున్నాయి? అంటే అవి కార్పొరేట్ల జేబుల్లోకి వెళ్తున్నాయి.. ఎవరికి సబ్సిడీలివ్వాలి అంటే ప్రస్తుత పాలకులు కార్పొరేట్లను సబ్సిడీలివ్వడానికి ఎన్నుకున్నారు. ఈ కార్పొరేట్లకు ఇస్తున్న సబ్సిడీల వలన దేశానికి ఈ కాలంలో ఉద్యోగాల సంఖ్య ఏమైనా పెరిగిందా అంటే పెరగలేదని సమాధానం వస్తుంది.



జి. వెంకటేశ్వరరావు
9966135289

కార్పొరేట్లకిచ్చే సబ్సిడీలు ఉద్యోగాలను పెంచుతాయని ప్రభుత్వం సమర్థించుకుంటుంది కానీ వాస్తవంలో పెట్టుబడి నిర్ణయాలు అనేవి భవిష్యత్తు డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. డిమాండ్‌ను పెంచకుండా కార్పొరేట్ సబ్సిడీలను ఇవ్వడం ద్వారా పెట్టుబడులు ఎలా పెరుగుతాయి. ఒకవేళ పెట్టుబడుల ద్వారా డిమాండ్ పెరిగితే ఉద్యోగుల సంఖ్య పెరగాలి కానీ 2012లో 2.1శాతంగా ఉన్న నిరుద్యోగిత స్థాయి 2024 నాటికి 6.6 శాతానికి ఎందుకు పెరిగింది. నైపుణ్యాలు లేకపోవడం అనే ప్రభుత్వ వాదన తీసుకున్న నైపుణ్యాలు పెంచడానికి కార్పొరేట్లకు సబ్సిడీలివ్వడం కన్నా విద్యపై అధికంగా ఖర్చు పెట్టడం ఒకటే మార్గం కదా?ఒక్క కార్పొరేట్ టాక్స్ మినహాయింపులను తొలగిస్తేనే ప్రస్తుతం విద్యపై పెడుతున్న ఖర్చు కన్నా పది రెట్లు ఖర్చును పెంచవచ్చు. కానీ పాలకులు కార్పొరేట్ల వైపే నిలబడ్డారు.

నూతన జాతీయ విద్యా విధానం-2020

నూతన జాతీయ విద్యా విధానం 2020 అనేది పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్య కోర్సులను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులను కులవృత్తుల వైపు ప్రోత్సహించే లాగా పాతకాలపు కుల వ్యవస్థను పునర్ నిర్మించడానికి భూమిక ఏర్పాటు చేస్తుంది. అంతేకాకుండా ఉన్నత విద్యలో సైతం ఏ దశలోనైనా సర్టిఫికేషన్‌ను గ్యారెంటీ చేయడం ద్వారా వారిని చదువుల నుండి మానివేసేలాగా ప్రోత్సహి స్తుంది. దీని ప్రభావం పేదవర్గాలపై ప్రతికూలంగా ఉంటుంది.ఈ విధానంలో పదేపదే స్వచ్ఛంద సంస్థల సహకారంతో పూర్వ ప్రాథమిక విద్య నిర్వహించాలి అని వల్లించడం చూస్తుంటే ప్రస్తుత ప్రభుత్వసైద్ధాంతిక నేపథ్యం ఉన్న సంస్థల చేతుల్లోకి వీటిని అప్పగించే ఆలోచన ఏమైనా ఉందా అనే అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర పెత్తనం కిందకి తీసుకుపోయేలాగానిబంధనలను రూపొందించారు. అందువలన మొత్తంగా ఈ విద్యా విధానం భారతదేశాన్ని తిరోగమనడంలో నడిపిస్తుంది.

పాఠశాలల మూసివేత..అభ్యసనాస్థాయి

దేశవ్యాప్తంగా తక్కువ నమోదు పేరుతో లక్షల సంఖ్యలో పాఠశాలలను ఈ దశాబ్దకాలంలో మూసివేశారు.యు డైస్ లెక్కల ప్రకారం 2014లో 15,18,160 పాఠశాలలు ఉంటే 2022 లెక్కల ప్రకారం 14,08,115 పాఠశాలలు మాత్రమే ఉన్నాయి అంటే 1,10,045 పాఠశాలలను ఈ దశాబ్దకాలంలో మూసేశారు.ఈ పాఠశాలల్లో చదువుతున్న బడుగు బలహీన వర్గాల పిల్లలు, గిరిజన ప్రాంతాల్లో పిల్లల పరిస్థితి ఏమిటి. దేశంలో ప్రస్తుతం ప్రతి ఏడు పాఠశాలల్లో ఒక పాఠశాల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్నాయి అంటేనే ఆయా పాఠశాలల్లో అందుతున్న విద్య నాణ్యత ఏమిటో మనకు అర్థమవుతుంది.



అవగాహనతో కూడిన కనీస అభ్యసన, సంఖ్యాత్మక జ్ఞానం 2025 నాటికి సాధించడం లక్ష్యంగా ప్రకటించింది.కానీ 2022 అసర్ నివేదిక ప్రకారం మూడో తరగతి విద్యార్థులలో 25 శాతం మంది మాత్రమే సంబంధిత తరగతి పఠనా సామర్థ్యాలను కలిగి ఉన్నారని 20 శాతం మంది మాత్రమే ఆ తరగతికి చెందిన గణిత సామర్థ్యం కలిగి ఉన్నారని తెలియజేస్తుంది.ఈ నివేదిక దేశంలోనే భవిష్యత్ తరాలకు అందిస్తున్న విద్యా నాణ్యతలో డొల్లతనాన్ని బట్టబయలు చేస్తుంది. పాఠశాలల్లో తగినంత ఉపాధ్యాయులను నియమించకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలతో ఈ కనీస అభ్యసన సామర్థ్యాలను ఎలా పెంచగలం. డిసెంబర్ 31,2022 నాటికి దేశవ్యాప్తంగా 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్నాయని స్వయంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి పార్లమెంటు సాక్షిగా ప్రకటించారు. ఖాళీలన్నిటిని భర్తీ చేయడానికి కావలసిన నిధులను కేటాయించకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద వర్గాల విద్యా నాణ్యతను పెంచుతాము అనే మాటలతో ఉపయోగం ఏముంటుంది.

2017 నుంచి పాఠశాల పాఠ్య పుస్తకాలను ఎన్సీఈఆర్టీ మార్పు చేపట్టింది. 2022 నాటికి ఇది తీవ్రస్థాయికి చేరింది. మొగలుల యుగం, సామాజిక ఉద్యమాలు, కులవ్యవస్థ, ఆర్ఎస్ఎస్ నిషేధం, గాంధీహత్య, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, ప్రజాస్వామ్యం పాఠాలను తొలగించారు. ఈ తొలగించిన పాఠ్యాంశాలను గమనించిన వారికి ఎవరికైనా ప్రస్తుత పాలకుల సైద్ధాంతిక నేపథ్యానికి విరుద్ధంగా ఉన్న అంశాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారనేది స్పష్టం అవుతుంది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలలో ఆ శాస్త్రీయ అంశాలను చేర్చుతున్నారు. భవిష్యత్ తరాలైన చిన్నారి మెదళ్లకు వాస్తవ చరిత్ర తెలియనీయకుండా విభజనను ప్రోత్సహించేలాగా సిలబస్ మార్పులు చేయడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం.

ఉన్నత విద్యా బడ్జెట్ కేటాయింపులు

ఏ దేశమైనా విశ్వవిద్యాలయాలలో పెట్టుబడులు పెట్టకుండా అభివృద్ధి సాధించడం అసాధ్యం. పెట్టుబడిదారీ దేశాలైన అమెరికా ఇంగ్లాండ్ వంటి దేశాలు కూడా చాలా ఏండ్లపాటు ఉన్నత విద్యకు సబ్సిడీలు ఇవ్వడం జరిగింది ఇప్పటికీ ఇస్తూనే ఉన్నాయి.అమెరికా1960 నుండి జీడీపీలో ఐదు శాతం పైన విద్యకు కేటాయింపులు చేస్తుంది. ఉన్నత విద్యలో ఒక శాతం తగ్గకుండా ఖర్చు చేస్తుంది. కానీ మన దేశంలో ఉన్నత విద్యపై ఖర్చు యునెస్కో నివేదిక ప్రకారం సెనెగల్, ఇథియోపియా, ఘనాదేశాలకన్నా తక్కువ ఉంది.2024 మధ్యంతరం బడ్జెట్లో యూజీసీ నిధులను 61శాతానికి పైగా తగ్గించారు. ఉన్నతి విద్య నగదు ఏజెన్సీ (హెచ్ఇఎఫ్ఏ) 2017లో ప్రారంభించి విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపు పద్ధతిని గ్రాంట్స్ నుండి లోన్స్‌కి మార్చారు. దీంతో యు.జి.సిలో (గ్రాంట్స్)కి ప్రాధాన్యత లేకుండా పోయింది.దీనితో ఉన్నత విద్యా సంస్థలు మౌలిక సదుపాయాల కొరకు హెచ్ఇఎఫ్ఏ నుండి పదేండ్లలో తిరిగి చెల్లించే లోన్లపై ఆధారపడివలసి వస్తుంది. ఈ లోన్లు తిరిగి చెల్లించడం విశ్వవిద్యా లలకు భారంగా మారింది. దీంతో ఈ భారాలను విద్యార్థులపై ఫీజుల పెంపు మరి ఇతర మార్గాల ద్వారా వేయవలసి వస్తుంది. ఇది పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుంది.విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రయివేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు అనేక రూపాలలో చేస్తున్న పోరాటాలు విజయవంతం అయితేనే ఈ విధానాలను నిలువరించగలము.

> **2017 నుంచి పాఠశాల పాఠ్య పుస్తకాలను ఎన్సీఈఆర్టీ మార్పు చేపట్టింది. 2022 నాటికి ఇది తీవ్ర స్థాయికి చేరింది. మొగలుల యుగం, సామాజిక ఉద్యమాలు, కులవ్యవస్థ, ఆర్ఎస్ఎస్ నిషేధం, గాంధీహత్య , డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, ప్రజాస్వామ్యం పాఠాలను తొలగించారు. ఈ తొలగించిన పాఠ్యాంశాలను గమనించిన వారికి ఎవరికైనా ప్రస్తుత పాలకుల సైద్ధాంతిక నేపథ్యానికి విరుద్ధంగా ఉన్న అంశాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారనేది స్పష్టం అవుతుంది.**



317 జీవో బాధిత ఉద్యోగులకు
న్యాయం చేయాలి

- స్థానికత ఆధారంగా సొంత జిల్లాకు తేవాలి
- 317, 46 జీవోలను రద్దు చేయాలి : మంత్రివర్గ ఉపసంఘానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వినతి
- అధ్యయనం చేసి సీఎంకు నివేదిక సమర్పిస్తాం : దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సత్వరమే న్యాయం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మంత్రివర్గ ఉపసంఘాన్ని డిమాండ్ చేశాయి. స్థానికత ఆధారంగా ఉద్యోగులను సొంత జిల్లా, జోన్‌కు బదిలీ చేయాలని కోరాయి. ఉద్యోగులకు నష్టం చేసిన 317, 46 జీవోలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశాయి. గురువారం సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యోగ సంఘాలతో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు మంత్రులు డి శ్రీధర్‌బాబు, అధికారులు పీఆర్సీ చైర్మెన్ శివశంకర్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, సచివాలయ సర్వీసెస్ కార్యదర్శి నిర్మల, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు. 317, 46 జీవోలకు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సంఘాల విజ్ఞాపనలు, సలహాలు, సూచనలను స్వీకరించామని చెప్పారు. వాటిని పరిశీలించి అధ్యయనం చేసి తగు నివేదికను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పిస్తామని వివరించారు. సానుకూలంగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు డి శ్రీధర్‌బాబుకు కె జంగయ్య, చావ రవి, లక్ష్మారెడ్డి, ఈ గాలయ్య, పి మాణిక్‌రెడ్డి, గోపాల్‌నాయక్, సృజన, లివిన్‌స్టన్ (టీఎస్‌యూటీఎఫ్), మారం జగదీశ్వర్, కస్తూరి వెంకటేశ్వర్లు (టీఎన్జీవో), ఏలూరి శ్రీనివాసరావు, ఉపేందర్‌రెడ్డి, మాచర్ల రామకృష్ణగౌడ్ (టీజీవో), పింగిలి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్టీయూటీఎస్), జి సదానందంగౌడ్, ఎం పర్వత్‌రెడ్డి (ఎస్టీయూటీఎస్), హన్మంతరావు, నవాత్ సురేష్ (తపస్), పి రాజభాను చంద్రప్రకాశ్, ఆర్ రాజగంగారెడ్డి, బి తుకారాం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ), పి మధుసూదన్‌రెడ్డి (జీజేఎల్ఏ), కె కృష్ణుడు (బీసీటీఏ), ఎండీ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి (టీఎస్టీయూ), ఎం వీరాచారి, లక్ష్మీకాంతరెడ్డి, సానా సురేందర్, రవీందర్ (ఎల్సీజీటీఏ), టి లింగారెడ్డి (డీటీఎఫ్), రాధాకృష్ణ (టీపీటీయూ)తోపాటు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, డ్రైవర్ల సంఘం, రెవెన్యూ, పంచాయతీరాజ్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని వినతిపత్రాలను సమర్పించారు.

బాధితులందరికీ న్యాయం చేయాలి : టీఎస్‌యూటీఎఫ్

317, 46 జీవో బాధితులందరికీ సత్వరమే న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మంత్రివర్గ ఉపసంఘాన్ని కోరింది. 317 జీవోను సాఫీగా అమలు చేసి బదిలీలు, పదోన్నతుల్లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని సూచించింది. సానుకూలంగా సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని తెలిపింది. స్థానికేతర మల్టీజోన్/జోన్/జిల్లాకు కేటాయించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులను వారి మొదటి ఆప్షన్ ప్రకారం స్థానిక మల్టీజోన్/జోన్/జిల్లాలకు బదిలీ చేయాలని పేర్కొంది. ఖాళీలు అందుబాటులో లేకుంటే సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి ఉద్యోగ విరమణ కారణంగా ఏర్పడే వాటిలో దశలవారీగా సర్దుబాటు చేయాలని సూచించింది. నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించిన టీఆర్టీ-2017లో ఎంపికై స్థానికేతర జిల్లాలో నియామకమైన ఉపాధ్యాయులను వారి ఆప్షన్ మేరకు స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని కోరింది. ఉమ్మడి పది జిల్లాలను పది జోన్లుగా విభజించాలని పీఆర్టీయూటీఎస్ సూచించింది. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలనీ, ఆ జిల్లాలో ఖాళీల్లేకుంటే సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించాలని కోరింది. ఉమ్మడి జిల్లా పరిధిలో వారు కోరుకున్న జిల్లా కాకుండా ఇతర జిల్లాకు కేటాయించబడిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని సూచించింది. అశాస్త్రీయంగా విభజించబడ్డ మల్టీ జోన్, జోన్లు, జిల్లాలు, మండలాల వ్యవస్థ వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని టీఎస్‌జీహెచ్‌ఎంసీ విమర్శించింది. ఉమ్మడి పది జిల్లాలను పది జోన్లుగా ఏర్పాటు చేయాలని సూచించింది. ఆర్టికల్ 371-డికి విరుద్ధంగా ఇచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులు-2018ని రద్దు చేస్తేనే 317 జీవో రద్దవుతుందనీ, తద్వారా సమస్య పరిష్కారమవుతుందని ఎల్సీజీటీఏ తెలిపింది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	66,110	▲ 270
22 క్యారెట్లు	60,600	▲ 250
కిలో వెండి	80,000	▲ 1500

చికెన్ ధరలు హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

కాంగ్రెస్ పాలనకు వంద రోజులు

అనుమానాలు.. అవహేళనలను అధిగమించి 'సెంచరీ'

- అప్పులు.. ఆర్థిక పరిమితులున్నా అమలు చేసి తీరతామంటూ భరోసా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేసీఆర్ హయాంలో పదేండ్లపాటు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఫరవాలేదని అనిపించినప్పటికీ... 'అహంకారాన్ని' ఎక్కువ కాలం భరించలేమంటూ రాష్ట్ర ప్రజలు తీర్పునిచ్చారు. నిరంకుశ నైజాంనే నేలకూల్చిన ఈ గడ్డ మీద 'నియంతృత్వానికి' తావు లేదంటూ బీఆర్ఎస్‌ను తిరస్కరించిన జనం... కాంగ్రెస్‌కు పట్టంగట్టారు. ఇదే సమయంలో ఆరు గ్యారెంటీలు, ఉద్యోగ నియామకాలు, రైతు భరోసా తదితరాంశాలతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. భట్టి విక్రమార్క, ఉత్తమ్, కోమటిరెడ్డి తదితర సీనియర్లు ఉన్న కాంగ్రెస్‌లో... సీఎం ఎవరవుతారనే ఉత్కంఠతకు తెరదించుతూ ఆ పార్టీ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌కు అవకాశమిచ్చింది.

ఇలాంటి పరిణామాల నేపథ్యంలో గతేడాది డిసెంబరు 7న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, పాలనా పగ్గాలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి... ఇటు ప్రభుత్వంలోనూ, అటు పార్టీలోనూ తనదైన శైలిలో ముందుకెళుతున్నారు. ఆయన సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే... మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు పథకాలను అమల్లోకి తెచ్చింది. వీటితోపాటు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సౌకర్యాలకు శ్రీకారం చుట్టింది. తాజాగా ఇందిరమ్మ ఇండ్లకు అంకురార్పణ చేసింది. తద్వారా ఆరు గ్యారెంటీల పరిధిలో ఉన్న 13 అంశాలకు సంబంధించి ఐదింటిని పూర్తి చేశామని ప్రకటించింది. మిగతా 8 అంశాలపై విధానపరమైన నిర్ణయాలు తీసుకుని, నిధులు కేటాయించాల్సి ఉంది. వాటిని కూడా అమలు చేయటం ద్వారా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు ప్రజల విశ్వాసాన్ని ప్రభుత్వం చూరగొనాలి. నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి తమ ఆశలు అడియాశలైన నేపథ్యంలో బీఆర్ఎస్‌ను గద్దె దించి, కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 'ఆపన్న హస్తం' అందించిన జనం... రేవంత్ సర్కార్ తమకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తుందనే విశ్వాసంతోనే ఉన్నారు. ఆ విశ్వాసాన్ని కాంగ్రెస్ సర్కార్ కాపాడుకోవాలి.

అయితే ఆరు గ్యారెంటీల అమలుకు నిధుల కొరత ప్రధాన అవరోధంగా ఉందంటూ ప్రభుత్వ పెద్దలు ఎన్నోసార్లు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గత బీఆర్ఎస్ హయాంలో లెక్కకు మిక్కిలిగా చేసిన అప్పులపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా శ్వేతపత్రాన్ని ప్రకటించిన సంగతి విదితమే.

కానీ రాష్ట్ర అప్పులు, ఆర్థిక పరిస్థితి అనేవి ఎన్నికలకు ముందు కూడా మనకు తెలిసిన విషయాలేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అందువల్ల వాటి సాకుతో గ్యారెంటీల అమలుపై వెనకడుగేస్తే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు. అందువల్ల అప్పులు, ఆర్థిక పరిస్థితులు, పరిమితులెన్ని ఉన్నా... ఆరు గ్యారెంటీలను అమలు చేయాల్సిందేనని ప్రతిపక్షాలకు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన తరుణంలో ప్రజలు, ప్రతిపక్షాల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని రేవంత్ ప్రభుత్వం ముందుకెళుతుందని ఆశిద్దాం.

ఉద్యోగ నియామకాలతోపాటు జాబ్ క్యాలెండర్ అమలుకు ప్రయత్నాలు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3కు సంబంధించి డైరెక్టు రిక్రూట్‌మెంట్‌పై దృష్టి సారించిన సర్కార్. గత ప్రభుత్వ హయాంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దయింది. కొత్త ప్రభుత్వం అప్పటి పరీక్షను రద్దు చేసి, 563 పోస్టులతో గ్రూప్ -1 కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. మెగా డీఎస్సీని ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసిన సర్కార్

వంద రోజుల్లో కాంగ్రెస్ సర్కారు చేపట్టిన చర్యలు...

- సీఎంగా రేవంత్ ప్రమాణం చేసిన రోజున్నే (డిసెంబరు 7, 2023) ప్రగతి భవన్ ముందున్న కంచె తొలగింపు, ఆ భవన్‌కు ప్రజా భవన్‌గా నామకరణం, అక్కడ మహాత్మా జ్యోతిబాపూలే వేదికగా ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం. తద్వారా వారంలో రెండు రోజులపాటు ప్రజలు తమ సమస్యలను అధికారులకు నేరుగా చెప్పుకునే అవకాశం
- గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం. ఆ సందర్భంగా గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరణ
- అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పన. ఈ పథకం ద్వారా ఇప్పటికే దాదాపు 23 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని వెల్లడి
- ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు
- మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలు
- అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను అందించే గృహ జ్యోతి పథకం ప్రారంభం.
- ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం. రూ.22,500 కోట్లతో 4,50,000 ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తామంటూ సీఎం ప్రకటన. అర్హులైన నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయం.
- అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 29,384 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ప్రభుత్వం. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత. వీరిలో 53 శాతం మంది పురుషులు, 47 శాతం మంది మహిళలున్నారు. మెడికల్ అండ్ హెల్త్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, టీఎస్‌పీఎస్సీ, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ద్వారా చేపట్టిన నియామకాలు. అదనంగా సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామకాలు
- గత ప్రభుత్వ హయాంలోని రిజర్వేషన్ల వివాదాలు, ఫలితాల నిలిపివేతలు, కోర్టు కేసులన్నింటినీ ఒక్కటొక్కటిగా అధిగమించిన సర్కార్, ఆ క్రమంలో టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన. గత పాలకవర్గాన్ని తప్పించి కొత్త చైర్మెన్‌ను, బోర్డు సభ్యుల నియామకం. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. విద్యుత్ విభాగంలో జరిగిన అవినీతి అక్రమాలు, అవకతవకలపై అసెంబ్లీలో చర్చ. సాగునీటి పారుదల విభాగంపై శ్వేతపత్రం విడుదల
- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటనపై విజిలెన్స్ విచారణను చేపట్టటంతోపాటు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలసంఘానికి లేఖ రాసిన సర్కార్. మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన పిల్లర్లను పరిశీలించిన ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం
- సీఎం రేవంత్ విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర రక్షణ శాఖ, కంటోన్మెంట్ ఏరియాలో రక్షణ శాఖ భూములపై కారిడార్ల నిర్మాణానికి ఆమోదం. మెహిదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న రక్షణ భూముల అప్పగింతకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్-రామగుండం రాజీవ్ రహదారిపై రూ.2,232 కోట్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం శంకుస్థాపన
- జాతీయ రహదారి 44 (హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు)పై రూ.1,580 కోట్లతో డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి పునాది రాయి వేసిన సీఎం రేవంత్
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణకు ఫరూక్ నగర్ వద్ద ముఖ్యమంత్రి శంకుస్థాపన. మొత్తం 70 కిలోమీటర్ల కొత్త మెట్రో రైలు మార్గం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రూ.2,700 కోట్లతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సందర్భంగా పెట్టుబడులను ఆకర్షించటంలో కొత్త రికార్డు సృష్టించిన తెలంగాణ. దాదాపు రూ.40,232 కోట్ల పెట్టుబడులు, 30 వేల ఉద్యోగాల కల్పనకు భరోసా.
- 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2ను త్వరలోనే ప్రారంభిస్తామని 'బయో ఆసియా-2024' సదస్సులో ప్రకటించిన సీఎం రేవంత్. రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పిస్తామని వెల్లడి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల నిర్మాణానికి యోచన.
- ధరణి సమస్యల పరిష్కారానికి అయిదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ
- హైదరాబాద్‌లో ప్రపంచ పర్యాటక ప్రాంతంగా మూసీ పునరుజ్జీవం, పరివాహక ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టు. డిజైన్లు, ప్రతిపాదనలకు రంగం సిద్ధం
- హైదరాబాద్‌లో డ్రగ్స్ చలామణిపై ఉక్కుపాదం. నార్కోటిక్స్ నియంత్రణ. టీ.ఎస్.నాబ్‌ను గ్రే హౌండ్స్, ఆక్టోపస్ తరహాలో పటిష్టం చేసేందుకు నిర్ణయం
- సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా. 43 వేల మంది కార్మికులకు వర్తించేలా రూపకల్పన
- బంజారాహిల్స్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ ప్రారంభోత్సవం
- ఎల్బీనగర్ సమీపంలోని బైరామల్ గూడా ఫ్లై ఓవర్ ప్రారంభం
- ఉప్పల్ సమీపంలో నల్లచెరువు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం
- హైకోర్టు నూతన భవనానికి వందెకరాల స్థలం కేటాయింపు
- పారిశ్రామిక అభివద్ధికి 'మెగా మాస్టర్ ప్లాన్ 2050'
- ఇండియన్ నేవీ రాడార్ స్టేషన్, వికారాబాద్ ఫారెస్ట్ ఏరియాలో దేశంలో రెండో వీఎల్ఎఫ్ స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయం
- ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నియోజకవర్గాల అభివద్ధికి రూ.1,190 కోట్ల కేటాయింపు
- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన. మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలకు భూమిపూజ
- గద్దర్ విగ్రహం ఏర్పాటు. కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డ్
- మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు శంకుస్థాపన
- హుస్సేన్ సాగర్ చుట్టూ దుబాయ్ మోడల్ టూరిజం స్పాట్ ఏర్పాటుకు నిర్ణయం
- ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల పారితోషకం
- స్వయం సహాయక సంఘాలకు చేయూతగా కొత్త కార్యక్రమాలు
- ఉర్దూ అకాడమీ ఏర్పాటు
- ఎన్ఆర్ఎస్సీతో స్టేట్ ఏవియేషన్ అకాడమీ ఒప్పందం, డ్రోన్ పైలెట్లకు శిక్షణ
- రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం
- వాహనాల రిజిస్ట్రేషన్ల నెంబర్లకు ఉండే టీఎస్‌ను టీజీగా మార్పు, వంద కొత్త బస్సుల ప్రారంభం, రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ

అవుటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ. గొర్రెల పంపిణీ పథకం, చేప పిల్లల పెంపకం పథకాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశం. ధరణి పోర్టల్ ఏజెన్సీపై విచారణ. మిషన్ భగీరథ విలేజ్ లెవల్ ఇంట్రా పైపులైన్లు, గ్రామాల్లో పనులపై విచారణ. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ అధికారుల పాత్రపై విచారణ. వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో రూ. వందల కోట్లకుపైగా వ్యాట్ ఎగవేత. దీనిపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.

రైతుల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం. రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అనుసంధానం. తొలి విడతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ఏర్పాటు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో రూ.97 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన వ్యవసాయ శాఖ.

దరి చేరని ధరణి స్పెషల్ డ్రైవ్

మొత్తం దరఖాస్తులు 2.45 లక్షలు

- ఇప్పటి వరకు లక్షా 20 వేల ఫైళ్ల పరిశీలన
- మొక్కుబడిగా నివేదికలు తయారు చేస్తున్నారనే ఆరోపణలు
- మళ్లీ సమస్యలు తలెత్తుతాయని అనుమానాలు
- పోర్టల్‌లో ఇంకా నమోదు కాని సవరణలు
- అధికారాల బదలాయింపుపై పీటముడి
- చరిత్ర పునరావృతమౌతుందని సర్వత్రా ఆందోళన

భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెండో విడత స్పెషల్ డ్రైవ్ మొక్కుబడిగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో తూతూ మంత్రంగా విచారణ చేసి నివేదికలను తయారు చేస్తున్నారు. మొత్తం 2.45 లక్షల దరఖాస్తులకు గాను మొదటి విడతలో లక్ష , రెండవ విడతలో ఇప్పటి వరకు 20 వేల వరకు ఫైళ్లను పరిశీలించి నివేదికలు తయారు చేశామని అధికారులు అంటున్నారు.. అయితే అందులో ఒక్క ఆర్జీ కూడా ధరణి పోర్టల్‌లో అప్‌డేట్ కాలేదు. గత సర్కార్ హయాంలో గందరగోళంగా నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళనను అధికారులు మరిపిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పకడ్బందీగా విచారణ చేయకుంటే కొత్త సమస్యలు తలెత్తుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఓ రైతు 2022లో తన తండ్రి పేరున మూడు సర్వే నెంబర్లుగా ఉన్న రెండెకరాల వ్యవసాయభూమిని విరాసత్ కోసం దరఖాస్తు చేశారు. డబ్బుల కోసం విచారణ, నివేదిక అంటూ ఆర్నెల్లు ఆఫీస్ చుట్టూ తిప్పారు. బాధిత రైతు సంబధిత అధికారులపై ఒత్తిడి తేవడంతో నాలా ఫీజు కట్టించుకుని వ్యవసాయ భూమిని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చి విరాసత్ చేశారు. విషయం తెలుసుకున్న రైతు లబోదిబోమంటూ చెప్పులరిగేలా తహసిల్దార్ ఆఫీసు చుట్టూ చక్కర్లు కొడితే తిరిగి వ్యవసాయ భూమిగా మార్చారు. నాలా కన్వర్షన్ సమయంలో ఆ భూమిని అర్బన్ సీలింగ్ ల్యాండ్ మాడ్యూల్లోకి మార్చడంతో దానికి రైతు బంధు, రైతు బీమా లాంటి ప్రభుత్వ సర్కార్ పథకాలు అమలు కావడం లేదు. రెండేండ్లుగా సర్కార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. ఇలాంటి అవకతవకలకు పరిష్కారం ధరణి తర్వాత క్లిష్టంగా మారింది. వీటి పరిష్కారాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో కేంద్రీకృతం చేసింది, ఫలితంగా మూడేండ్లలో రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో 1 నుంచి 33 వరకున్న టెక్నికల్ మాడ్యూల్స్‌లో 2.45 లక్షల దరఖాస్తులు పేరుకు పోయాయి. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారం కోసం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ నేతృత్వంతో కమిటీని నియమించింది. అదే సందర్భంలో చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, సీసీఎల్ఏ వద్ద ఉన్న ధరణి అధికారాలను తహసిల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లకు బదలాయిస్తూ ఈ నెల 1 నుంచి 9 వరకు మొదటి విడత, అనంతరం 11 నుంచి 17 వరకు రెండో విడత స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఈ క్రమంలో అధికారులు కొన్ని ప్రాంతాల్లో అయితే టార్గెట్ పూర్తి చేసేందుకు కార్యాలయాల్లో కూర్చుని ఫైళ్లను తయారు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో విచారణ చేయ కుండా ఇష్టానుసారంగా నివేదికలు తయారు చేస్తున్నారు. భూమికి సంబంధించిన ఒక ఆర్జీని పరిష్కరించాలంటే ఆ భూమి చుట్టూ ఉన్న రైతుల నుంచి వాంగ్మూలంతో పాటు వారి అభ్యంతరాలను నమోదు చేయాలి. ఆ తరహాలో విచారణ చేపట్టకుండానే ఫైళ్లు పూర్తవుతున్నాయని తెలుస్తోంది. స్పెషల్ డ్రైవ్‌లో ఇన్ని సమస్యలను పరిష్కరించామని చెప్పుకునేందుకు చేస్తున్న చర్యల వల్ల భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తుతాయని నిపుణులంటున్నారు.

ధరణి తర్వాత పెరిగిన సమస్యలు

ధరణికి తర్వాత సమస్యలు మరిన్ని పెరిగాయి. పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సంఖ్య 130కి పెరిగిందని భూ సమస్యల పరిశీలకులు పేర్కొంటున్నారు. పోర్టల్‌లో ఉన్న 33 మాడ్యూళ్లలో 2.45 లక్షల దరఖాస్తులతో పాటు 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాలు,(డీఎస్) కోసం భూ యాజమానులు ఎదురుచూస్తున్నారు. ఇవే కాక సాదాబైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు. అమల్లోకి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో చిన్న పాటి సవరణ చేస్తే సాదాబైనామా కోసం నిరీక్షిస్తున్న లక్షలాది మంది బాధితుల దరఖాస్తులకు విముక్తి కలుగుతుంది.

ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాని దరఖాస్తులు

స్పెషల్ డ్రైవ్‌లో ఆధార్‌లో తప్పులు, ఆధార్ లేక పోవడం, పాస్‌బుక్‌లో పేరు కరెక్షన్ మొదలగు 20కి పైగా సమస్యలను తహసీల్దారు నుంచి సీసీఎల్ఏ వరకు లక్షకు పైగా సమస్యలను పరిష్కరించినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. పోర్టల్‌లోని 33 మాడ్యూల్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి లాగిన్‌లు సీసీఎల్ వద్ద మాత్రమే ఉన్నాయి. సమస్యను పరిష్కరించినట్టుగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసే అధీకృత లాగిన్లు ఎంఆర్వో, ఆర్డీతో, అదనపు కలెక్టర్ల వద్ద లేవు. దాంతో ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తును కూడా పోర్టల్‌లో అప్‌డేట్ చేయలేదు. లాగిన్లను కింది స్థాయి అధికారులకు బదలాయించేందుకు పోర్టల్ యాజమాన్యం తిరకాసులు పెడుతోంది. సాంకేతికంగా ఉన్న సమస్యలను అధిగమించలేక చిక్కుముడుల్ని పైకి తెస్తుందని తెలుస్తోంది.

పోర్టల్ భద్రతపై ఆందోళన

ధరణి పోర్టల్‌ను మొదట సత్యం కంప్యూటర్స్ రామలింగరాజు కుటుంబీకులకు చెందిన ఐఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ దివాళా తీయడంతో టెర్రాస్‌కు ఆ తర్వాత విదేశీ కంపెనీ అయిన క్వాంటెల్లాకు అప్పగించారు. ధరణి ఆన్‌లైన్‌లో నమోదైన భూముల వివరాలు, యజమానుల పేర్లు, ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలకు సంబంధించిన సమాచారం విదేశీ కంపెనీ చేతిలోకి వెలితే భద్రంగా ఉంటాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల క్వాంటెల్లా కాంట్రాక్ట్ గడువు తీరినా కొత్త టెండర్లు పిలవకుండా తిరిగి ఆ కంపెనీకే అప్పగించడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. మాన్యువల్ రికార్డులు లేకపోవడంతో ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు రావచ్చని తెలుస్తోంది. ఒకరి భూమి మరో వ్యక్తిపై నమోదై పట్టాదారు పాస్ పుస్తకం పొందితే, ఆ పాస్‌పుస్తకాన్ని రద్దు చేసే అధికారం ఏ అధికారికీ లేదు. బాధితుడు కేవలం కోర్టుకెళ్లి తేల్చుకోవాల్సి ఉంటుంది.

కొత్త దరఖాస్తులపై పెట్టిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేసి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాలి. ధరణి తర్వాత 16,57,407 భూ సమస్యలపై దరఖాస్తులు రాగా గత సర్కార్ 5,37,282 దరఖాస్తులను పరిష్కరించి, 5,37,984 దరఖాస్తులను తిరస్కరించింది.

కొత్త దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తుల పరిష్కారం కోసమే స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. గత సర్కార్ హయాంలో నిజమైన సమస్యలను సైతం టార్గెట్ కోసం అధికారులు తిరస్కరించారు. వాటిని సమీక్షించి స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించాలి. రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటె సమగ్ర భూ సర్వే నిర్వహించాలి. 1940లో నిర్వహించిన సమగ్ర భూ సర్వే తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి సర్వే జరగలేదు

టి.సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం



సీఏఏ నిరసనల ఎఫెక్టు

అమిత్ షా అసోం పర్యటన రద్దు

గౌహతి: సీఏఏకి వ్యతిరేకంగా ప్రజల నిరసనలకు భయపడి కేంద్ర హౌంమంత్రి అమిత్ షా అసోం పర్యటనను రద్దు చేసుకున్నారు. మార్చి 15న అసోంలో జరిగే ఓ అధికారిక కార్యక్రమానికి ఆయన హాజరవ్వాల్సి ఉంది. అమిత్ షా పర్యటన రద్దయిందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. మరోవైపు అసోంలో సీఏఏ వ్యతిరేక ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా విద్యార్థులు ఉద్యమంలోకి దిగారు. ఈ రోజు గౌహతి సహా పలు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి . ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు. శివసాగర్‌లో ఆందోళనకారులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. మరోవైపు, అసోం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీఏఏకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసు వేసింది. పార్టీ తరపున అసెంబ్లీలో ప్రతిపక్ష నేత దేబ్‌బ్రత సైకియా, బార్‌పేట కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖలేక్ సుప్రీంకోర్టులో కేసు వేశారు. సీఏఏ అమల్లోకి వచ్చిన తర్వాత సుప్రీంకోర్టులో మూడు కేసులు దాఖలయ్యాయి. మార్చి 11వ తేదీ రాత్రి రూల్‌ను అమలు చేసిన మరుసటి రోజే డివైఎఫ్ఐ, ముస్లిం లీగ్‌లు కేసు వేశాయి. మూడు అంశాలను దృష్టిలో ఉంచుకుని కేసు దాఖలు చేసినట్లు దేబ్‌బ్రత సైకియా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. మొదటిది, సీఏఏ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తుంది. ఈ విభాగం సమానత్వ హక్కు గురించి మాట్లాడుతుంది. కానీ మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వాలనేది సీఏఏ ఉద్దేశం. రెండవది, సీఏఏ అసోం ఒప్పందాన్ని బలహీనపరిచింది. చాలా పోరాటాల తర్వాత 1985లో అస్సాం ఒప్పందం కుదిరింది. మూడవది, సీఏఏ ఆరు ముస్లిమేతర మతస్తులకు పౌరసత్వాన్ని అందిస్తుంది. ముస్లింలతో పాటు తమిళులు కూడా ఈ చట్టం నుంచి మినహాయించబడ్డారు. శ్రీలంక నుండి వచ్చిన తమిళులు కూడా ఈ చట్టం ప్రకారం పౌరసత్వానికి అర్హులు కాదు. రాజ్యాంగ విరుద్ధమైన, అస్సాం ఒప్పందాన్ని ఉల్లంఘించే ఈ చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని సైకియా తెలిపారు.

సంఘ్ పరివార్ డీఎన్ఏలోనే విభజన : బృందా కరత్



"విభజన అనేది సంఘ్ పరివార్ డీఎన్ఏలోనే వుంది. ఎన్ఆర్‌సీ (జాతీయ పౌర పట్టిక), సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం)లు రెండూ భిన్నమైనవని, సీఏఏతో ఎన్ఆర్‌సీకి ఎలాంటి సంబంధం లేదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అర్థ రహితం". "సంఘ్ పరివార్ డీఎన్ఏలోనే ఈ విభజన వుంది. విభజన లేకుండా వారు మనుగడ సాగించలేరు. మతం పేరుతో ప్రజలను చీల్చడం, విద్వేషాలను వ్యాప్తి చేయడమే వారి జీవిత లక్ష్యం. భారత ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడమే వారి జీవిత పరమావధి. సీఏఏను ఆమోదించిన ఐదేండ్ల తర్వాత ఈ నిబంధనలను ఇప్పుడు తీసుకురావడంలోనే వారి దుర్బుద్ధి అర్థమవుతోంది. లోక్‌సభ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో వున్నాయనగా ఈ నిబంధనలను ఎందుకు తీసుకువచ్చారు?" అని ఆమె ప్రశ్నించారు.



ఎన్నికల కమిషనర్లుగా జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు



మాజీ ఐఏఎస్‌లను ఎంపిక చేసిన ప్రధాని నేతృత్వంలోని ప్యానెల్

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం నూతన ఎలక్షన్ కమిషనర్లుగా మాజీ ఐఏఎస్‌లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులు ఎంపికయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీ వీరిద్దరిని ఎంపిక చేసింది. ప్రధాని నేతృత్వంలోని ప్యానెల్‌లో ప్రధాని మోడీ, కేంద్ర హౌం శాఖ మంత్రి అమిత్ షా, అధిర్ రంజన్ చౌదరీలు ఉన్నారు. ఎన్నికల కమిషనర్‌గా ఎంపికైనా మాజీ బ్యూరోక్రాట్ జ్ఞానేశ్ కుమార్ 1988 బ్యాచ్ కేరళ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఆయన కేంద్ర సహకార శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు.

ఎంపిక తీరును ప్రశ్నించిన అధిర్

కాగా, ఎంపిక ప్రక్రియను ప్యానెల్‌లో ప్రతిపక్ష సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరీ ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లుగా షార్ట్ లిస్ట్ అయిన అధికారుల పేర్లు తనకు ముందుగానే అందించలేదని ఆయన ఆరోపించారు. ఉన్నతస్థాయి సమావేశం ముగిసిన వెంటనే అధిర్ రంజన్ చౌదరి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఎంపిక కోసం ఆరుగురు పేర్లు ప్యానెల్ ముందుకు వచ్చాయనీ, సుఖ్‌బీర్‌సింగ్ సంధు, జ్ఞానేశ్ కుమార్ పేర్లను హైపవర్ ప్యానెల్‌లోని మెజారిటీ సభ్యులు ఖరారు చేశారని చెప్పారు. అయితే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సెలక్షన్ ప్యానెల్‌లో ఉండాల్సిందనీ, న్యాయశాఖ మంత్రి నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ముందు వచ్చినట్టు చెప్తున్న 200 మంది అభ్యర్థుల నుంచి ఆరుగురు పేర్లను ఎలా షార్ట్ లిస్ట్ చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన అన్నారు. కేంద్రం తనకు అనుకూలమైన పేర్లను ఎంపిక చేసుకునేలా చట్టాన్నీ చేసిందనీ, సీజేఐ జోక్యాన్ని నివారించిందనీ, ఈ విధానంలో కొన్ని లోపాలున్నాయని అధిర్ రంజన్ చౌదరీ ఆరోపించారు.

లోక్‌సభ ఎన్నికల తరువాత జనగణన?

బ్లూమ్‌బర్గ్ మీడియా కథనం

న్యూఢిల్లీ : గత కొన్నేళ్లుగా వాయిదాలు పడుతూ వస్తోన్న జనగణన ఈ ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలప్రక్రియ ముగిసిన తరువాత చేపట్టనున్నట్లు సమాచారం. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ మీడియా కథనం వెల్లడించింది. ఇందుకోసం దాదాపు 3 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ జనగణన దాదాపు 12 నెలల పాటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది.దేశంలో 1881లో తొలి జనగణనను నిర్వహించారు. అప్పటినుంచి ప్రతీ దశాబ్దం ప్రారంభంలో అది కొనసాగుతూ వచ్చింది. అయితే చివరిసారిగా 2011లో దీన్ని నిర్వహించారు. 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా.. కరోనా, ఇతర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది.2011 నాటి లెక్కల ప్రకారమే ఇప్పటికీ రేషన్ కార్డుల జారీ వల్ల కనీసం పది కోట్ల మంది వరకు అర్హులకు సంక్షేమ పథకాలు అందట్లేదనేది విశ్లేషకుల మాట. అలాగే ఈసారి కులాల ఆధారంగా జనాభాను లెక్కించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అలాగే గతేడాది ఏప్రిల్‌లో చైనాను అధిగమించి అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. దీంతో జనగణనపై దేశంలోని ప్రజలతో పాటు ప్రపంచం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.


సీఏఏపై ఆగని నిరసనలు

కేరళలో కొనసాగిన ఆందోళనలు

తిరువనంతపురం : దేశవ్యాప్తంగా సీఏఏ అమలుకు కేంద్రం నిబంధనలను నోటిఫై చేయటంపై ఆగ్రహజ్వాలలు చల్లారటం లేదు. పలు రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కేరళలోనూ ఈ నిరసనలు కొనసాగాయి. కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే సీపీఐ(ఎం) అనుబంధ విభాగం డీవైఎఫ్ఐ నిరసన మార్చ్ నిర్వహించింది. సీఏఏకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించా లని డీవైఎఫ్ఐ నిర్ణయం తీసుకున్నది. కేరళలోని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) సుప్రీంకోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 140 అసెంబ్లీ నియోజవర్గాల్లో నిరసనలకు ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) రాష్ట్ర శాఖ కేరళ కర్షక సంఘం పిలుపునిచ్చింది. కేరళలోని అధికార వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్డీఎఫ్), ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)లు రెండూ సీఏఏను వ్యతిరేకిస్తున్నాయి. ఎల్డీఎఫ్ సీఏఏకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలను కొనసాగిస్తున్నది. సీఏఏను ఎల్డీఎఫ్ ప్రభుత్వం అమలు చేయబోదని రాష్ట్ర సీఎం పినరయి విజయన్ పునరుద్ఘాటించారు. సీపీఐ(ఎం) అనుబంధ విభాగాలు సీఏఏ వ్యతిరేక నిరసనల్లో ముందుంటున్నాయి. కేంద్రం నుంచి నోటిఫికేషన్ వెలువడిన వెంటనే డీవైఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా నైట్ మార్చ్‌లను నిర్వహించింది. జిల్లా, మండల స్థాయిల్లో ఈ ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించిన డీవైఎఫ్ఐ కార్యకర్తలు.. నిరసనగా సీఏఏ ప్రతులను తగలబెట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎలక్టోరల్ బాండ్ల విషయంలో వివరాల వెల్లడికి తడబడుతూ.. మరింత సమయం కావాలని కోరుతున్న ఎస్బీఐ అంశాన్ని ప్రజల నుంచి దృష్టి మళ్లించేందుకే కేంద్రంలోని బీజేపీ సర్కారు సీఏఏ నిబంధనల నోటిఫికేషన్‌ను జారీ చేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆరోపించింది.

బాండ్ల కిరికిరి

- వివరాలు వెల్లడి • అసలు విషయం రహస్యమే
- సుప్రీం తీర్పు స్ఫూర్తి బేఖాతరు • మళ్లీ తప్పని న్యాయపోరాటం



న్యూఢిల్లీ :స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఎన్నికల కమిషన్ కలిసి సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని తుంగలో తొక్కాయి. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నట్లు ఒకవైపు కనిపిస్తూనే, మరోవైపు అసలు విషయాన్ని దాచేశాయి. దీంతో కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉన్న ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం మరింత గందరగోళంగా మారింది. ఏ కంపెనీ నుండి ఏ పార్టీకి ఎంత నిధులు ముట్టాయన్న అంశాన్ని మినహా మిగిలిన వివరాలను ఎన్నికల కమిషన్ గురువారం రాత్రి బహిర్గతం చేసింది. తన వెబ్‌సైట్‌లో ఈ వివరాలను అప్‌లోడ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును అత్యంత పారదర్శకంగా అమలు చేసినట్లు ప్రకటించింది. మొత్తం 763 పేజీలతో రెండు భాగాలుగా ఇసి వెబ్‌సైట్‌లో ఉంచిన ఈ నివేదికలో యే తేదిన కొనుగోలు చేశారన్న వివరాలను పార్ట్ 1లోనూ, బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల వివరాలు, ఎంత మొత్తం, తేదీలను పార్ట్-2లోనూ ఇసిఐ ప్రకటించింది. ఏ సంస్థ ఎంత మొత్తానికి బాండ్లను కొనుగోలు చేసిందన్న విషయాన్ని, ఏ పార్టీకి ఎంత మొత్తంలో నిధులు అందాయన్న విషయాన్ని వీటి ఆధారంగా తెలుసుకునే వీలుంది. కానీ, ఏ సంస్థ, ఏ పార్టీకి ఎంత మొత్తాన్ని విరాళంగా ఇచ్చిందన్న విషయాన్ని తేల్చడం అసాధ్యం. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆచరణలో వమ్ము చేసినట్టయింది. కీలకమైన ఆ విషయాన్ని ఎస్‌బిఐ దాచి పెట్టిందా, ఎస్‌బిఐ నుండి వివరాలు అందినా ఎన్నికల కమిషన్ ప్రకటించలేదా అన్న విషయాలు తెలియలేదు. ప్రభుత్వం నుండి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చిన కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో మరోసారి న్యాయపోరాటం తప్పనిస్థితి నెలకొంది. ఎలక్టోరల్ బాండ్ల కేసులో పిటిషనర్ల తరపు వాదించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ఈ విషయం తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లపై ఎస్‌బిఐ ముద్రించిన ఆల్ఫా న్యూమరిక్ కోడ్‌ను వెబ్‌సైట్‌లో వెల్లడి చేయలేదని ఆయన తెలిపారు. ఆ కోడ్ ఉంటే బాండ్లను కొన్న సంస్థల వివరాలను, రాజకీయ పార్టీలు మార్చిన బాండ్లతో పోల్చి, ఎవరు ఎవరికి ఇచ్చారన్న విషయాలను తెలుసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆ కోడ్‌ను వెల్లడిచేయాలని కోరుతూ మరోసారి పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని చెప్పారు. వాస్తవానికి సుప్రీంకోర్టు తొలుత ఇచ్చిన తీర్పులోనే దీనిని కూడా వెల్లడి చేయాలన్న అంశం అంతర్లీనంగా ఉందని ఆయన అన్నారు. ఎడిఆర్ సహ వ్యవస్థాపకుడు జగదీప్ చోకర్ 'ప్రస్తుతం అందిన సమాచారంతో ఏం చేయగలమన్న అంశాన్ని పరిశీలిస్తున్నాం' అని చెప్పారు.

సంస్థ పేరు	రూ.కోట్లలో
1.ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్స్	1,368
2. మేఘా ఇంజనీరింగ్	966
3. క్విక్ సప్లై చైన్ ప్రైవేట్ లిమిటెడ్	410
4. వేదాంత లిమిటెడ్	400
5. హల్దియా ఎనర్జీ లిమిటెడ్	377
6. భారతి గ్రూప్	247
7. ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్	224
8. వెస్టర్న్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్	220
9. కెవెంటర్ ఫుడ్‌పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్	194
10. మదన్‌లాల్ లిమిటెడ్	185
11. డిఎల్ఎఫ్ గ్రూప్	170
12. యశోదా హాస్పిటల్	162
13. ఉత్కల్ అలుమినా ఇంటర్నేషనల్	145
14. జిందాల్ స్టీల్ పవర్ లిమిటెడ్	123
15. బిర్లా కార్బన్ ఇండియా	105
16. రుంగ్టా సన్స్	100
17. డాక్టర్ రెడ్డీస్	80
18. పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్	60
19. నవయుగ ఇంజనీరింగ్	55
20. షిర్డిసాయి ఎలక్ట్రికల్స్	40
21. ఎడెల్‌వైజ్ గ్రూప్	40
22. సిప్లా లిమిటెడ్	39
23. లక్ష్మీ నివాస్ మిట్టల్	35
24. గ్రాసిమ్ ఇండస్ట్రీస్	33
25. జిందాల్ స్టెయిన్‌లెస్	30
26. బజాజ్ ఆటో	25
27. సన్ ఫార్మా లేబొరేటరీస్	25
28. మన్‌కైండ్ ఫార్మా	24
29. బజాజ్ ఫైనాన్స్	20
30. మారుతి సుజుకీ ఇండియా	20
31. అల్ట్రాటెక్	15
32. టివిఎస్ మోటర్స్	10

కొంత మంది బానిసత్వంతో...

మరికొంత మందికి పరిశుభ్రత సాధించలేం : బాంబే హైకోర్టు



ముంబయి: పారిశుధ్య కార్మికులకు సంబంధించిన ఒక కేసులో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంక్షేమ రాజ్యంలో కొంత మందిని బానిసత్వంలో నిమగ్నం చేయడం ద్వారా మరికొంత మందికి పరిశుభ్రత సాధించలేమని పేర్కొంది. 580 మంది మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, వారికి అన్ని ప్రయోజనాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ముంబయి మున్సిపల్ విభాగంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తోన్న 580 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని కోరుతూ అక్కడి వర్కర్స్ యూనియన్ కోర్టును ఆశ్రయించాయి. రోడ్లను ఊడ్చటం, చెత్త సేకరణ వంటి పనులు నిర్వర్తించే వీరికి శాశ్వత పోస్టులు సృష్టించాలంటూ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ గతంలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబయి హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటీషన్‌ను విచారిస్తూ జస్టిస్ మిలింద్ జాధవ్ ఏకసభ్య ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది. 'స్వచ్ఛమైన వాతావరణనేది పౌరుల ప్రాథమిక హక్కు. కానీ కార్మికుల మానవ గౌరవాన్ని కాలరాయడం ద్వారా దాన్ని సాధించలేం' అని పేర్కొంటూ తీర్పు చెప్పింది. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును కొట్టివేయడమనేది 'న్యాయాన్ని అపహాస్యం' చేసినట్లే అవుతుందని కూడా స్పష్టం చేసింది. దీంతో నవంబర్ 2023లో ఇచ్చిన తీర్పు తాజాగా అందుబాటులోకి వచ్చింది.

ఆహారం కోసం నిరీక్షణ..శరణార్థ శిబిరాలపై ఇజ్రాయిల్ దాడులు

గాజా : ఆకలి బాధతో ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారిపై, శరణార్థ శిబిరాలపై ఇజ్రాయిల్ దారుణంగా దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో డజన్ల సంఖ్యలో మరణించగా, పెద్ద సంఖ్యలో గాయపడ్డారని అధికారులు తెలిపారు. సెంట్రల్ గాజాలోని బురేజి శరణార్థ శిబిరం, నుస్రత్ శరణార్థ శిబిరాలపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో 17మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. మరోవైపు రాఫా నగరంలో ఆహారం కోసం యుఎన్ఆర్‌డబ్ల్యుఎ ఆహార కేంద్రం వెలుపల బారులు తీరి నిలుచున్న వారిపై ఇజ్రాయిల్ సైన్యం దారుణంగా బాంబు దాడులు జరిపింది. ఈ దాడిలో మొత్తంగా ఐదుగురు మరణించగా, గాజా నగరంలో జరిపిన మరో దాడిలో ఆరుగురు మరణించగా, 83మంది గాయపడ్డారు.

- నేటి నుంచి టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు
- రాష్ట్రవ్యాప్తంగా టీజీ 0001 నుంచి ప్రారంభం
- కొత్త వాహనాలకే ఈ రిజిస్ట్రేషన్
- యథావిధిగా ఏపీ, టీఎస్ నంబర్ ప్లేట్లు..
- సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసిన రవాణాశాఖ

టీఎస్ స్థానంలో.. ఇక టీజీ



నవతెలంగాణ- సిటీబ్యూరో

నేటి నుంచి వాహనాల రిజిస్ట్రేషన్స్ టీజీ పేరుతో జరగనున్నాయి. ఇందుకు సంబంధించి గెజిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం నుంచే టీజీ 0001 సీరిస్ పేరిట వాహనాల రిజిస్ట్రేషన్లు కానున్నాయి. ఆయా జిల్లాలకు కేటాయించిన కోడ్‌తో (33 జిల్లాలు..టీజీ-01 నుంచి టీజీ-38) ఈ వాహన రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. ఇప్పటివరకు టీఎస్ పేరిట జరిగిన వాహనాలు యథావిధిగా కొనసాగుతాయి. నూతన వాహనాలకే టీజీ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి రవాణాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అందుకోసం ఆ శాఖ గురువారం సాయంత్రం 4గంటల తర్వాత అన్ని రవాణా సర్వీసులను నిలిపివేసింది. అనంతరం సాఫ్ట్‌వేర్‌లో టీఎస్ స్థానంలో టీజీగా మార్చే పనులు చేపట్టింది. ఆ మేరకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేసి.. ట్రయల్ రన్ కూడా నిర్వహించింది. ట్రయల్ రన్ సక్సెస్‌ను బట్టి నేటి నుంచి అమల్లోకి తీసుకురానుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలపై వరుస సమీక్షలు చేస్తూ.. అవసరమైన చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో వాహన రిజిస్ట్రేషన్లకు టీఎస్ కాకుండా టీజీగా మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. 2014 జూన్ 2 తర్వాత అప్పటి ప్రభుత్వం కొత్త వాహనాలకు టీఎస్ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లకు అనుమతించింది. దీనిపై అప్పట్లోనే తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ గత ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మళ్లీ టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 4న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆ మేరకు తీర్మానం చేసింది. అదే నెల 20న ఈ అంశంపైనే ప్రత్యేకంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత తెలుపగా.. మార్చి 12న కేంద్ర రవాణాశాఖ గెజిట్ విడుదల చేసింది. అందుకు కొనసాగింపుగా గురువారం తెలంగాణ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా ప్రతిపాదిస్తూ గెజిట్ విడుదల చేసింది.

కొత్త నెంబర్లు.. 'ఫ్యాన్సీ'కి ఫుల్ గిరాకీ..

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 54 రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇప్పటివరకు ఏపీ రిజిస్ట్రేషన్ పేరుతో అన్ని రకాల వాహనాలు 70 లక్షలు ఉండగా.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన ఈ పదేండ్ల కాలంలో దాదాపు 92లక్షల వాహనాలు టీఎస్ పేరుతో రిజిస్టరయ్యాయి. ప్రస్తుతం ఈ వాహనాలు యథావిధిగా కొనసాగనున్నాయి. కొత్తగా రిజిస్ట్రేషనయ్యే వాహనాలకు మాత్రమే టీజీ పేరుతో నెంబర్లను కేటాయించనున్నారు. గురువారంతోనే టీఎస్ సీరిస్ పేరిట రిజిస్ట్రేషన్ క్లోజ్ చేశారు. ఇప్పటికే నెంబర్లు రిజర్వ్ చేసుకున్న వారికి మాత్రం ఈనెల 29 వరకు సమయం ఉంటుంది. నేటి నుంచి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాలకు టీజీ 0001 కేటాయించనున్నారు. ఉదాహరణకు ఖైరతాబాద్ ఆర్టీఏ పరిధిలో చూసుకున్నట్టయితే.. టీజీ09ఏఏ0001 నెంబర్ రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగానూ ఆయా జిల్లాలకు కేటాయించిన కోడ్ సీరిస్‌తో రానున్నాయి. వాహన యజమానులు 0001 నుంచి 0999 వరకు నంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కాగా, మళ్లీ ప్రారంభ సీరిస్‌తో నెంబర్లు వస్తుండటంతో వచ్చే వారం పది రోజులు ఫ్యాన్సీ నంబర్లకు ఫుల్ గిరాకీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆర్టీఏ ఖజానాకు సైతం భారీగా ఆదాయం సమకూరనుంది.

ముఖ్యమంత్రికి ప్రత్యేక నెంబర్ కేటాయింపు?

టీఎస్ నుంచి టీజీగా మారుతుండటంతో అందరిలో ఆసక్తి కనిపిస్తోంది. ఇప్పటికే కొత్త వాహనాలు కొన్నవారు టీజీ నెంబర్ ప్లేట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంతో ఆత్రుతతో ఉన్నారని, వందల సంఖ్యలో వాహనదారులు ఎదురు చూస్తున్నారని ఆర్టీఏ అధికారులు చెబుతు న్నారు. శుక్రవారం నుంచి టీజీగా వాహన రిజిస్ట్రేషన్లు ప్రారంభమవు తుండటంతో ఆర్టీఏ కార్యాలయా లకు వాహనాదారులు భారీగా తరలొచ్చే అవకాశాలున్నాయి. అయితే నెంబర్ల కేటాయింపు అంతా ఆన్‌లైన్‌లో జరుగు తుండటంతో ఇబ్బం దులు ఉండక పోవచ్చు. ఇప్పటికే సీఎంవో వర్గాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వయ్ కోసం టీజీ09 ఆర్ఆర్ 0009 పేరిట నెంబర్ రిజర్వ్ చేసుకునేం దుకు కావాల్సిన దరఖాస్తు సమర్పించినట్టు సమాచారం. అందుకోసం ప్రభుత్వం త్వరలో ప్రత్యేక జీవో జారీ చేయనున్నట్టు తెలిసింది.

ఎన్నికల వేళ రెండు రూపాయలు తగ్గింపు..

- పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రం ప్రకటన



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రం కీలక నిర్ణయం ప్రకటించింది. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.2 చొప్పున తగ్గిస్తున్నట్టు వెల్లడించింది. చమురు మార్కెటింగ్ కంపెనీలు సవరించిన ఈ ధరలు శుక్రవారం ఉదయం 6గంటల నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ తెలిపింది.

చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను దేశవ్యాప్తంగా సవరిస్తున్నట్టు సమాచారం ఇచ్చాయని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వశాఖ శాఖ వెల్లడించింది. ఈ తగ్గింపు నిర్ణయం వినియోగదారులకు ఊరటనిస్తుందని, డీజిల్‌తో నడిచే 58 లక్షల గూడ్స్ వాహనాలు, ఆరు కోట్ల కార్లు, 27 కోట్ల ద్విచక్రవాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని పేర్కొంది.

నాణ్యత లేని వినికిడి మిషన్ల విక్రయంను ఆపాలి

- ఆ క్లినిక్‌లపై చీటింగ్ కేసు నమోదు చేయాలి: ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్‌సీఐ నిబంధనలను పాటించని ప్రత్యేక పాఠశాలల, ఆటిజం, హియరింగ్, స్పీచ్ థెరపి క్లినిక్‌లపై చర్య తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్, రాష్ట్ర నాయకురాలు శశికళ గురువారం హైదరాబాద్‌లోని వికలాంగుల శాఖ కమిషనర్ బి శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. నాణ్యత లేని వినికిడి మిషన్లను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న క్లినిక్‌లపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని కోరారు. వికలాంగుల పునరావాస కేంద్రాలపై పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. నిబంధనలకు భిన్నంగా క్లినిక్‌లు నడుస్తున్నాయని తెలిపారు. అర్హత లేని సిబ్బందితో వాటిని నిర్వహించటం చట్ట రీత్యా నేరమనే విషయం తెలిసినప్పటికీ ఖాతరు చేయటం లేదని వాపోయారు. వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో కొన్ని క్లినిక్‌లు ఫ్రాంచైజ్ల పేరుతో వ్యాపారం చేస్తున్నాయని తెలిపారు. ఒక్కో థెరపికి నెలకు రూ.30వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హత కలిగిన తెరపిస్టులు లేకున్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. దీంతో ఫీజులు కట్టలేని వారు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని తెలిపారు. ఫీజులను నియంత్రిస్తూ ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల పునరావాస కేంద్రాల పేరుతో వ్యాపారం చేస్తున్నారనీ, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. వికలాంగులు ఎదుర్కొంటున్న పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకుపోయినట్టు వారు తెలిపారు.

అటవీ శాఖ సూపరిండెంట్స్‌కు గెజిట్ హోదాపై హర్షం

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన టీఎన్జీవోస్ ఫారెస్ట్ ఫోరమ్ స్టేట్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ శాఖలో పనిచేస్తున్న సూపరిండెంట్స్‌కు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్‌గా గెజిటెడ్ హోదా కల్పిస్తూ జీవో జారీ చేయడం పట్ల టీఎన్జీవోస్ ఫారెస్ట్ ఫోరమ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ఫోరం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ మల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఎన్.మూర్తి, సంతోశ్, కార్యదర్శి అశ్వక్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

పార్కుల సుందరీకరణకు అధిక నిధులు కేటాయిస్తాం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్కుల సుందరీకరణకు అధిక నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ ఎస్బీఐ కాలనీలో పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతా వరణంలో వ్యాయామం చేసేందుకు వీలుగా చిన్నారులు ఆడుకోవడానికి ప్రత్యేక వసతులతో పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి పార్కులో ఓపెన్ జిమ్ సౌకర్యం తాగునీటి వసతి ఔషధ మొక్కల పెంపుదలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు జై సింహా డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి సాయి, రాజశేఖర్ గౌడ్, పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

'నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వేతన సవరణలో నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం వేతన సవరణ సంఘంకు విన్నవించింది. పెరిగిన ధరలు, జీవన వ్యయం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ సంఘం నాలుగో తరగతి ఉద్యోగులకు బేసిక్ పే రూ.35 వేలు ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మెన్ ఎన్.శివశంకర్ ను కలిసి నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతిపాదనలు అందచేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ పెంచాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు దర్శా నాయక్, ఖాదర్ బిన్ హసన్, కె.ధన్ రాజ్, బి.రాజేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం..



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలోని డయాలసిస్ సెంటర్ లో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శశికిరణ్, డాక్టర్ శుభం, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి కేశవ్, ప్రసన్న, మహేష్, షీరిన్, అశ్రిత, సెంటర్ ఎగ్జిక్యూటివ్ సుభాషిణి పాల్గొన్నారు.

ఉద్యోగులకు 56 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి లో మెరుగైన ఫిట్మెంట్ 56 శాతం ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ చైర్మెన్ ఎన్.శివశంకర్ ను కలిసి ఉద్యోగులకు 56 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ను క్లాస్ వన్ గెజిటెడ్ హెల్త్ ఆఫీసర్‌గా గుర్తించాలన్నారు. క్లాస్ వన్ గెజిటెడ్ పే స్కేల్స్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఆర్ సిద్ధప్ప, ఎం.సుదర్శన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ స్టేట్ లెవెల్ టైక్వాండో ఛాంపియన్ షిప్'

- సబ్ జూనియర్ కేటగిరీలో పాల్గొన్న 600 మందికిపైగా క్రీడాకారులు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ స్టేట్ లెవెల్ ఓపెన్ ఇంటర్ స్కూల్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు గురువారం ఎల్బీ స్టేడియంలో జేబీఎల్, టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ కేటగిరి బాల, బాలికలు, ఛాంపియన్ షిప్‌లోని 600 మందికిపైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి శ్రీ చైతన్య స్కూల్ రామంతపూర్, రెండవ బహుమతి లాల్, మూడవ బహుమతి దిల్ షుక్ నగర్ గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫార్మర్ ఒలింపిక్ సోమేశ్, ఒలింపిక్ జాయింట్ సెక్రెటరీ, మల్లారెడ్డి, శ్రీ చైతన్య స్కూల్ ఇన్‌చార్జీ పద్మ, ఆర్గనైజర్ జేబీఎల్ బాబూలాల్, నల్లెల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొజగుట్ట శివాజీ నగర్‌లో కొత్త డ్రయినేజీ లైన్ వేయాలి

- నాంపల్లి జోన్ సీపీఐ(ఎం) నాయకులు మల్లేష్



నవతెలంగాణ-మెహిదీపట్నం

బొజగుట్ట శివాజీ నగర్ లో కొత్త డ్రయినేజీ లైన్ వేయాలని నాంపల్లి జోన్ సీపీఐ(ఎం) నాయకులు మల్లేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా బొజగుట్టలో పొంగిపొర్లుతున్న డ్రయినేజీ లైన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నెలరోజులుగా బొజ్జ గుట్టలో డ్రయినేజీ పొంగిపొర్లుతుందని దానిని పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్‌ల ఇండ్ల పేరుతో ప్రభుత్వం ఆడ్రయినేజీ లైన్‌ని సరి చేయడానికి కాలయాపన చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. కావున ప్రభుత్వం పూనుకొని కాలనీలో కొత్త పైప్ లైన్, డ్రయినేజీ లైన్ వ్యవస్థను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త నీటి కనెక్షన్లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భక్తి వాసులు సుధాకర్, అజ్మత్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- వైద్యుల భర్తీ, పరికరాలు ఏర్పాటు, సౌకర్యాలు కల్పనకు చర్యలు
- నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్ నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు ఆరోగ్యశ్రీ,, బయో లేబరేటరీ, సర్జికల్ ఓపి, బ్లడ్ బ్యాంక్, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, ఆయుష్మాన్ భారత్ హెల్ప్ డెస్క్, చిల్డ్రన్స్ ఓపి విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ బిల్లులు ఎన్ని పెండింగ్ ఉన్నాయని డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ చిల్డ్రన్స్ వార్డులో పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణులతో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి డాక్టర్లు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే మరింత మెరుగైన వైద్య సేవలు రోగులకు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో పడకల స్థాయి అప్ గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపవలసిందిగా తెలిపారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల భర్తీకి, ఆస్పత్రికి కావాల్సిన పరికరాల కొనుగోలు కోసం వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆస్పత్రికి వైట్ వాష్ చేయవలసిందిగా, డ్రయినేజీ సరిగా ఉండేలా చూడవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు. నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలోకార్పొరేటర్ జాఫర్ ఖాన్, డీసీహెచ్ ఎస్ డాక్టర్ సునీత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి సునీత, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలాలు మాకు కేటాయించాలి'



నవతెలంగాణ-ముషీరాబాద్

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన 189.11 ఎకరాల స్థలాన్ని మరలా తిరిగి కేటాయించాలని తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ చైర్మెన్ సూర్య కళ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మెన్ సూర్య కళ, కో చైర్మన్ ఝాన్సీ రాణి, కన్వీనర్ ఝాన్సీ లక్ష్మీబాయి హాజరయ్యారు. చైర్మెన్ సూర్య కళ మాట్లాడుతూ గతంలో మా సొసైటీకి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన 189.11 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా వెనక్కు తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన మా స్థలాన్ని అక్రమంగా లాక్కునడమే కాకుండా సర్వీస్ సీనియారిటీ ఆధారంగా సీనియర్లకు మొదటి లబ్ధిదారులుగా గుర్తించాలి అందుకు విరుద్ధంగా లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించడం వలన మా సీనియర్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీనిని వ్యతిరేకించిన సీనియర్లు హైకోర్టును ఆశ్రయించి పలు కేసులు వేశారని తెలిపారు స్పందించిన న్యాయస్థానం తుది తీర్పు వెలువడే వరకు లాటరీ ద్వారా ప్లాట్లు పొందిన వారికి ఎలాంటి ఇండ్ల నిర్మాణం చేపట్టవద్దని సొసైటీని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఇల్లు నిర్మించుకోకపోవడంతో మా తప్పు లేకపోయినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు నిర్మించుకోలేదనే నెపంతో అన్యాయంగా మా సొసైటీ 189.11 ఎకరాల స్థలాన్ని తిరిగి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వంతో తిరిగి కేటాయిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ శ్రీదేవి, కార్యవర్గ సభ్యులు స్వర్ణకుమారి ,రాజేశ్వరి, లక్ష్మీ కుమారి ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ అమలుతో రానున్న లోక్‌సభ ఎన్నికలకు మత వైషమ్య రంగును పులిమే కుట్ర

- ఎంపీజే అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) భారతదేశ ప్రజల అభీష్టానికి ఏమాత్రం ప్రతిబింబం కాదని, కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయంలోనూ ఇష్టానుసారం వ్యవహరిస్తోందని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో విమర్శించారు. సరిగ్గా ఎన్నికల తేదీలు సమీపిస్తుండగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురా వటం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నాలుగేండ్ల క్రితం ఈ చట్టాన్ని ప్రతిపా దించినప్పుడు కూడా దేశంలో సర్వత్రా నిరసనలు వెల్లువెత్తాయన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశంలో మతపరమైన వైషమ్యాన్ని రేకెత్తించి, ప్రజల మధ్యన ఉన్న సహిష్ణుతను మంటగలిపే ప్రయత్నం చేయటం గర్హనీయమని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఆర్ బొమ్మై తీర్పును ఉదాహరిస్తూ, భార తదేశంలో మతం ప్రాతిపదికన శాసనం ఏదీ అమలుపరచరాదన్నారు. కాని నేడు ఈ చట్టం (సీఏఏ) భారత ప్రజాస్వామిక వ్యవస్థకు, రాజ్యాంగ సూత్రాలకు విఘాతం కలిగించేదిగా ఉందని చెప్పారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే దేశంలో రెండు వందలకంటే ఎక్కువ చోట్ల కేసులు నమోదయ్యాయనీ, న్యాయశాస్త్ర కోవిదులు, మేధావులు ఈ చట్టం వల్ల తలెత్తే ప్రమాదకర సమస్యల పట్ల తమ ఆవేదనను వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేశారు.

మాదిగ ఉపకులాల కార్పొరేషన్‌కు రూ.30 వేల కోట్ల నిధులు కేటాయించాలి

తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ



నవతెలంగాణ-ముషీరాబాద్

మాదిగ ఉపకులాల కార్పొరేషన్‌కు రూ. 30 వేల కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మాదిగలు ఎదుర్కొంటున్న పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిగలు చాలా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని కులాలను గుర్తించి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి స్వాగతిస్తుందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల కార్పొరేషన్‌కు సంవత్సరానికి 30 వేల కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర రామ చందర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొర్రా సంపూర్ణ,రాష్ట్ర ఉపాధ్యక్షులు సెవెల లక్ష్మాన్, రాష్ట్ర మహిళ కో ఆర్డినేటర్ మేకల అనిత, తార, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు

కింగ్ కోఠి ఆస్పత్రి ముందు మురుగునీరులతో రోగులు ఇబ్బందులు..





నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి ప్రధాన గేటు ఎదుట గత కొన్ని రోజులుగా మురుగు నిలిచి దవాఖానాకు వచ్చే రోగులు మురుగు దాటడా నికి నానా తంటాలు పడుతున్నారు. చిన్న చిన్న రాళ్లు వేసుకొని దాటే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు మురుగులో పడిపోయిన ఘటనలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆస్పత్రి వర్గాలు వాపోతున్నాయి. నిత్యం కింగ్ కోఠి రోడ్డుపై మురుగు పారుతుం టుంది. నదిలా బురద కాళ్లతో రోగులు, సహా యకులు దవాఖానాలోకి రావడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. జీహెచ్ఎంసీ అధికా రుల స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నూతనంగా ఇటీవల ప్రెస్ అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్‌రెడ్డి నియ మితులైన సందర్భంగా బాగ్ అంబర్‌పేట డివిజన్ టీడీపీ అధ్యక్షులు భాను ప్రకాష్, ఆ పార్టీ అధికార ప్రతినిధి కిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య
- విద్యానగర్ బీసీ భవన్‌లో విద్యార్థులతో కలిసి మహాదీక్ష



నవతెలంగాణ-ముషీరాబాద్

పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని 8 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ గురుకుల పాఠశాల కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అధ్యక్షతన మెస్ ఛార్జీలు,స్కాలర్ షిప్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యానగర్ బిసి భవన్ నందు మహా దీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 6 సంవత్సరాల క్రితం ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు కొనసాగిస్తున్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు, నూనెలు, పప్పులు, కూరగాయలు అన్ని ఆహార వస్తువుల ధరలు మూడు రెట్లు పెరగడంతో హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం దుర్మార్గమన్నారు. సంబంధిత కమిషనర్లు ఒకనాడు కూడా హాస్టళ్ళను సందర్శించి విద్యార్థుల సాదక బాధకాలు తెలుసుకోవడం లేదని మండిపడ్డారు. ఉద్యోగుల జీతాలు రెండు సార్లు పెంచారు. శాసనసభ్యులు, మంత్రుల జీతాలు మూడురెట్లు పెంచారు. వృద్ధాప్య పెన్షన్లను ఐదు రెట్లు పెంచారు. కాని ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, మెస్ చార్జీలు పెంచలేదని వాపోయారు. విద్యార్థుల గత రెండు సం. ఫీజుల బకాయిలు 3500 కోట్లు వెంటనే చెల్లించాలని, కాలేజీ విద్యార్థులకు డే-స్కాలర్స్ కు సంవత్సరంకు రూ.20 వేల స్కాలర్ షిప్ ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 300 కాలేజీ హాస్టల్ కొత్తగా ప్రారంభించాలని, స్వంత భవనాలు నిర్మించాలని దరఖాస్తు చేసిన విదేశీ విద్యార్థులందరికి ప్రతి ఒక్కరికి "స్టైఫండు" మంజూరు చేయాలని, ఐఐటీ,ఐఐఎం కోర్సులు చదివే వారికి ఫీజు రియంబర్స్ మెంట్ పథకం విస్తరింపజేయాలని కోరారు. బీసీ కాలేజి హాస్టళ్లకు, గురుకుల పాఠశా లలకు స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ, సుధాకర్, నందగోపాల్, చంద్రశేఖర్ గౌడ్, నరసింహ గౌడ్, జి. కృష్ణ యాదవ్,రాందేవ్ మోదీ, హరీష్, నిఖిల్, ప్రవల్లిక, ఉమా, రిసీతా ఝాన్సీ శ్రీ, స్వాతి, యామిని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- టీవీ ఇంటర్వ్యూలో చేసిన వ్యక్తిగత విమర్శలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కమిటి డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారధన్ మహారాజ్ పై రెండు రోజుల క్రితం బీఎస్పీ నేత ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఒక టీవీ ఇంటర్వ్యూలో చేసిన వ్యక్తిగత విమర్శలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కమిటి డిమాండ్ చేసింది.నాలుగు రోజుల్లో ప్రవీణ్ కుమార్ క్షమాపణ చెప్పకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎన్. సత్యనారాయణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ నెల నిర్వహించే మహనీయుల జన్మ దినోత్సవ ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ హైదరాబాద్ జిల్లా కమిటి అధ్యక్షులు ఎం.సైదులు మహారాజ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు జి.కృష్ణ మహారాజ్, కో-కన్వీనర్ పి.నర్సింగ్ మహారాజ్ తదితరులు మాట్లాడుతూ బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ కాన్షిరామ్ ఆశయాల కోసం అనేక మంది యువకులను రాజకీయాల వైపు, సత్య వాక్యంతో సామాజిక పరివర్తన కోసం తయారు చేసుకున్న జ్ఞాన యువకులను, పార్టీ కార్యకర్తలను ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ మూరు?లు, రోబోలు, సైకోలు అని నిశితంగా విమర్శించడం సిగ్గుచేటని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల నుంచి ఏప్రిల్ 30 వరకు మహనీయుల జన్మదినోత్సవ ఉత్సవాలు, పార్టీ ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సంతోష్ మహారాజ్, రమేష్, కె.శివరామ మహారాజ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా భేష్

- ఐఎన్‌టీయుసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపు 6 గ్యారంటీల అమలు జరుగుతుందని ప్రజలకిచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి రథాన్ని రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి విజయవంతంగా ముందుకు తీసుకువెళున్నారని ఐఎన్‌టీయుసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ తెలిపారు. గురువారం బషీర్ బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ 100 రోజుల పాలనలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని సమానత్వ పథంలో నడిపిస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలనను అంతం చేసి ప్రజలు ప్రజాస్వామ్య పాలనను తీసుకొచ్చారని, ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ప్రజలకు భరోసా కల్పించడంలో అత్యంత శ్రద్ధ వహిస్తూ, ప్రజల అవసరాలకు ప్రతిస్పందిస్తు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పని చేస్తూ, జవాబుదారీ పాలనా కొనసాగిస్తుందని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కు గ్యాస్ సిలిండర్, 'గృహ జ్యోతి', అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రైతు భరోసా', 'చేయూత' వృద్ధులకు నెలకు 4 వేల పెన్షన్, ఆరోగ్యశ్రీ లిమిట్ రూ.10 లక్షలకు పెంచడం, 'ఇందిరమ్మ ఇళ్ళు' ఇళ్ల నిర్మాణానికి 5 లక్షలు, 'యువ వికాసం' వంటివి ఇప్పటికే రాష్ట్రమంతటా ప్రారంభమై సక్రమంగా అమలు చేయబడుతున్నాయన్నారు. వీటితో పాటు మహిళలకు వడ్డీ లేని రుణాల మంజూరుతో పాటు కళ్యాణ లక్ష్మి పథకంలో ఉచితంగా తులం బంగారం, ప్రజా పాలన అభయహస్తం, అర్హులైన ప్రతీ ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు అన్ని కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొంత ప్రభుత్వమని, రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని భంగం చేయకుండా, ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేరుస్తూ ఏ ఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకుండా ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ పాలనా కొనసాగిస్తుందని ఆయన కొనియాడారు.

విద్య, వైద్యం ప్రజలందరికీ అందించాలనేదే మా లక్ష్యం

- రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యమని రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల యొక్క సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో ఆరో వాటర్ ప్లాంట్, పవర్ బోర్ పనులను స్థానిక కార్పొరేటర్ లు రచన శ్రీ, రవి చారిలతో కలిసి డాక్టర్ లక్ష్మణ్ ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రైవేట్ వ్యవస్థల వల్ల పేద ప్రజలకు సరైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా టీచర్లు లేరని టీచర్ల తో పాటు అవసరమైన ఇతర సిబ్బంది కూడా లేక టీచర్లే సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఘట్కేసర్ నేను పుట్టిన ఊరు అయితే ముషీరా బాద్ నాకు రాజకీయ ఓనమాలు నేర్పిన ప్రాంతమని ముషీరాబాద్, ఘట్కేసర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాంధీనగర్ కార్పొరేటర్ పవని వినయ్‌కుమార్, వినయ్ కుమా ర్, నవీన్ గౌడ్, వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు మహేందర్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలలో వైద్య రంగ శాఖలోని గెజిటెడ్ అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజి టెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2024 -డైరీ, క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్య ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు కాలీమొద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ.. జిఓనెం 317, జీఓనెం142లను సవరించాలని, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని వైద్యశాఖ మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసులు, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ రామాంజనేయులు, కోశాధికారి పి.చంద్రశేఖరరావు, జి.నరసింహారెడ్డి నామాల శ్రీనివాసులు మంజుల విజయనిర్మల రాజకుమార్, చిట్టి బాబు, మురళీధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం | మార్చి 15, 2024 | www.navatelangana.com

థీమ్ పార్కు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలో సుమారు రూ.4 కోట్లతో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేస్తున్న థీమ్ పార్కు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో అత్యంత సుందరంగా తయారవుతున్న థీమ్ పార్కు పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు శేఖర్, లోకేష్, శ్రావణి, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ రూప, ఏఈ శ్రవంతి, వాటర్ బోర్డ్ అధికారులు డీజీఎం సతీష్, తదితరులున్నారు.

రూ.15 లక్షలతో శ్మశాన వాటిక పనులు ప్రారంభం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షలతో చేపడుతున్న రాంపల్లి హిందూ శ్మశాన వాటిక పనులకు నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు చింతల సరిత, ఎలిజాల నాగేష్, గోక కళావతి యాదగిరి, కో-ఆప్షన్ మెంబర్ అశోక్ గౌడ్, నాయకులు గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య గౌడ్, మచ్చ శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణారెడ్డి, ఎలాసాని భూమయ్య యాదవ్, ఎలాసాని బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు బాధ్యతతో పని చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాన-సిటీబ్యూరో

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పని చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో, వీవింగ్ సర్వే లెన్స్, ఎంసీసీ బృందాలతో డీసీవో రాజేందర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశురామ్, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ తిరుమలేష్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ భాను ప్రకాష్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వే లెన్స్, టీంల బాధ్యతలను తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తుందన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 24/7 పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడం లాంటి వాటిని పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశించారు. ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ఏవైనా అనుమానాలు ఇబ్బందులు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులను అడిగి తెలుసుకోవాని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యాత్మక ప్రదేశాలలో ప్రత్యేకమైన ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు సకాలంలో చేరుకోలేని పక్షంలో కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో స్టాటిస్టిక్ సర్వేలెన్సులు చురుగ్గా పనిచేయాలని, ఎక్కడైనా రూ.50వేల కంటే అధికంగా నగదు రవాణా చేస్తున్నట్టు గుర్తిస్తే ఎలాంటి ఆధారాలు లేకుండా సందేహాస్పదంగా ఉంటే దానిని సీజ్ చేసి ట్రెజరీలో డిపాజిట్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదు వివరాలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి చూపించి తమ నగదును విడుదల చేసుకోవచ్చు అని తెలిపారు. రూ.10 లక్షల వరకు ఆధారాలు లేకపోతే ఇన్‌కమ్ టాక్స్ వారికి సమాచారం అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎంసీసీ నోడల్ అధికారి, అభ్యర్థులు ఖరారైన తర్వాత ఖర్చులకు సంబంధించిన వివరాలు రిపోర్టులను ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి, రాజకీయ ప్రకటనలకు సంబంధించిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారులు గమనించాలన్నారు. సీ-విజిల్ యాప్ ఈఎస్ఎంఎస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే సీ- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా ఎన్నికల కమిషన్ యాప్ రూపొందించిందని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించే సమయంలో ఆధారాలు సేకరించాలన్నారు. సీజ్ చేసిన డబ్బులు వస్తువులను ఈఎస్ఎంఎస్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాలలో కంప్లైంట్‌ను చేదించి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలలో అక్రమాల నివారణకు ఎఫ్ ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, టీంలు కృషి చేయాలని తెలిపారు. ఎఫ్ ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, ఎంసీసీ టీంలకు వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల సమయంలో లోటుపాట్లు లేకుండా పనిచేయాలన్నారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ 24/7 నిర్వహించాలని ఫిర్యాదులు సమస్యలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని కోడ్ అమలులోకి రాగానే నిర్వహించే విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి విధులు ఏర్పాట్లు తదితర విషయాలపై జిల్లా ట్రైనర్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీం అధికారులు, వ్యయ పరిశీలకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి



- ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్

నవతెలంగాణ-బోడుప్పల్

నేటి తరం విద్యార్థులకు చదువుతో పాటు వైజ్ఞానిక అంశాలపై అవగాహన కల్పించేలా పాఠశాల వాతావరణం ఉండాలని ట్రాస్మా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జె.నాగరాజు గౌడ్ అన్నారు. గురువారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బీఎంఆర్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రపంచం మొత్తం సైన్స్ వైపు చూస్తుందని, అందుకే మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సైన్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బీ. మల్లారెడ్డి, కారస్పాండెంట్ జైపాల్ రెడ్డి, ట్రాస్మా ఉప్పల్ మండల అధ్యక్షుడు ధన్ పాల్ సాగర్, వివిధ పాఠశాలల కారస్పాండెంట్స్ శ్యామ్, ఎస్కే మధర్, అలితాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే.. ఫలితాలు అవే వస్తాయి



- విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దు
- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివితే ఖచ్చితంగా ఉత్తమ ఫలితాలు వస్తాయని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి సూచించారు. గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ పంపిణీ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలను అనుసరించాలన్నారు. ఈ ఫలితాలే విద్యార్థి భవిష్యత్‌ను దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు తమ వంతు సహాయం చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యను అందిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఉన్నత స్థాయి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు, విద్యావాలంటీర్లకు గౌరవ వేతనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మధుసూదన్ రెడ్డి, ఎంపల్ల అనంతరెడ్డి, నాయకులు బండారి రవీందర్, ఏనుగు మనోరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన షెడ్డును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభు దాస్, డివిజన్ అధ్యక్షులు గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి జి.రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శులు మూర్తి, ప్రచార కార్యదర్శి బి.శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు కామేశ్వర రావు, రాజేశ్వరరావు, ఏహెచ్ ఖాన్, బోయిని శంకర్, గుమ్మడి జంపాల్ రెడ్డి, సాయి కుమార్, నిస్సార్ అహ్మద్ ఘోరి, నరేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రూట్స్ డెంటల్ అండ్ ఇంప్లాంట్ ఆస్పత్రి ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ మెయిన్ రోడ్డులో రూట్స్ డెంటల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ఆస్పత్రిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరికీ దంత సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. పళ్లపై శ్రద్ధ చూపకపోవడంతో పుచ్చిపోతాయని, సకాలంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. యువత పాన్, తంబాకు, గుట్కాలు నమిలి పళ్లను పాడు చేసు కుంటుంటారని పేర్కొన్నారు. అలాంటి వారికి డెంటల్ ఆస్పత్రులు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ అబెద్ అలీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అబెద్ అలీ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్, డెంటల్ ఇన్‌ప్లాంట్, ఎక్స్‌ట్రాక్షన్, సర్జికల్ ఎక్స్‌ట్రాక్షన్, ఫ్లామ్ సర్వీసెస్, బ్లీచింగ్, కాస్మెటిక్ డెంటిస్ట్రీ, బ్రేసిస్, అలిగ్నేర్, రీస్టోరేషన్, డెంటల్ ఫిల్లింగ్, టూత్ జెవెల్ సదుపాయాలు, చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, చిన్న, జంపాల్‌రెడ్డి, బోయిని శంకర్, ఉల్లెం బాలరాజు, సాయి కుమార్, శేఖర్ గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సహకార సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ కల్లుగీత సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పనగట్ల రామరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కాసుల సురేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా బుడంపల్లి వెంకటేష్‌గౌడ్, డైరెక్టర్లుగా పంజాల బాబూగౌడ్, లింగాల సత్యనారాయణ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వారిని కుషాయిగూడ గౌడ సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసుల రవీందర్ గౌడ్ సంకురి శ్రీనివాస్ గౌడ్, పులి ఆంజనేయులు గౌడ్, కూరెళ్లి అశోక్ గౌడ్, చిత్తుల నర్సింహా గౌడ్, పంజాల ముత్యాలు గౌడ్, సంకురి చైతన్య గౌడ్, సద్దల యాదయ్య గౌడ్, అంజయ్య గౌడ్, బాలయ్య గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకెళ్తాం

- విశారదన్‌పై ఆర్ఎస్పీ వాఖ్యలు సరికావు
- మేడ్చల్ జిల్లా కన్వీనర్ రాజ్ కమల్ మహారాజ్
- ధర్మ సమాజ్ పార్టీ ప్లీనరీ కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-బోడుప్పల్

మహనీయుల స్ఫూర్తితో వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ధర్మసమాజ్ పార్టీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రాజ్ కమల్ మహారాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం బోడుప్పల్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రథమ ప్లీనరీ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి మహనీయుల త్యాగాలేనని తెలిపారు. వారిని స్మరించుకుంటూ వారి జన్మదిన వేడుకలను మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. విశారదన్ మహారాజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత విమర్శలు, దూషణలు చేయటం సరికాదన్నారు. వెంటనే విశారదన్ మహారాజ్‌పై ఆర్ఎస్పీ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావు ఉండొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, సురేష్, శివకుమార్, సైదులు, పరుశురాం, శ్రీధర్, మల్లేష్, మదన్, నవీన్, ఆనందబాబు, నర్సింగ్, శ్రీరాములు, కృష్ణ పాల్గొన్నారు.

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్‌నగర్

పదో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఫలితాలు వస్తాయని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాటాడుతూ.. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. పదో తరగతిలో 10 పాయింట్ గ్రేడ్ సాధించిన వారికి రూ.10వేలు, 9.5 గ్రేడ్ సాధించిన వారికి రూ.5వేలు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 10 డివిజన్ కార్పొరేటర్ గండి రామచందర్, 23వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రెడ్డి శెట్టి మహేష్ గుప్తా, శ్రీమన్నారాయణ, సుధాకర్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఆర్ఎస్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్



నవతెలంగాన-సిటీబ్యూరో

బీఎమ్ఆర్ఎస్ గ్రామర్ స్కూల్ క్రాంతి కాలనీ బ్రాంచ్‌లో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన రోటేషన్స్ ఆఫ్ సోలార్ సిస్టమ్, మిస్సైల్స్, రోబోట్, ఆటోమేటిక్ ఫైర్ అల్లారం, వివిధ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కజిరి డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ నాగరాజు, ఉప్పల్ మండల ప్రెసిడెంట్ దన్ సాగర్, కరెస్పాండెంట్ శ్యామ్, ఏస్‌కే.మదర్, అలితాఫ్, నితేంద్ర మిశ్రా, బీఎం ఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ బి.మల్లారెడ్డి, కరస్పాండెంట్ బి. జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం : నిహారిక

నవతెలంగాణ-జవహర్ నగర్

డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో 28వ డివిజన్‌కు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ క్రింద రూ.39 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డితో కలిసి పలు కాలనీల్లో చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ మాధవ చారి, ఏఈ రాజశేఖర్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా డాక్టర్ మల్లు రవి ఢిల్లీలో నియామకమైన సందర్భంగా గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ ఎల్.తాజ్ మోహన్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెమెంటో అందజేశారు. జవహర్ నగర్ అభివృద్ధికి, ఉద్యోగుల డీఏ, పీఆర్సీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. -నవతెలంగాణ,జవహర్‌నగర్

స్టీఫెన్ హాకింగ్, కార్ల్ మార్క్స్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ విజ్ఞాన శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, కార్ల్ మార్క్స్ వర్ధంతి, భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని కమలానగర్ ఆఫీసులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి కార్ల్ మార్క్స్ చిత్రపటానికి, జయరాజు స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి, కేకే ప్రసాద్ బాబు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోమటి రవి మాట్లాడుతూ.. కార్ల్ మార్క్స్ సామాజిక శాస్త్రవేత్తగా నూతన సమాజాన్ని నిర్మాణం కోసం శ్రామికులు, కార్మికవర్గ ప్రజల పక్షాన పోరాడారన్నారు. అనేక సిద్ధాంతాలను రూపొందించి ఆచరణలో చూపించారని తెలిపారు. సమాజ పరిణామాన్ని, పెట్టుబడి లాంటి ఆర్థిక గ్రంథాలను రూపొందించి కార్మిక వర్గాల రాజ్యాలను స్థాపించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయనకు కొనసాగింపుగా లెనిన్ నాయకత్వంలో 1917లో సోషలిస్టు రాజ్యం ఏర్పడిందని చెప్పారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. స్టీఫెన్ హాకింగ్ తన జవసత్వాలు పనిచేయకపోయినా భౌతిక శాస్త్రంలో, అంతరిక్ష రంగంలోనూ అనేక పరిశోధనలు చేశారని గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో అనేక ఆవిష్కరణలకు దోహదపడ్డారని చెప్పారు. భూమిపై ఎటువంటి అతీతమైన శక్తులు లేవని సమాజానికి నూతన సందేశాన్ని అందించారని తెలిపారు. జయరాజు మాట్లాడుతూ.. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్ని రంగాల్లో తనదైన శైలిలో ప్రయోగాలు చేసి అనేక నూతన ఆవిష్కరణలు చేశారని చెప్పారు. చరిత్ర గతిని మార్చిన అణు విస్ఫోటం సూత్రమైన E=mc square సూత్రాన్ని కనుగొని ప్రపంచ గతిని మార్చాలని ప్రయత్నించారని పేర్కొన్నారు. మానవ సాంకేతిక అభివృద్ధిలో వారి పాత్ర చాలా గొప్పదని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ..ముగ్గురు సామాజిక, భౌతిక శాస్త్రవేత్తలు ఈ సమాజ పురోభివృద్ధికి వారి పాత్ర చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీబీ.చారి, లక్ష్మయ్య, రాజేశ్వరరావు, పార్థసారథి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీమతి శోభ, శారద, కోమటి రవి, ప్రసాద్ బాబు, జయరాజ్, నర్సింగరావు, రుక్కయ్య, ఉదయ భాస్కర్, శివ ప్రసాద్, చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి : శ్రీకాంత్ యాదవ్

- జవహర్ నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తాం
- స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.39 లక్షలు మంజూరు



నవతెలంగాణ-జవహర్‌నగర్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జవహర్ నగర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు రూ.39 లక్షలు మంజూరు చేశారు. ఈ ఆర్డర్ కాపీని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, శంకర్ గౌడ్‌లకు అందజేశారు. అడిగిన వెంటనే అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరిన్ని నిధులు తెచ్చి జవహర్ నగర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, నగేష్ యాదవ్ ఉన్నారు.

ధరణి బాధితులకు న్యాయం చేస్తాం : చైర్మెన్ కోదండరాం రెడ్డి

- బొమ్మరాసి పేటలో ధరణి కమిటీ పర్యటన



నవతెలంగాణ-శామీర్‌పేట

ధరణి బాధితులకు న్యాయం చేస్తామని ధరణి కమిటీ చైర్మెన్ కోదండరాం రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేటలో గురువారం ధరణి కమిటీ పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రెవెన్యూ రికార్డులను భ్రష్టుపట్టించిందన్నారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను సరి చేసి రైతులకు న్యాయం చేయడానికి ధరణి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. బొమ్మరాసిపేటలో గతంలో 50 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన భూమి ధరణి లోపాల వల్ల బ్లాక్ లిస్ట్‌లో పెట్టారని, సుమారు 1050 ఎకరాల భూమిలో తాతల కాలం నుంచి రైతులు సాగు చేసుకుంటున్న వారికీ రిజిస్ట్రేషన్ చేయకుండా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులకు బ్లాక్‌లిస్టులో ఉన్న భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని మండిపడ్డారు. అనంతరం ధరణి కమిటీ లీగల్ అడ్వైజర్ సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి పోర్టల్ వల్ల చాలా మంది రైతులు మోసపోయారని పేర్కొన్నారు. ధరణితో గత ప్రభుత్వ నాయకులే బాగుపడ్డారని తెలిపారు. ధరణి లోపాలను అధిగమించడానికి ధరణి పోర్టల్ నూతన కమిటీని కాంగ్రెస్ ప్రభుత్వం సూచనల మేరకు ఏర్పాటు చేశామని అన్నారు. ధరణితో మోసపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధరణి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని శ్రీ మహాలక్ష్మి ఆలయం నాలుగో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు అమ్మ సేవలో పాల్గొన్నారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీ గణపతి హవనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్య ప్రకాశ్‌రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, అర్జున్‌రావు, మనోజ్, రమేష్, తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఐను కలిసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానంద్, మాజీ ఉపసర్పంచ్, నరసింహ, బెంజిమెన్, యాదగిరి, రామచందర్, ఎండీ. జావిద్, అనీల్, ఆనంద్, కన్నయ్య రాజు, వెంకటేష్ వంశరాజ్, యాదగిరి, బాబు, రాజయ్య, శారద, కూరగాయల నరసింహ, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ నాలా పనులు త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా బాక్స్ నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధి మహదేవపురం పరిధిలో బాక్స్ నాలా పనులను అధికారులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాలకతీతంగా ప్రతి కాలనీని, బస్తీని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్,ధర్మారెడ్డి, మురళీకృష్ణ, టెంపుల్ శ్రీను, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఆల్విన్ కాలనీ పరిధిలోని వాంబే కాలనీలోని బ్లాక్ నెంబర్ 29లో నివసించే గంగమ్మ (42) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా రూ.5,000ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎత్తరి శ్రీను, బి.రాము, పి.రాజు మున్నూరు, శ్రీలత తదితరులు ఉన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రక్తదానం మరొకరికి ప్రాణదానం...రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారిని కాపాడడమే కాకుండా ఆరోగ్యవంతంగా ఉంటాం అనిఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద క్యూసీపీ చైర్మెన్, జీడిమెట్ల గ్రేస్ గాస్పల్ చర్చ్ పాస్టర్ శౌరి బోల్లేదు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన పలువురు పాస్టర్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి ఈనెల 16వ తేదీన శనివారం ఉదయం 9 గంటలకు "గ్రేస్ గాస్పల్ చర్చ్ ఆవరణలో నిర్వహించే రక్తదాన శిబిరం" ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తూఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని కాపాడడమే కాకుండా రక్తదానం చేసిన వ్యక్తి ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. ఈ రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాషువా, పాస్టర్ స్మిత్ బాబు, పాస్టర్ ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి 'లాక్రస్ చాంపియన్షిప్'కు కుత్బుల్లాపూర్ నుంచి 19 మంది క్రీడాకారులు అర్హత సాధించడం చాలా సంతోషించదగ్గ విషయం : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద షాపూర్ నగర్ క్యాపిటల్ డిగ్రీ, పీజీ కాలేజీ చైర్మెన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన సుమారు 19 మంది విద్యార్థులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్లో తెలంగాణ ల్యాక్రస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రాష్ట్రీయ స్థాయి ల్యాక్రస్ వర్క్ షాప్ శిక్షణ కార్యక్రమం ల్యాక్రస్ ఆట విధానాన్ని ఎమ్మెల్యేకి తెలియజేసి ల్యాక్రస్ క్రీడను ఆదరించాలని కోరారు. అదేవిధంగా ఈనెల 26 వ తేదీన ఢిల్లీలోని ఆగ్రా వద్ద నిర్వహించే జాతీయ స్థాయి చాంపియన్షిప్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జాతీయస్థాయి ల్యాక్రస్ ఛాంపియన్షిప్‌కు కుత్బుల్లాపూర్‌కు చెందిన 19 మంది క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషం చదగ్గ విషయమని, క్రీడాకారులను ప్రోత్సహించడంలో నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో అర్హత సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



9ఏండ్ల బాలుడికి శ్వాసకోశ నాళం, స్వరపేటికకు శస్త్రచికిత్స

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలి చికిత్స

నవతెలంగాణ-సిటీబ్యూరో

పల్నాడు జిల్లా, సత్తెనపల్లి నియోజకవర్గం, నకిరేకల్ మండలం, నకిరేకల్ గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ, ఆమె భర్త కొడుకు మాస్టర్ మహ్మద్. తొమ్మిదేండ్ల వయస్సున్న మాస్టర్ మహ్మద్ నకిరేకల్ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే స్కూల్‌కి వెళ్ళిన మహ్మద్ ఫిబ్రవరి 29 వ తేదీన తోటి పిల్లలతో ఆడుకుంటూ...అనుకోకుండా ఒక ఇనుపరాడ్ మీద పడ్డాడు. ఆ ఇనుపరాడ్ మహ్మద్ గొంతుకు బలంగా గుచ్చుకుంది. దీంతో అతడి శ్వాసనాళం, స్వరపేటిక పూర్తిగా చితికిపోయి మాటరావడం, శ్వాసపీల్చుకోవడానికి ఇబ్బంది అయ్యింది. అతని తల్లిదండ్రులు విద్యార్థిని దగ్గర్లో ఉన్న నరసరావు పేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ వైద్యులు పరిశీలించి తాత్కాలిక వైద్య సేవలందించి.. మెరుగైన వైద్య సేవల కోసం వెంటిలేటర్ సహాయంతో అంబులెన్సులో హైద్రాబాద్‌కు తరలించారు. హైద్రాబాద్‌కు వచ్చిన మహ్మద్‌కు.. నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు పరిశీలించి, అతనికి తాత్కాలికంగా శ్వాసతీసుకోవడానికి ఒక కృత్రిమ పైప్‌ను అమర్చారు. ఆ బాబుకు ఇంకా మెరుగైన వైద్యం అవసరమని



భావించి, నీలోఫర్ వైద్యులు అతన్ని కాంటినెంటల్ హాస్పిటల్ వెళ్ళమని సూచించారు. కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు వచ్చిన విద్యార్థి మహ్మద్‌ని పరిశీలించిన స్పెషలిస్ట్ డాక్టర్ దుష్యంత్ గారి బృందం.. ఆ అబ్బాయికి వివిధ రకాల చికిత్సలు చేసి అతి కష్టమైన లెరింగోట్రైకెల్ రీకన్స్ ట్రక్షన్ సర్జరీ చేయాలనుకున్నారు. అరుదైన ఈ సర్జరీ మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇది వరకు జరిగిన సందర్భాలు చాలా తక్కువ. దీనికి నిష్ణాతులైన డాక్టర్లు అవసరం... లెరింగాలజీలో ఫెలోషిప్ చేసి, అనుభవమున్న డాక్టర్లు కావాలి. ఎందుకంటే ఏ కొంచెం తేడా జరిగిన.. నష్టం చాలా ఉంటుంది. అలాగే ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. ఈఎన్ టీ సర్జన్ అండ్ లేరింగాలజిస్ట్ అయిన డాక్టర్ దుష్యంత్ గారి టీమ్ .. మహ్మద్‌ను అన్ని రకాల టెస్ట్స్ చేసి... ఆపరేషన్‌కు అవసరమయ్యే డబ్బులు సమకూర్చుకోమని పేషెంట్ తల్లిదండ్రులకు చెప్పారు. అంత స్తోమతలేని ఆ పేద తల్లదండ్రులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి ప్రయత్నించారు. సోషల్ మీడియా ద్వారా బాబు ఆరోగ్య స్థితిని తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి, కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు ఫోన్ చేసి...బాబు ఆరోగ్యం చక్కబడ్డానికయ్యే ఖర్చునంతా తాను భరిస్తానని చెప్పి వెంటనే ఆపరేషన్ చేయమని చెప్పారు. అనుభవజ్ఞులైన కాంటినెంటల్ హాస్పిటల్స్ డాక్టర్స్ టీమ్ .. ఈ మధ్యే మహ్మద్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి, బాబు శ్వాసనాళాన్ని పునరుద్ధరించారు. స్వరపేటికను తిరిగి బాగు చేశారు. దీంతో మూగబోయిన అతని గొంతుకకు మళ్ళీ ప్రాణం వచ్చింది. ఈ ఆపరేషన్ జరిగి ఉండకపోతే ఆ బాలుడు జీవితాంతం మూగవాడిగానే ఉండిపోయేవాడు. ప్రస్తుతానికి బాబు కోలుకుంటున్నాడు.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు



- పరిశీలించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులలో భాగంగా రూ.2 కోట్ల 74 లక్షల అంచనావ్య యంతో, చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న, మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎల్లమ్మ చెరువులో కలుషిత నీరు కలవకుండా, చేపడుతున్న డ్రయినేజీ వ్యవస్థ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియచేసారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు, చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా చెరువు సుంద రికరణలో భాగంగా చెరువు కట్ట, పటిష్టం పరిచేలా పున రుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యే కంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణం పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామన్నారు. భూగర్భ డ్రయినేజీ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమలు పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను తెలి పారు. చెరువును దత్తత తీసుకొని సొంత నిధులతో చెరు వును శుభ్రపరిచి సుందరీకరణ చేపట్టామన్నారు. కలువ పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని, చెరువులు కలుషితం కాకుండా, కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయిలో సంరక్షిస్తామని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ అడ్ హక్ కమిటీ సభ్యులుగా రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి గ్రేటర్ అడ్ హక్ కమిటీ సభ్యులుగా అవకాశం దక్కించుకున్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధి మహాదేవపురంలోని యోగా అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో కార్పొరేటర్‌ను డివిజన్ బీఆర్ఎస్ నేతలు శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించి, ఈ పదవి అందించారన్నారు. తనకు ఈ పదవి మరింత మరింత బాధ్యత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు రుద్ర దూలప్ప, కూరపాటి కరుణాకర్ రాజు, లక్కోజు మురళీకృష్ణ, ధర్మారెడ్డి, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించేందుకు కృషి



- కొలన్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఎస్ఎంసీ ప్రెసిడెంట్, కొలన్ రాజశేఖర్ రెడ్డిలు హాజరయ్యారు. బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో హిందూ, ముస్లిం స్మశాన వాటికలో కాంగ్రెస్ పార్టీ స్పెషల్ ఫండ్ ద్వారా నీటి బోరు పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం రాజీవ్ నగర్‌లో సీసీ రోడ్డు పనులకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలన్ రెడ్డి, రామ చందర్ నాయక్, ఎస్ఎంసి ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరెక్టరేట్ ఆఫ్ ఆటోనామస్ కాలేజ్ అఫైర్స్‌గా గురువారం పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.రవీందర్ రెడ్డిని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్ట్ డాక్టర్ ఎ.అరుణ కుమారి, డిప్యూటీ డైరెక్టర్ అడ్మిషన్స్ డాక్టర్ సైదా నాయక్, చీఫ్ఇంజనీర్ వి. వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్. వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహలతో పాటు పలువరు రవీందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియచేశారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



తెలంగాణ పీసీసీ జనరల్ సెక్రటరీ, స్పోక్ పర్సన్ అద్దంకి దయాకర్ ని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేమ్ నరేందర్ రెడ్డిలను గురువారం వారి వారి నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిసెట్టి దినేష్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంట్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తయారు చేసి ప్రభుత్వ పథకాల అమలును ప్రజలలోకి తీసుకువెళ్లాలని వేం. నరేందర్ రెడ్డి సూచించారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



మంచి నిద్రకు పండంటి పది సూత్రాలు

- నేడు అంతర్జాతీయ నిద్ర దినోత్సవం
- డాక్టర్ శుభకర్ నాదెళ్ల, కన్సల్టెంట్ క్లినికల్ అండ్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్, కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్

నవతెలంగాన-సిటీబ్యూరో

నేడు అంతర్జాతీయ నిద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిద్ర ప్రాముఖ్యత, నిద్రకు సంబంధించిన జబ్బుల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సర థీమ్ గ్లోబల్ హెల్త్ కోసం స్లీప్ ఈక్విటీ ప్రపంచ వ్యాప్తంగా వివిధ జనాభా, ప్రాంతాలలో నిద్ర ఆరోగ్యంలో అసమానతల కారణంగా, ప్రపంచ వ్యాప్తంగా అదనపు భారం, ఆరోగ్య అసమానతలను సృష్టిస్తోంది. నిద్ర మన జీవితంలో ఒక ముఖ్య భాగం. నిద్ర అనేక ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంది. నిద్ర లేమి వల్ల హైబిపి, గుండె సమస్యలు, షుగర్, ఊబకాయం, పక్షవాతం, మానసిక సమస్యలు వంటి అనేక అరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. సుమారు 45శాతం మంది ప్రపంచ జనాభాకు నిద్రకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారని అంచనా. కానీ వీరిలో అవగాహన లేకపోవడం వల్ల మూడవ వంతు బాధితులు మాత్రమే డాక్టర్లను సంప్రదిస్తున్నారు. నిద్రకు సంబంధించిన జబ్బులలో స్లీప్ అప్నియా అనేది చాలా ముఖ్యమైన సమస్య స్లీప్ అప్నియా ఉన్న వారికి ప్రధానంగా గురక, నిద్రలో ఊపిరి ఆగి మెలుకువ రావడం, పగలు అతి నిద్ర, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు కనబరుస్తారు. పాలీ సోమ్నోగ్రఫీ (నిద్ర పరీక్ష) ద్వారా ఈ సమస్యను గుర్తించవచ్చు. సీపీఏపీ థెరపీ, బరువు తగ్గడం, కొన్ని రకాల శస్త్రచికత్సల ద్వారా ఈ జబ్బుకు చికిత్స చేయవచ్చు.



మంచి నిద్రకు పది సూత్రాలు

1. ప్రతి రోజు నిద్రకు ఒకటే సమయాన్ని కేటాయించాలి. ప్రతి రోజు ఒకటే సమయానికి నిద్ర పోవడం అలాగే ఒకే సమయానికి నిద్రలేవడం ఆరోగ్యానికి మంచిది.
2. రాత్రి పూట తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అలాగే రాత్రిపూట ఆలస్యం చేయకుండా త్వరగా భోజనం చేయాలి.
3. కాఫీ, టీ ఎక్కువగా త్రాగడం, పోగాకు నమలడం, సిగరేట్, బీడీలు త్రాగడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి అలవాట్లు నిద్రలేమి, నిద్రకు సంబంధించిన జబ్బులను కలిగిస్తాయి. ఈ అలవాట్లు మానుకోవాలి.
4. మొబైల్ ఫోన్, కంప్యూటర్, టీవీల నుండి వచ్చే బ్లూ లైట్‌ను కనీసం నిద్ర సమయానికి రెండు గంటల ముందు నుండి దూరంగా ఉండాలి.
5. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల నిద్ర సమయం, నాణ్యత పెరుగుతాయి. రాత్రిపూట అతిగా వ్యాయామం, జిమ్ చేయడం మంచిది కాదు.
6. రాత్రి నిద్ర పోయే ముందు తేలికపాటి నడక, ధ్యానం చేయడం, సంగీతం వినడం మంచిది.
7. పగటిపూట నిద్రపోయే అలవాటు ఉంటే 45 నిమిషాలు మించకుండా చూసుకోవాలి.
8. బెడ్‌రూం వాతావరణం నిశబ్దంగా, వీలైనంత చీకటిగా సరైన టెంపరేచర్‌లో తాజా గాలి వచ్చేలా ఉండాలి.
9. మానసిక ఆందోళనను కలిగించే విషయాలు రాత్రిపూట నిద్ర సమయంలో చర్చించడం మంచిది కాదు.
10. నిద్రించె బెడ్ శుభ్రంగా ఉంచుకోవాలి, బెడ్ మీద పని చేసుకోడం మొబైల్ చూడడంవంటి పనులు చేయకూడదు. నిద్రలేమి ,అతిగురక , ఆయాసం వంటి నిద్రకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే పల్మోనాలజిస్ట్‌ని కలిసి చికిత్స చేయించుకోవాలి.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ ఉప కమిషనర్‌ను కలిశారు. పారిశుధ్య కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను తెలుపుతూ.. కార్మికులకు సౌలభ్యంగా ఉండే నోడల్ స్థాయి అధికారిని ఈఎస్ఐ హాస్పిటల్లో ప్రభుత్వం ద్వారా నియమించాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులను వారు పని చేసుకుంటున్న ఏరియా నుంచి దూర ప్రాంతలోకి మార్చడం ద్వారా వ్యయ ప్రయాసలకు, తరచూ విధులకు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు అవుతున్నాయని పేర్కొన్నారు. విధులను పర్యవేక్షిస్తున్న ఎస్ఎఫ్ఏ సిబ్బంది తగిన మేరకు లేనందున ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అన్ని గ్రూపులలో రిటైర్మెంట్, చనిపోయిన స్థానం, అనారోగ్య కారణాలచే రెండు మూడు సంవత్సరాల నుంచి విధులకు రాలేకపోవుచున్న వారి స్థానంలో పూర్తి సంఖ్యలో పారిశుధ్య కార్మికులను తీసుకోవాలని పారిశుధ్యని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి కె యేసు రత్నం, మున్సిపల్ సంగం జిల్లా అధ్యక్షులు డి.రాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు వి.హరినాథ్ రావు , నాయకులు బాబు మరియు పారిశుధ్య కార్మికులు కుత్బుల్లాపూర్ సర్కిల్ కమిషనర్‌కి మెమోరడంతో డిమాండ్ చేయడం జరిగింది.

మొండికుంట నాలాను కమ్మేసిన అపర్ణ కన్స్ట్రక్షన్

- హెచ్ఎండిఏ అనుమతులు రాకుండానే అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తూ... అపర్ణ యాజమాన్యానికి అధికారుల వత్తాసు





నవతెలంగాణ-దుండిగల్

ఔటర్ రింగ్ రోడ్డు పుణ్యమాని భూముల రేట్లకు రెక్కలు రావడం గత గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడంతో ఇక్కడి గ్రామాల ప్రజల పంట భూములు సైతం కాసుల పంటగా మారి.. భూముల ధరలు లక్షలు పలుకుతూ ఉండడంతో ఖాళీ స్థలాలు, కుంటలు, చెరువులు, స్థలాలు, నాలాలు ఏవైనా సరే కనిపిస్తే, కొందరు భూ అక్రమన దారులు కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి భూమి పక్కన ఉన్న అక్రమార్కులకు కాసుల పంట కురిపిస్తు... వాటిని కనుమరుగు చేసేంతవరకు వదలడం లేదన్నది అదృశ్యం అవుతున్నది అనడానికి కుంటలు చెరువులు నిదర్శనం. వారికి ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు, కోర్టు ఆదేశాలైన బేఖాతరు చేస్తూ ఆదాయ మార్గమే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. దుండిగల్ గండి మైసమ్మ మండలం బౌరంపేట్ పరిధిలోని సర్వే నెంబర్ 244 మొండికుంట ఈ కుంట విస్తరణ 4 ఎకరాల... 20 గుంటలు అపర్ణ కన్స్ట్రక్షన్స్ బడా సంస్థ నిర్మాణదారులు ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో గల నాలా పూడ్చి వేసి కొంత స్థలం కలుపుకొని అపర్ణ కన్స్ట్రక్షన్స్ సంవత్సర కాలంగా హెచ్ఎండిఏ అనుమతులు రాకుండగానే కొన్ని షెడ్లు, నిర్మాణాలు చేపట్టారు. ఒకవైపు మున్సిపల్ అధికారులను, ఇరిగేషన్, రెవెన్యూ మండల అధికారుల అండదండలతో కాంపౌండ్ ఐరన్ రేకులతో భారీగా కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపడుతూ బఫర్ జోన్ లోపల యధేచ్ఛగా పనులు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ నిర్మాణాలపై రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుం దని, మున్సి పల్ అధికారులు హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నాయంటూ సంవత్సర కాలంగా కాలయాపన ఇప్పటికీ అనుమతుల పత్రం బహిర్గతం చేయకుండా దాటవేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ ,మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే అపర్ణ కన్స్ట్రక్షన్ వారు అక్రమ నిర్మాణం సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఇప్పటికైనా పై అధికారులు వెంటనే జెయింట్ సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన నాలాను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదే విషయంపై గండి మైసమ్మ మండల తాసిల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, మీడియా వివరణ కోరగా.. రెవెన్యూ అధికారికి వెంటనే ఎఫ్ టిఎల్ మొండికుంటలో ఎలాంటి నిర్మాణాలు జరుగుతున్నాయో వివరాలు తెలుపుచూ. మున్సిపల్, సర్వేయర్, ఇరిగేషన్ జాయింట్ యాక్షన్ టీంతో.. పరిశీలన చేసి, నాలా ఆక్రమణ పై చర్యలు చేపట్టేందుకు ఇతర శాఖల అధికారులకు ఇప్పటికే లెటర్‌ల ద్వారా తెలియపరిచినట్లు ఆర్ఐ తెలిపారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటన పట్ల హర్షం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బూరుగు భావి హనుమంతరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం షాపూర్ నగర్ కార్యలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో... మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటన పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, బీసీ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి, ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుకి వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కి, కొండ సురేఖ, మురళి పటేల్‌కి, రాష్ట్ర సహచర మంత్రివర్యులు అందరికీ తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కుల బాంధవులు అందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతాభినందనలు తెలియజేసారు. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రం మునురుకాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య ఒకే కులం, ఒకే సంఘం అని నినాదం తో 33 జిల్లాల్లోని ప్రతీ గ్రామం, ప్రతీ పల్లెలో తిరుగుతూ మున్నూరు కాపులు అందరినీ సంఘటితం చేస్తూ... మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాలపై ప్రతినిధులపై ఒత్తిడి తెస్తూ గురువారం కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కారకులైనటువంటి కొండా దేవయ్యకి, ఎడ్ల రవికి, కొత్త లక్ష్మణ్, ఉగ్గే శ్రీనివాస్‌కి, బండి సంజీవ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో కాపు కార్పొరేషన్ విషయాని పొందపరచి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యి 100 రోజుల గడవక ముందే మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి అభినందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శి సాయిని శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జగద్గిరిగుట్ట అధ్యక్షులు ఔచర్ల లక్ష్మీనారాయణ, చింతల్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు నరేంద్ర కుమార్, పత్తి రాములు, వేషాల సంపత్, సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీపీసీసీ మహిళా సేవాదళ్ కార్యదర్శిగా అంజలి యాదవ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ కైలాష్ హిల్స్‌కు చెందిన గంగుల అంజలి యాదవ్ టీపీసీసీ మహిళా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. అల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్ నియమించారు.దీంతోపాటు అదనంగా నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జిగా తెలంగాణ ప్రదేశ్ మహిళా సేవాదళ్ మహిళా చీఫ్ భవాని త్రివేది తనను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ప్రభావితం చేసి ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను తెలియజేసి పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్, అస్బెస్టాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా, నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా గొట్టిముక్కల వెంకటేశ్వర రావు (జీవీఆర్) కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రెసిడెంట్ నరేష్, వైస్ ప్రెసిడెంట్ ఏ నర్సింహులు, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ హుస్సేన్,జాయింట్ సెక్రెటరీ ఎంఏ రఫిక్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సిద్ధార్థ నగర్‌లోని ఇండోర్ స్టేడియం వద్ద నివసిస్తున్న 50 ఏండ్ల తాడేపల్లి చంద్రశేఖర్ గురువారం తన కుమార్తె నేహాను ఎస్సార్ నగర్‌లోని శ్రీ చైతన్య కాలేజీ వద్ద ఇంటర్ పరీక్ష రాసేందుకు తీసుకొని వెళ్లి వదిలిపెట్టాడు. అనంతరం అతను ఇంటికి వెళ్లలేదు. మధ్యాహ్నం 12 గంటలకు నేహా తల్లి కాలేజీ వద్దకు వచ్చి ఆమెను ఇంటికి తీసుకొని వెళ్ళింది. ఇంటికి వెళ్లిన కుమార్తె గదిలోనికి వెళ్లి చూడగా తన తండ్రి సెల్ ఫోన్ టేబుల్‌పై ఉండటం గమనించింది. చుట్టుపక్కల వారిని, తన తండ్రి ఆఫీసు వద్దకు వెళ్లి విచారించినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దాంతో మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఆధారంగా వ్యక్తి ఆచూకీ తెలుసుకుంటామని కుటుంబ సభ్యులకు పోలీసులు తెలిపారు.

నగరంలో 439 అక్రమ నిర్మాణాల కూల్చివేత

- జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో గత మూడు నెలల్లో 439 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్టు జీహెచ్ ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ గురువారం తెలిపారు. అనధికార నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయన్నారు. టీఎస్ బీ పాస్ ద్వారా చెల్లుబాటు అయ్యే అనుమతులు పొందిన తర్వాతనే భవనాలను నిర్మించాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను గుర్తించేందుకు జోనల్ కమిషనర్ నేతత్వంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ కార్యకలాపాలను జోనల్ కమిషనర్లు నిశితంగా పరిశీలిస్తున్నారని, ప్రారంభ దశలో ఉన్న కొన్ని అనధికారిక నిర్మాణాలను తక్షణమే కూల్చివేస్తున్నట్లు రొనాల్డ్ రోస్ తెలిపారు.

కంటోన్మెంట్ బోర్డులో కారుణ్య ఉద్యోగాలు భర్తీ చేయాలి

- బోర్డు కార్యాలయంలో ఆశావాహుల ధర్నా
- మెరిట్ పద్ధతిన నియామకాలు చేస్తామంటున్న అధికారులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డులో కారుణ్య ఉద్యోగ నియామకాలు వెంటనే భర్తీ చేయాలని గురువారం బోర్డు కార్యాలయంలో లబ్దిదారులు ధర్నా నిర్వహించారు. గత 13 ఏండ్లుగా కంటోన్మెంట్ కంటోన్మెంట్ బోర్డ్ లో కారుణ్య నియామకాలు లేకపోవడంతో లబ్ది దారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు కొందరు లబ్దిదారులు కోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా తీర్పును తెచ్చుకున్నారు. అయితే ఆ తీర్పును కూడా కంటోన్మెంట్ అధికా రులు అమలు చేయడం లేదని నిరసనగా ధర్నా చేశారు. కాగా 2010లో దాదాపు 29 మందిని కారుణ్య ఉద్యోగాలను నియా మకాలు చేశారు. ఆ తర్వాత నుండి నియామకాలు లేకపోవడంతో ప్రస్తుతం సంఖ్య పెరిగిపోయింది.కారుణ్య నియామకాల్లో దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య భారీగా పెరిగిపోవడంతో అధికారులు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని చెప్తున్నారు దాంతో కోర్టును ఆశ్రయించిన లబ్దిదారులకు ఉద్యోగం వచ్చే అవకాశం లేకపో వడంతో ఆందోళనకు దిగారు. అయితే పారిశుధ్య సిబ్బం దిలోనే ఎక్కువ కారుణ్య ఉద్యోగాల కోసం దాఖలు చేసుకునే వారు ఉన్నారు. తరచూ పారిశుధ్య సిబ్బందిలో పని చేసే వారే చనిపోతుండడంతో వారి సంబంధికులు కారుణ్య ఉద్యోగాల కోసం దాఖలు చేసుకున్నారు. అయితే ఇటీవల జరిగిన బోర్డు సమావే శంలో కారుణ్య ఉద్యోగాల నియామకం చేయాలని బోర్డు అధికారులు తీర్మానించారు. కాగా మెరిట్ పద్ధతిలో నియామకాలు చేస్తుండడంతో కొంత మంది లబ్దిదారులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేవన్న ఆందోళన చెందుతున్నారు ఈ విషయంపై సీఈఓ మధుకర్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల నుసారమే కారుణ్య ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు.

ఉస్మానియా ఫౌండేషన్ భవన్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-ఓయూ

ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాలలో అద్భుతంగా రాణిస్తున్న ఎంతోమంది మహనీయులను అందించిన ఓ యూ అభివద్ధికి ఆలంబనగా నిలిచేందుకు తోడ్పడేలా ఉస్మానియా ఫౌండేషన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గురువారం ఓయూలో భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రో.రవీందర్ పాల్గొని మాట్లాడుతూ యూనివర్సిటీ సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు లక్ష్యంతో ఫౌండేషన్ పనిచేయనుందని అన్నారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, విశ్వవిద్యాలయం మధ్య ఫౌండేషన్ వారధిగా నిలుస్తుందని చెప్పారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించేందుకు తోడ్పడుతుందని వివరించారు. ఓయూ అభివృద్ధికి తమ సహకారం అందించేందుకు ఒక వేదిక ఉంటే బాగుంటుందని పూర్వ విద్యార్థులు చాలాకాలం నుంచి కోరుతున్నారని వీసీ తెలిపారు. ఎట్టకేలకు ఫౌండేషన్ కార్యరూపం దాల్చడం హర్షణీయం అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో సెక్షన్ 8 కింద ఉస్మానియా ఫౌండేషన్ రిజిస్టర్ అయిందని వీసీ నేతృత్వం లోని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తుం దన్నారు. పూర్వ విద్యార్థుల్ని భాగస్వా ములు చేస్తూ యూని వర్సిటీ అభివద్ధికి నిధులు సమకూర్చనుంది. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పనకు తోడ్పడనునట్టు చెప్పారు. ప్రస్తుత విద్యార్థులకు ఎప్పటికప్పుడు నైపుణ్య శిక్షణ అందిస్తూ దిశా నిర్దేశం చేయనుట్లు ఉస్మానియా ఫౌండేషన్ భవన్ అద్భుతమైన కల్చరల్ సెంటర్ గా కూడా నిలవనుంది. అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రో. డి.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణ, ఉస్మానియా ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గన్నవరపు శ్రీనివాసరాజు, డాక్టర్ దేవరకొండ విజయ్ కుమార్, వారాల భాను ప్రకాశ్, ఆవుల భాస్కర్ రెడ్డి, ఓయూ సీఏబీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణం జరగనుందిలా..

ఉస్మానియా ఫౌండేషన్ భవనం 1.6 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఫౌండేషన్ అవస రాలను దష్టిలో పెట్టుకొని ప్రపంచ స్థాయి సదుపా యాలు కల్పించనున్నారు. రెండు అంతస్తుల ఆర్.సి.సి భవనంలో ప్రధాన ఫౌండేషన్ బ్లాక్, గెస్ట్ రూమ్స్ బ్లాక్ ఉంటాయి. 9821.24 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న భవనం కోసం... రూ.10.16 కోట్ల బడ్జెట్ వెచ్చించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభ్యున్నతి కోసం ఫౌండేషన్ కీలక పాత్ర పోషించనుంది.

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అగ్నిప్రమాదం

- తప్పిన ప్రాణ నష్టం
- మారేడ్‌పల్లిలోనూ ఇన్‌క్రెడిబుల్ ఇండియా కార్యాలయంలో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్ పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. మార్కెట్ యార్డ్‌లోని ఓ దుకాణంలో మంటలు చెలరేగాయి. గురువారం సాయంత్రం వెంకట లక్ష్మీ వెజిటబుల్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు తెలిసింది. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. దుకాణంలో సామాగ్రి,కూరగాయలు అగ్నికి అహుత య్యాయి.



మారేడ్‌పల్లిలోనూ..

సికింద్రాబాద్‌లోని మారేడ్‌పల్లిలోనూ మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం ఇన్‌క్రెడిబుల్ ఇండియా కార్యాలయంలో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న సెక్యూరిటీ సిబ్బంది స్థానికులు తక్షణమే స్పందించి మంటలను అదుపు చేశారు ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు.



మహిళా క్రీడోత్సవాలను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

జింఖానా గ్రౌండ్‌లో మహిళా క్రీడోత్సవాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు అనంతరం కాసేపు క్రీడాకారుల ఆటలను తిలకించారు. ఈ సందర్భంగా ఏబీవీ ఫౌండేషన్ అధ్యక్షురాలు కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు మహిళలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దీపికతో పాటు పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల్లో యువతే అధికం

- విరించి ఆస్పత్రి నెఫ్రాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కేఎస్ నాయక్



నవతెలంగాణ-బంజారాహిల్స్

'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్ నోన్ ఆరిజిన్'తో సతమతమౌతున్న యువతకు ఇది ఆందోళన కలిగించే అంశమని తెలంగాణలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధికి మధుమేహమే ప్రధాన కారణమని విరించి హాస్పిటల్, నెఫ్రాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కేఎస్ నాయక్ తెలిపారు. కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు గురువారం బంజారాహిల్స్ విరించి హాస్పిటల్‌లో నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్, స్పెషలిస్ట్ ఇంటర్వెన్షనల్ నెఫ్రాలజీ డాక్టర్ నవీన్ కుమార్ మట్టెవాడ,సీనియర్ కన్సల్టెంట్-నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్, స్పెషలిస్ట్ ఐసీయూ డాక్టర్ నవీన్ కుమార్ మేడి, ఆస్పత్రి ప్రెసిడెంట్ డాక్టర్ సాయి రవిశంకర్లతో కలిసి ఆయన మాట్లాడారు... తెలంగాణలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణమన్నారు. భారతదేశంలో 2020లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందన్నారు. అనేక ఇతర వ్యాధులకు కూడా మధుమేహమే కారణమని చెప్పారు. మూత్రపిండాల వ్యాధి బారినపడుతున్న వ్యక్తుల సగటు వయస్సు 50 సంవత్సరాలు అన్నారు. అందులో 67 శాతం పురుషులని తెలిపారు. ఆసక్తికరంగా.. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో రెండు రెట్లు అధికంగా ఉన్నారని చెప్పారు. రోగులలో సగటు అంచనా వేసిన గ్లోమెరులర్ వడపోత రేటు (ఈజీఎఫ్ఆర్ఈ) అధ్యయనంలో 40 ఎంఎల్/మిన్/1.73 పా అన్నారు. మూత్రపిండాల వ్యాధులతో ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. మూత్రపిండాల వైఫల్యం, హదయ సంబంధ వ్యాధులకు చికిత్స చేయకపోతే మరణానికి దారితీస్తుందన్నారు. మూత్రపిండాల వ్యాధికి మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, ధూమపానం, మూత్రపిండాల సమస్యలు, మూత్రపిం డ రాళ్ళు, పుట్టుకతో వచ్చే మూత్రపిండ సమస్యల కుటుంబ చరిత్ర కారణమన్నారు. మూత్రపిండాల వ్యాధిని అరికట్టాలంటే ముందుగా గుర్తించడం, చికిత్స కీలకమన్నారు. తెలంగాణలో మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణమని, హెచ్‌టీఎన్ (హైపర్‌టెన్షన్) రెండో స్థానంలో ఉందని తెలిపారు.

చిన్న చిత్రాలకు ప్రభుత్వం మద్దతు

- సినిమాటోగ్రఫి శాఖా మంత్రి వెంకటరెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

చిన్న చిత్రాలకు ప్రభుత్వ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సినిమాటోగ్రఫి శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. చిన్న చిత్రాల వల్ల కూడా సినీ ఇండస్ట్రీకి ఎంతో మేలు జరుగుతుందని అలాంటివారికి తాను అండగా ఉంటానని తెలిపారు. హైదరాబాద్ నేపథ్యంగా దర్శకుడు ప్రణీత్, నిర్మాతలు సంపత్ మాక, విజయ్ శేఖర్‌లు పతంగ్ అనే సినిమాను రూపొందించారు. కొద్ది రోజుల క్రితం ఈ సినిమా నుంచి 'హే హలో నమస్తే' అనే పాటను విడుదల చేశారు. అయితే ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్ది వ్యూస్ రావడంతో మంత్రి ఈ చిత్ర బందాన్ని బంజారాహిల్స్‌లోని తన నివాసానికి పిలిచి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఈ సినిమా నేపథ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిన్న సినిమాల వల్ల ఎంతో మంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లకు ఉపాధి లభిస్తున్నదని.. అందువల్ల చిన్న సినిమాలకు ఎటువంటి సహాయం కావాలన్నా ప్రభుత్వం తరపున తాము అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్లు వంశీ పుజిత్, ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్‌లతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్ నాని బండ్రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిఖిల్, రమేష్ మట్టా, రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీఓఎస్‌గా ప్రొ.విజయలక్ష్మి

నవతెలంగాణ-ఓయూ

ఓయూ తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులుగా డా. ఏలె విజయలక్ష్మి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు పూర్వ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు ప్రొ. సాగి కమలాకర శర్మ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా డా. ఏలె విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యాల వికాసం కోసం పాఠ్యప్రణాళికల్లో నూతనంగా రావాల్సిన మార్పులను నిరంతరం అధ్యయనం చేస్తూ అభివద్ధిలో భాగస్వామ్యం అవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. అర్జున్ రావు, ప్రొ. సూర్య ధనుంజయ, ప్రొ. సి. కాశీం, డా. ఎస్. రఘు పాల్గొన్నారు.

మహిళలకు క్రీడలను నిర్వహించిన కార్పొరేటర్ దీపిక



నవతెలంగాణ- కంటోన్మెంట్

మోండా డివిజన్ కార్పొరేట్ కొంతం దీపిక నరేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా మారేడుపల్లి చెన్నై గ్రౌండ్ దినో త్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని మహి ళలతో కలిసి కేక్ కట్ చేసి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా కార్పొరేటర్ నిర్వహిం చిన వివిధ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు శ్రీ గణేష్ తో కలిసి బహుమతులను అందజేశారు. ఈ సంద ర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహిళల సాధికారిత కోసం మహిళా భవన్ నిర్మిస్తానని తెలియజేశారు. మహిళా మణులందరినీ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిట్ట నగేష్, డివిజన్ ప్రెసిడెంట్ మాలతీ, రేఖ,మాధవీ, బాలేశ్వరి,శరణ్య మహిళలు, బీజేపీ కార్యకర్తల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టెక్నోస్మానియా 2024 పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఏప్రిల్ 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ-2024 పోస్టర్స్‌ను, వెబ్సైట్ , ట్రైలర్ ను కన్వీనర్ ఆచార్య ఎస్.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు విడుదల చేశారు. విద్యార్థులు డాన్స్ లు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు మాట్లాడుతూ. విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆచార్య వి. వి. బసవ రావు మాట్లాడుతూ కన్వీనర్ ఆచార్య ఎస్. శ్రీను నాయక్‌ను అభినందించారు. కన్వీనర్ ఆచార్య ఎస్. శ్రీను నాయక్ మాట్లాడుతూ. టెక్నోస్మానియ 2024లో డిపార్ట్మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో కేటాలసిస్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫుడ్ సినిర్జిసం, డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్స్ క్రోమ, డిపార్ట్మెం ట్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో టెక్నో ఫార్మా, హోటల్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో టెక్నో హాస్పిటాలిటీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ తమ విభాగాలలో పరిశోధన పత్రాలు సమర్పించవచ్చు అన్నారు. అంతరంగ్ లో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతో మంది ప్రముఖులు విచ్చేసి టెక్నికల్ లెక్చర్స్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జె.హయవదన, డైరెక్టర్ ఎగ్జామ్ సెల్ ప్రొ. వి.రమేష్ కుమార్, ఆచార్య జి.ప్రభాకర్ రెడ్డి,ప్రొ. బి. రాజం , ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్స్ ప్రొ. డా. బి. పరమేశ్వర్లు, డా. సాదం ఐలయ్య, డా. వి. భాస్కర్, డా. కె. శ్రీనివాసులు, డా. ఎస్. అనిత, డా. ఏ. పరశురాములు , స్టూడెంట్ కో ఆర్డినేటర్ లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్, పి. అఖిల, ముకేష్, జె. సాహిత్య, ఎం. సూరి దుర్గ, ఎం. అరవింద్, అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మతతత్వ పార్టీలకు సమాధానం చెప్పే సమయం ఆసన్నమైంది

- ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ..

నవతెలంగాణ-బంజారాహిల్స్

మతతత్వ పార్టీలకు సమాధానం చెప్పే సమయం ఆసన్నమైందని ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సెక్రెటరీ మురహరి అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ఆర్ గంగాధర్, మెదక్ నియోజకవర్గం నుంచి బి.శ్రీనివాస్ అభ్యర్థులుగా తమ పార్టీ నుంచి పోటీలో ఉంటారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మతతత్వ పార్టీలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి పి తేజ, రాష్ట్ర ఆర్గనైజర్ కమిటీ సభ్యులు జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు



నవతెలంగాణ-ఓయూ

నేడు మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తూ పురోగతి చెందుతున్నారని కాకతీయ హాస్పిటల్స్ ఫౌండర్ ప్రెసిడెంట్, ఎండీ డా.జయశ్రీకిరణ్ అన్నారు. గురువారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డి.శ్రీరాములు అధ్యక్షతన మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంటిలో వివిధ రకాల పాత్రలకు న్యాయం చేకూరుస్తు ఇక వారి వారి వత్తుల్లో సత్తాచాటుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎఆర్ పి.అనిత,వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.జి.నరేష్ రెడ్డి,డీన్ ప్రొ.వెంకటయ్య,ప్రొ.సుధ, ప్రొ.స్మిత సాంబ్రాణి, ప్రొ.రాజు, డా.సంధ్యారాణి, డా.అర్చనతో పాటుగా మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటికి ఈటల రాజేందర్..

నవతెలంగాణ-ఓయూ



హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ నివాసానికి గురువారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ శాసనసభ్యులు బొడిగా శోభలు విచ్చేశారు. డివిజన్ అధ్యక్షులు కక్కిరేణి హరీష్ ఈటల రాజేందర్‌తో మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఆయనకు భరోసా కల్పించారు.



జీహెచ్ఎంసీ సర్కిల్ 19 పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా ఆస్తి పన్ను పెద్ద మొత్తంలో చెల్లించకుండా ఎగవేతదారుడుగా ఉన్న ఇంటి యజమాని వ్యాపార సముదాయాలను గురువారం జీహెచ్ఎంసీ అధికారులు డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్మాయత్, ఏఎంసీ బాలరాజు, కమల్, అధికారులు సీజ్ చేశారు. ఆస్తి పన్ను బకాయి కట్టే వరకు ఎలాంటి అనుమతి ఇవ్వబోమని యజమానికి చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆస్తి పన్ను బకాయిదారులు మార్చి 31లోపు ఓటీఎస్ సదుపాయాన్ని వినియోగించుకొని పన్ను చెల్లించాలని సూచించారు. లేనియెడల ఆస్తులకు తాళాలు వేస్తే పరువు పోతుందని ఆ తర్వాత సమాజంలో విలువలు కోల్పోతారని ఆస్తిపన్ను బకాయిదారులను హెచ్చరించారు.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీ రామ్ నగర్ లో బీఆర్ఎస్ స్థానిక నాయకుడు జావీద్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్‌లో జరిగిన ఎన్నికలలో ముస్లిం సోదరులు తనకు అండగా ఉండి, అధిక శాతం ముస్లిం ఓట్లు బీఆర్ఎస్ పార్టీకి వేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నవతెలంగాణ- జూబ్లీహిల్స్

శ్రీ పబ్బా ఆంజనేయ స్వామి ఆలయానికి పూర్వ వైభవం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ పబ్బా ఆంజనేయ స్వామి ఆలయానికి పూర్వ వైభవం రానున్నదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్ లోని లోధా అపార్ట్మెంట్ వెనుక గల స్థలంలో మూడు శతాబ్దాలుగా భక్తుల విశేష పూజలు అందుకుంటున్న శ్రీ పబ్బా ఆంజనేయ స్వామి మహా కుంభ సంప్రోక్షణ పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పూజల అనంతరం పండితులు వేద మంత్రాలతో ఎమ్మెల్యేకు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ ముదిరాజ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉప్పల యాదగిరి, శేషు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ఆర్‌సీ పటేల్, భూపాల్ రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్వీటీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక, కాన్వొకేషన్ డే



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతీయ విద్యా భావన్‌లో ట్వీటీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వారి 11వ వార్షిక అండ్ కాన్వొకేషన్ డే - 2024 ఘనంగా నిర్వహించారు. దాదాపు 200 మంది చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు చేసి అందరిని అలరించారు, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్మెన్ వీపీసీ రావు, మేనేజింగ్ డైరెక్టర్ వీవీఎస్ హరీష్ (మాజీ క్రికెటర్), స్కూల్ హెడ్: అర్చన రెడ్డి, అకడమిక్ హెడ్ అర్చన రెడ్డి, ట్వీటీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కొత్తపేట, సైనిక్‌పురి - హైదరాబాద్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిరాణ దుకాణం ముసుగులో గంజాయి విక్రయాలు

- నలుగురు గంజాయి స్మగ్లర్లు, 13మంది వినియోగదారుల అరెస్టు
- 22.6కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న నార్కొటెక్ పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కిరాణ దుకాణం ముసుగులో గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టును నార్కొటెక్ పోలీసులు రట్టు చేశారు. నలుగురు స్మగ్లర్లతోపాటు 13 మంది వినియోగదారులను అరెస్టు చేశారు. వారిని నుంచి 22.6కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.22.10లక్షల నగదుతోపాటు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.34.40లక్షలుంటుందని పోలీసులు తెలిపారు. గురువారం నార్కొటెక్ బ్యూరో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాపతి నీతూ బాయి, కళాపతి మున్నూ సింగ్‌లు నానక్రామ్‌గూడలోని లోధా బస్తీలో జయలక్ష్మీ కిరాణాన్ని కొనసాగిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని కళాపతి మహాత్మా, కళాపతి మమతా అనే గంజాయి సరఫరా దారులతో చేతులు కలిపారు. రూ. 8వేలకు కిలోగంజాయిని కొనుగోలు చేస్తున్న నిందితులు 5గ్రాములుగా విడదీసి ప్యాక్ చేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఈ కుటుంబాలు గత కొన్నేండ్లుగా గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఎన్నిసార్లు జైలుకెళ్లొచ్చారు. తిరిగి గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారని గుర్తించిన నార్కొటెక్ పోలీసులు వీరిపై ప్రత్యేక నిఘా వేశారు. పక్కా సమాచారంతో నలుగురితో పాటు వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్న మరో 13 మందిని అరెస్టు చేశారు. నలుగురు గంజాయి సరఫరా దారులపై హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లల్లో కేసులున్నాయని పోలీసులు తెలిపారు. గతంలో దాదాపు రూ.4కోట్లకుపైగా ఆస్తులను అటాచ్‌చేసి, వారిపై పీడీ యాక్టు నమోదు చేసినా వారు గంజాయిని సరఫరా చేస్తున్నారని పోలీస్ అధికారి తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

-34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మరో గంజాయి కేసులో ఇద్దరు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 34 కిలోల గంజాయి, ఇన్నోవాకారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి విలువ రూ.13,80,000 లుంటుందని తెలిపారు. గురువారం డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన జీవన్ రామారావు రాథోడ్, కర్నాటకాకు చెందిన ఆనంద్ మీమ్ సింగ్ జావీద్ గంజాయి స్మగ్లర్. నగరంలో గంజాయిని విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జీవన్ రామారావు రాథోడ్ తన సోదరుడు రవితో కలిసి హైదరాబాద్‌లో గంజాయి స్మగ్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్రాలో కిలో గంజాయి రూ.6వేలకు కొనుగోలు చేసిన నిందితులు నగరంలో అధిక లాభాలకు విక్రయించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పరారాలో ఉన్న రవికోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు.



భోలక్‌పూర్‌లో వ్యక్తి దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితుడు..?

నవతెలంగాణ-ముషీరాబాద్

ఒక మహిళ కోసం టీ స్టాల్ ఓనర్‌ను ఓ వ్యక్తి దారుణంగా హత్య చేసిన ఘటన గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. మేడ్చల్‌కు చెందిన మహ్మద్ గౌస్ (57) భోలక్‌పూర్‌లోని బిలాల్ మసీదు వద్ద ఓ మహిళకు చెందిన భవనంలో టీ స్టాల్‌ను నడిపిస్తుండేవాడు. అతనికి భార్య పిల్లలున్నారు. సదరు మహిళకు చెందిన ఇంట్లోనే ఫిరోజ్ మహ్మద్ అద్దెకు ఉండేవాడు. ఫిరోజ్ కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. సదరు ఇంటి ఓనర్ మహిళకు పిల్లలున్నారు. ఈ క్రమంలో అదే ఇంట్లో అద్దెకు ఉండే ఫిరోజ్‌తో మహిళకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే సదరు మహిళను రహస్యంగా ఫిరోజ్ పెండ్లి చేసుకుని కలిసి ఉండేవారు. ఫిరోజ్‌ను పెళ్లి చేసుకున్న సంగతి కొడుకులకు తెలియ డంతో సదరు మహిళ ఫిరోజ్‌ను దూరం పెట్టింది. అయితే సదరు మహిళతో కలిసి ఉన్నప్పుడు దిగిన ఫోటోలను చూపించి ఫిరోజ్ ఆమెను బెదిరించసాగాడు. ఈ క్రమంలోనే తన భవనంలోనే టి స్టాల్ నడిపిస్తున్న మహ్మద్ గౌస్‌ను మహిళ సహాయం కోరింది. ఫిరోజ్ తనను వేధిస్తున్నాడని చెప్పడంతో గౌస్, సదరు మహిళ కొడుకులు కలిసి ఫిరోజ్‌ను ఇంటి నుంచి ఖాళీ చేయించి పంపించేశారు. దాంతో ఫిరోజ్ కోపంతో మహ్మద్ గౌస్ మంచినీటిలో మూత్రం పోస్తాడు అంటూ అసత్య ప్రచారం చేశాడు. ఈ విషయంలో గౌస్‌కు, ఫిరోజ్‌కు మధ్య గత శనివారం గొడవ జరిగింది. ఇదిలా ఉండగా రోజు మాదిరిగానే గురువారం కూడా భోలక్‌పూర్ బిలాల్ మసీదు వద్ద ఉన్న తన టీ స్టాల్‌కు మహ్మద్ గౌస్ వచ్చాడు. గౌస్‌ను చంపేస్తే మహిళ తనదే అవుతుందని భావించిన ఫిరోజ్ కత్తితో అతనిపై దాడి చేశాడు. నేరుగా గౌస్ మర్మాంగం పై పొడిచి కత్తితో అలాగే వదిలి పరారయ్యాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. రక్తం మడుగులో ఉన్న మహ్మద్ గౌస్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. ఇదిలా ఉండగా హత్య చేసిన నిందితుడు ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.



పెండ్లీ పేరుతో మోసాలు

- దంపతుల అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పెండ్లీ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు దంపతులను హైదరాబాద్ సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ జి. వెంకటేశ్వరరెడ్డి, ఇన్స్పెక్టర్ డి. భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల జిల్లా వెంకంపేటకు చెందిన యెలిగేటి రంజిత్ ఎలియాస్ యడ్ల శ్రీరాధాకృష్ణ ఎలియాస్ రాజేశ్ (35), అతని భార్య సంధ్య పీర్జాదిగూడ వినాయక్ నగర్‌లో ఫ్లాట్‌లో అద్దెకుంటున్నారు. ఉపాది లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న దంపతులు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లను ఎంచుకున్నారు. షాదీ డాట్ కామ్, తెలుగు మ్యాట్రిమోనీ వంటి వెబ్సైట్లలో చాలామంది అమ్మాయిలు వరుడి కోసం ప్రొఫైల్స్ పెట్టడం గమనించిన రంజిత్ 2022లో వధువు కావలెను అంటూ తన ప్రొఫైల్ పెట్టాడు. అతడి వలలో పడిన అమ్మాయిలను వెంటనే పెండ్లి చేసుకుంటానని నమ్మించే వాడు. కొన్నాళ్లు చాటింగ్ చేసి వారికి దగ్గరయ్యేవాడు. వివిధ కారణాలు చెప్పి డబ్బులు దండుకునే వాడు. కొన్నిసార్లు అమ్మాయిల వాళ్ల ఇంటికి వెళ్లి మాట్లాడి వచ్చేవాడు. ఈ నాటకంలో భార్య సంధ్య సహకరించేది. ఓ యువతి తనకు జరిగిన మోసం గురించి సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. నిందితులు ఇప్పటివరకు రూ.30 లక్షల వరకు మోసం చేసినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై ములుగు, కేపీహెచ్‌బీ ఠాణాల్లోనూ కేసులున్నాయని, వారి నుంచి ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. దంపతుల వ్యవహారం వెలుగుతోకి రావడంతో మరికొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

సెల్‌ఫోన్ చోరీ..

తిరిగి అడిగినందుకు దారుణ హత్య

- హత్య కేసును చేధించిన చిలకలగూడ పోలీసులు
- ఐదుగురు నిందితుల అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో/ఓయూ

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోయారు. సికింద్రాబాద్‌లో ఓ యువకుని నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితులు అది తిరిగిన అడిగిన పాపానికి అతన్ని కత్తులతో దారుణంగా హత్య చేశారు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. గురువారం ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన సంకు రాహుల్, కపరి సూరజ్ కుమార్, మదన రవితేజ, యెంకిగారి లక్ష్మణ్ నారాయణ, మరో మైనర్ కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డారు. జులాయిగా తిరిగే ఈ ముఠా విలాసాలకు అలవాటు పడింది. దోపిడీలు, సెల్‌ఫోన్ స్నాచింగ్ చేయడం, అమాయకులను టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడడం, వారి వద్దవున్న సెల్‌ఫోన్లు, డబ్బులు, విలువైన వస్తువులను లాక్కెళ్లడం, అడిగితే బెదిరించడం ఈ ముఠాకు పరిపాటిగా మారింది. ఇదిలావుండగా నంద్యాలకు చెందిన అనిల్ కుమార్ అనే యువకుడు చరపలిలో ల్యాబ్‌లో పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం రేపల్లెకు వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్న అనిల్‌ను నిందితులు టార్గెట్ చేశారు. కదులుతున్న రైల్లో నుంచి అనిల్ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. వెంటనే అప్రమత్తమైన అనిల్ వారివెంటే రైలు దూకాడు. తన సెల్ ఫోన్‌ను ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. దాంతో రెచ్చిపో యిన నిందితులు అనిల్‌ను లాక్కెళ్లి కత్తులతో పొడిచి దారుణంగా హత్యచేశారు. అనిల్ మతి చెందినట్టు నిర్ధారించుకున్న నిందితులు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి సమీపంలోని జీహెచ్‌ఎంసీ చెత్త డబ్బా వద్ద పడేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు గుర్తుతెలియని మతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి రావడంతో దాదాపు 70 సీసీ కెమెరాలను పరిశీలించారు. వారం రోజుల క్రితం జరిగిన హత్య కేసును ఎట్టకేలకు చేదించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వీ.జైపాల్ రెడ్డి, సీఐ బీ.అనుదీప్, డిటెక్టివ్ సీఐ కే. రమేష్ గౌడ్‌తోపాటు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.



ముగిసిన ఇంటర్ వార్షిక పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కేరింతలు.. ఆత్మీయ పలకరింపులు..
- 576 పరీక్ష కేంద్రాల్లో 4లక్షలకుపైగా హాజరు

నవతెలంగాణ-సిటీబ్యూరో


గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇప్పటికే ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయిన విషయం తెలిసిందే. గురువారం నాటితో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియడంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులతో సందడి వాతావరణం కనిపించింది. పరీక్షలు ముగిసిన సంతోషంతో విద్యార్థులు కేరింతలు కోట్టడం.. ఆత్మీయ పలకరింపులు కనిపించాయి. కాగా పరీక్షల చివరి రోజు కావడంతో విద్యార్థులు తాము రాసిన పరీక్షలపై చర్చించుకోవడం వంటివి కనిపించాయి. ఒకరికొకరు సెల్‌ఫోన్ నెంబర్లు షేర్ చేసుకున్నారు. అనంతరం వీడ్కోలు చెప్పుకొన్నారు. పరీక్షలు ముగియగానే కాలేజీల గురుకులాలలు, వసతి గృహాలు ఖాళీ అయ్యాయి. విద్యార్థులు నివాసా ప్రాంతాలకు ప్రయాణమయ్యారు. దీంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్ వద్ద విద్యార్థులతో సందడి వాతావరణం కనిపించింది. ఈనెల 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే.

హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల వ్యాప్తంగా సుమారు 576 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు సుమారు 4.54 లక్షల విద్యార్థులకు గాను ఒక పదిశాతం మినహా మిగితా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా ప్రశాతంగా ముగిసినట్టు బోర్డు అధికారులు వెల్లడించారు. పరీక్షల సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులు కేంద్రాల్లో గట్టి చర్యలు చేపట్టగా, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల నిర్వహణ కమిటీలు పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల నిఘా కొనసాగింది.

'ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా ప్రాధాన్యత కల్పించాలి'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కథనాలకు మీడియా రంగం తగు ప్రాధాన్యం కల్పించవలసిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. ప్రస్తుతం మీడియా సమకాలీన రాజకీయాలు, వ్యాపార సంబంధమైన అంశాలకు తప్ప, ఎంతో కీలకమైన వాతావరణ మార్పులపై వచ్చే కథనాలకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని వారు అభిప్రాయపడ్డారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ సహకారంతో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యూజే), వ్యాస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'జర్నలిస్టులకు వాతావరణ మార్పులు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ప్రారంభమైంది.ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానవ తప్పిదాలే ప్రకృతి వైపరీత్యాల రూపంలో సమాజం మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని, ఎంతో కీలకమైన వాతావరణ మార్పులను జర్నలిస్టులు సైతం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం యునైటెడ్ స్టేట్స్ కౌన్సిల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులపై జర్నలిస్టులకే ఎక్కువ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టులు, సమాజం భవిష్యత్తులో రాబోయే విపత్తుల ప్రమాదాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు.వివిధ జిల్లాల జర్నలిస్టులు, టియుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరహత్ అలీ, ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్, వ్యాస్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు, యూఎస్ కౌన్సిలేట్ సిపిఆర్ఓ బాసిత్, సీనియర్ పాత్రికేయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



- ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులను జాగ్రత్తగా నిర్వహించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాబోయే పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించుటకు పట్టిష్టే చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఈఆర్‌వోలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాలని, కేంద్ర ఎన్నికల సంఘం దర్శకాలకు అనుగుణంగా తమకు కేటాయించిన విధులను ఎలాంటి లోటుపాట్లకు తావివ్వ కుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు . ఈ సమావేశంలలో అదనపు కలెక్టర్ రెవెన్యూ హేమంత్ కేశవ్ పాటిల్, డి ఆర్ ఓ వెంకటాచారి, ఏఆర్వోలు, మూడవది గారు తదితరులు పాల్గొన్నారు

కామ్రేడ్ కార్ల్ మార్క్స్ వర్ధంతి



నవతెలంగాణ - సంతోష్ నగర్

సింగరేణి కాలనీలో ప్రపంచ కార్మిక నాయకుడు కామ్రేడ్ కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతిని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్, ఏఐవైఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మహమూద్, జంగయ్య ఏఐటీయూసీ ఆటో యూనియన్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి, దశరథ్ నాయక్, అంజయ్య సీపీఐ శాఖ కార్యదర్శి, యాదయ్య, అజీం, పాషా, చింటు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'లంబాడీ కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం'



నవతెలంగాణ - సంతోష్ నగర్

సంత్ సేవా లాల్ లంబాడీ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నేనావత్ శంకర్ నాయక్ అన్నారు. ఈ మేరకు గాంధీ భవన్ గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం వలన లంబాడీ సామాజిక వర్గం అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

'మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కే పురం డివిజన్‌లోని ఈస్ట్ యాదవ్ నగర్‌లో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు లేనిదే మానవ మనుగడ లేదన్నారు. మహిళలు ప్రతి రంగంలోనూ వారి సత్తా చాటుతూ.. దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో మహిళా ప్రాతినిధ్యం పెరగాలన్నారు. మహిళలకు తన సొంత కాళ్లపై నిలబడాలనే తపన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కొండ్ర శ్రీనివాస్, మురళీధర్ రెడ్డి, జై శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహిళలు లేనిది సమాజమే లేదని, మహిళల అభివృద్ధి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ బాలాజీ నగర్ కాలనీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు



చట్టసభల్లో కూడా మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శ్రవణ్ కుమార్, మహిళలు సరోజ, కావ్య, ఇందిరా, సంగీత, స్రవంతి, మహాలక్ష్మి, వనిత, విజయ లక్ష్మి, స్వప్న, సుభాషిణి, మంగమ్మ, శారద, నీరజ పాల్గొన్నారు.

'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన'



కళలు ప్రజల జీవన విధానంలో భాగం

ఒక జాతి జీవన విధానం, సాంస్కృతి, ఆచార వ్యవహారాలు, వేష భాషలు, అలవాట్లు, పండుగలు, వేడుకలు, భావోద్వేగాలు, కళలు, సాహిత్యం, మతం, రాజకీయాలు అను నిత్యం ప్రజల జీవన విధానంలో భాగమై ఉంటాయి. ఆ కాలపు సంఘటనల సమాచారాన్ని అందించేది సాహిత్యం. కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర కు ప్రతి రూపం సాహిత్యం. తెలంగాణలో సాహిత్యానికి కొదవలేదు. తెలంగాణ సంస్కృతిని కాపాడి ఉద్యమాలను నడిపించి, బతికించింది. ఈ కళాశాలలో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం గొప్ప విషయం.

- కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ





నవతెలంగాణ - హయత్ నగర్

నేడు, రేపు హయత్ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాయన శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో ఈ సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు.

హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గతంలో న్యాక్ అధికారులు సందర్శించినప్పుడు కళాశాలకు బీ గ్రేడ్ కేటాయించడం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆధునిక తెలుగు తెలంగాణ కావ్యాలు అనే అంశంపై కూడా సెమినార్ ఏర్పాటు చేశారు. అందుకే రెండో సారి జాతీయ స్థాయిలో తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ సదస్సు ఆవశ్యకత..

ఒక ప్రాంత అస్తిత్వానికి సూచిక ఆ ప్రాంతంలో వెనుక బడిన సాహిత్యం. ఆ ప్రాంత ప్రజల సాంస్కృతి, సమాజాన్ని వివరించేది సాహిత్యం. ఆది నుండి తెలంగాణ ప్రజలను ముందుకు నడిపించడంలో, చైతన్య పరచడంలో సాహిత్యానిదే కీలక పాత్ర. ఒక జాతి జీవన విధానం, సాంస్కృతి, ఆచార వ్యవహారాలు, వేష భాషలు, అలవాట్లు, పండుగలు, వేడుకలు, భావోద్వేగాలు, కళలు, సాహిత్యం, మతం, రాజకీయలు, అను నిత్యం ప్రజల జీవన విధానంలో భాగమై ఉంటాయి. ఆ కాలపు ఘటనల సమాచారాన్ని అందించేది సాహిత్యం. కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకు ప్రతిరూపం సాహిత్యం. తెలంగాణలో సాహిత్యానికి కొదవలేదు. కవులు, కళాకారులకు కొదవ లేదు. తెలంగాణ సంస్కృతిని కాపాడి ఉద్యమాలను నడిపించి, బతికించింది సాహిత్యం. సూటిగా మనసులను తాకేలా, ఆలోచింప చేసేలా ఎందరో ప్రముఖులు తమ రచనలు, కళారూపాల ద్వారా సమాజాన్ని జాగృతం చేయగలిగారు. కవితలు, పాటలు, కథలు, నవలలు, నాటికలు, నాటకాలు, బుర్ర కథలు, హరికథలు, ఒగ్గు కథలు, వీధి భాగోతాలు ఇలా అనేక రూపాల్లో చైతన్యాన్ని నింపగలిగారు. దశాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న తెలంగాణ సాహిత్య విశేష అంశాలను విశ్లేషణ చేసినప్పుడే తెలంగాణ సమగ్ర సాహిత్యం ఒక రూపానికి వస్తుంది. భావితారాలకు స్ఫూర్తినందిస్తుంది.

సదస్సు లక్ష్యాలు..

విద్యార్థులకు సాహిత్య అభిమానులకు తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం పరిచయం చేయడం, వివిధ ప్రక్రియలలో తెలంగాణ జీవన సంస్కృతి, జీవన విధానం, వ్యవసాయం, చేతి వృత్తులు, మొదలైన అంశాలను కోడీకరించడం. మనుగడకు ప్రజలు నిరంతరం పడిన ఆరాటం, చేసిన పోరాటం, మానవీయ విలువలు కాపాడుకుంటూనే, సాహిత్యాన్ని, జీవన భాషను అచ్చ తెలుగు నుడికారాన్ని కాపాడుతూ వస్తున్న మమకారాన్ని చర్చించడం. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాహిత్యంలో ప్రజల కష్ట, సుఖాలను ప్రస్తావించిన విలువైన, ప్రామాణికమైన అంశాలను నిక్షిప్తం చేయడం. మరుగున పడిన ఎందరో కవులు, కళాకారులు, రచయితల సాహిత్యాన్ని సేకరించి విశ్లేషణ చేయడం.

సదస్సులో సమాలోచన చేసే అంశాలు..

తెలంగాణ అస్తిత్వ పోరాటం-కవిత్వం, కథలు, నాటకాలు, నవలలు, పాటలు, పద్యాలు, కళారూపాలు, పత్రికల సేవ, కరపత్రాలు, ప్రజా సంఘాల పాత్ర, వాగ్గేయ కారులు, విశ్వవిద్యాలయాల పాత్ర, పరిశోధనలు, ఉపన్యాసాలు.

నేడు, రేపు హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ - చైతన్యపురి

రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం ఆర్కేపురంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని కొనియాడారు. ఈ కార్పొరేషన్ ఏర్పాటు వలన ఆర్యవైశ్యుల్లోని పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య ప్రధాన కార్యదర్శి గందె సురేష్, కోశాధికారి బిల్లకంటి కిరణ్ కుమార్, దామోదర్, అంజయ్య, అన్నపూర్ణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ మంచుకొండ సురేందర్ గుప్తా, కొత్త రవి కుమార్, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షులు పొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, జిల్లా ఆర్యవైశ్య సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్లేని గల్ఫ్ అవేర్ హాస్పిటల్‌లో
రూ.999తో సమగ్ర కిడ్నీ హెల్త్ ప్యాకేజీ



నవతెలంగాణ - సిటీబ్యూరో

ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని సీఈఓ కరుణాకర్ రెడ్డి అన్నారు. గ్లేని గల్ఫ్ అవేర్ హాస్పిటల్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ప్రముఖ నెఫ్రాలజిస్ట్ ప్రభు చరణ్ న్యూరాలజిస్ట్ నవీన్ పూల, యూరాలజిస్ట్ వేణు. మనే పాల్గొన్నారు.



ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కిడ్నీ స్టోన్స్ ప్రోస్టేట్ సమస్యలు యూరినరీ ట్రాక్ట ఇన్‌ఫెక్షన్స్ క్లినిక్ కిడ్నీ వ్యాధులు, జెనిటో యూరినరీ క్యాన్సర్ వంటి కిడ్నీ వ్యాధుల ప్రమాద కారకాల గురించి తాము ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అన్నారు. సాధారణంగా వ్యాయామం చేసిన తర్వాత తగినంత తాగునీరు తీసుకోవడం మద్యపానం, ధూమపానం మానేయడం వంటి జీవనశైలి మార్పుల గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల్లో అనుభవజ్ఞులైన వైద్యులతో పాటు ఇతర సహాయక విభాగాలు కలిగి ఉన్నదని అన్నారు. మూత్రపిండంలో రాళ్ల ప్రోస్టేట్ సమస్యలు, సర్జరీల కోసం అధునాతన హెూల్మియం లేజర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలిక మూత్రపిండవ్యాధి రోగులకు డయాలసిస్ చికిత్స, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స సౌకర్యం కలదన్నారు. డయాబెటిక్ హైపర్టెన్సీ, ఇతర రోగుల మూత్రపిండాల ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించడం కోసం కిడ్నీ హెల్త్ ప్యాకేజీ చేయించుకోవాలని సూచించారు. అందరికీ అందుబాటులో ఉండేలా రూ 999తో సమగ్ర కిడ్నీ హెల్త్ ప్యాకేజీని ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - హయత్ నగర్

వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మన్సూరాబాద్‌లోని కాస్మోపాలిటన్ కాలనీలో మిర్యాల చిన్నారావు నివాసం ఉంటున్నాడు. 2023 జనవరి 22న ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో అతని తల్లి ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కోసం నూతన బోర్లు



నవతెలంగాణ - నాగోల్

నాగోల్ డివిజన్‌లోని రాజీవ స్వగృహ సహాభావన టౌన్ షిప్‌లో తాగు నీటి కోసం నూతన బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజులా రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ నిధుల ద్వారా విడుదలైన నిధులతో బోరు బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంబీబీఎస్ చేయకున్నా డాక్టర్‌గా చలామని అవుతున్న నకిలీ డాక్టర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి ఇంజక్షన్లు, రూ.1200లతోపాటు క్లినిక్‌లో ఉపయోగిస్తున్న పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్‌కు చెందిన రాజు గంగారామ్ అంకలాప్ ఉపాది



కోసం హైదరాబాద్ వచ్చాడు. ఆయుర్వేదిక్ అండ్ జనరల్ మెడిసిన్స్ క్లినిక్స్‌లో పనిచేశాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని రామంతాపూర్‌కు మారాడు. అనంతరం 'శ్రీ సాయి వెంకటేశ్వరా క్లినిక్' పేరుతో అంబర్‌పేట్‌లో క్లినిక్‌ను తెరిచాడు. ఎలాంటి పత్రాలు లేకుండానే ఫ్యామిలీ ఫిజీషియన్‌గా(కుటుంబ వైద్యుడు) డాక్టర్‌గా చెలామని అవుతూ వైద్యం చేస్తున్నాడు. సమాచారం అందుకున్న సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం అంబర్‌పేట్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రామ కృష్ణ, ఎస్ఐ ఎన్.నరేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్
లాజిస్టిక్స్ నెట్ వర్క్ మరింతగా విస్తరణ

నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లాజిస్టిక్స్ విభాగ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. కొత్త కౌంటర్ లో ఒక పార్శిల్‌ను బుకింగ్ చేసి రశీదును వినియోగదారుడు శివ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు వేగవంతమైన సేవలందించేందుకు త్వరలోనే పార్శిళ్లను ఇంటి వద్దనే పికప్, డెలివరీ చేస్తామని చెప్పారు. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణలో అతివేగంగా పార్శిళ్లను డెలివరీ చేసే వ్యవస్థ అని అన్నారు. ప్రతి రోజు సగటున 15 వేల పార్శిళ్లను బట్వాడా చేస్తున్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 60 లక్షల పార్శిళ్లను టీఎస్ఆర్టీసీ బస్సుల్లో రవాణా చేశామని పేర్కొన్నారు. ఆ పార్శిళ్ల రవాణా వలన టీఎస్ఆర్టీసీకి సుమారు రూ.120 కోట్ల రెవెన్యూ వచ్చిందని వెల్లడించారు. సంస్థకు టికెట్ ఆదాయం 97 శాతం వస్తుండగా.. టిక్కటేతర ఆదాయం 3 శాతమే వస్తోందన్నారు. త్వరలోనే ఇలాంటి కౌంటర్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. లాజిస్టిక్స్ విభాగ విస్తరణతో పాటు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, జీవా వాటర్ బాటిల్‌ను అందుబాటులోకి తీసుకురావడం, బస్ స్టేషన్లలో స్టాళ్లలను యాజమాన్యం నిర్మిస్తోందన్నారు. లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ నంబర్ 040-69440069 గానీ, https://www.tsrtclogistics.in వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించవచ్చని సూచించారు. అనంతరం లాజిస్టిక్స్ విభాగం కొత్త లోగో, బ్రోచర్‌ను ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీటీఎం(కమర్షియల్) శ్రీధర్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (లాజిస్టిక్స్) సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఎస్సీ 57 ఉపకులాలకు
ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ 57 ఉపకులాలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజలింగం కోరారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన సలహా దారులు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతల రాజలింగం మాట్లాడారు. మాల, మాల, మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక కార్పొరేషన్లతో ఉపకులాలకు తీవ్ర నష్టం కలిగే అవకాశముందన్నారు. మాల, మాల ఉపకులాల కార్పొరేషన్, మాదిగ, మాదిగ ఉపకులాల కార్పొరేషన్లు ఏర్పడితే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారే బాగుపడుతారన్నారు. మాల ఉప కులాలకు, మాదిగ ఉపకులాలకు ఒరిగేది ఏమీ ఉండదన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎవరి కార్పొరేషన్లను వారికే కేటాయించి, దారిద్ర్యరేఖకు దిగువనున్న ఉపకులాలను ఆదుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించి వేం నరేందర్ సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చినట్టు చింతల రాజలింగం తెలిపారు. ఈ కార్యక్రమంలో బాణాల మంగేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎర్రుల యాదయ్య, ఉపాధ్యక్షులు, సదుల తిరుమల హరి, కడమంచి ఎల్లేష్, సహాయ కరియదర్శి కార్న ముత్యాలు, కప్పరి రమేష్, సాదుల, నునె రాజు, నూనె లాలయ్య సదుల విఠల్ పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య



నవతెలంగాణ- చైతన్యపురి

ఉద్యోగ వేటలో ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఆలూపాక గ్రామానికి చెందిన సుంకర వెంకట సుబ్బారావు కుమార్తె సుంకర సాహితి (26) ఎంబీఏ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం రెండు నెలల కిందట హైదరాబాదుకు వచ్చింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని లక్ష్మీ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం వెతుక్కుంటుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన హాస్టల్ మేట్స్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి వెంకట సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మీర్‌పేట్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిగా సునీత బాల్‌రాజ్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా జమాల్‌పూర్ సునీత బాల్‌రాజ్‌ను నియమించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, ధనలక్ష్మి రాజ్ కుమార్, బొక్క రాజేందర్ రెడ్డి, సిద్దాల అంజయ్య, కో ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్య గౌడ్, రజాక్, స్నేహలత, కార్యనిర్వాహక అధ్యక్షులు దిండు భూపేష్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీను నాయక్, యూత్ అధ్యక్షులు నాగరాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి డివిజన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచార రథాన్ని కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా గురువారం జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి



ప్రతి యువతికీ ఓ మార్గదర్శకం

మెరుగైన ఆరోగ్యం కోసం...



బిజీ లైఫ్ స్టైల్‌లో ఆహారం, ఆరోగ్యంపై సరైన శ్రద్ధ వహించడంలేదు. ఇటీవల కాలంలో చాలా మంది డయాబెటీస్, స్థూలకాయం, బీపీ, అల్సర్స్, మలబద్ధకం, అజీర్తి వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మన ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే మన జీర్ణవ్యవస్థ పనితీరు సవ్యంగా సాగాలి. ఆ క్రమంలో మెరుగైన జీర్ణవ్యవస్థ కోసం తీసుకునే ఆహారంలో ఫైబర్ ఉండడం చాలా ముఖ్యం. పీచు పదార్థం ఉండే ఆహారం జీర్ణ సంబంధిత సమస్యలను నివారిస్తుంది. అంతేకాక అజీర్తి, మలబద్ధకం వంటి కడుపు సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు.. పీచు పదార్థాలు బరువు తగ్గడానికి, ఇంకా గుండెను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా ఇవి సహకరిస్తాయి. ఫలితంగా మీ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మరి అధిక ఫైబర్ కోసం ఏయే ఆహారాలను తీసుకోవాలో మనం ఇప్పుడు తెలుసుకుందాం..

పీచు అధికంగా వుండే ఆహార పదార్థాలు:

పచ్చని ఆకు కూరలు: పుంటికూర, బచ్చలి, మెంతి, కరివేపాకు మొదలైన పచ్చని ఆకు కూరల్లో పీచు అధికంగా వుంటుంది. కనుక తినే ఆహారంలో ఆకు కూరలు ప్రధానంగా వుండాలి.

ధాన్యాలు: సాధారణంగా మనం తీసుకునే ధాన్యాల్లో కావలసినంత పీచు వుంటుంది. బియ్యం, గోధుమ, జొన్న, పప్పులు, ఓట్సులో పీచు అధికంగా ఉంటుంది. ఇవి మన శరీరానికి కావలసిన మెగ్నీషియం, బి 6 విటమిన్ కూడా అందిస్తాయి. ఇవి కనుక ముతక ధాన్యాలైతే (పాలిష్ కానివి) పీచు మరింత అధికంగా కూడా వుంటుంది. తెల్లని బ్రెడ్ కంటే బ్రౌన్ బ్రెడ్ లేదా తెల్లని బియ్యం కంటే బ్రౌన్ రైస్ వంటివి మంచివి.

బెర్రీ పండ్లు: సాధారణంగా అందరూ వీటిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు మాత్రమే ఉన్నాయనుకుంటారు. కానీ వీటిలో పీచు కూడా అత్యధికంగా వుంటుంది.

వోట్స్: ఫైబర్ ఫుడ్‌లలో వోట్స్ కీలకమని చెప్పాలి. ఓట్స్‌ని వివిధ రకాలుగా వండుకుని తినవచ్చు. ఉప్మా నుంచి ఓట్స్ గ్రానోలా బార్‌ల వరకు వివిధ రకాలుగా చేసుకోవచ్చు. ముఖ్యంగా ఓట్స్‌తో చేసిన ఆహారాన్ని ఉదయం సమయంలో తినడం ఉత్తమం.

అవిసె గింజలు: అవిసెల్లో ఫైబర్, ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయి. రెగ్యులర్ డైట్‌లో అవిసె గింజలను చేరిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. వీటిని రైతాలో కూడా కలిపి తీసుకోవచ్చు.

బ్రోకలీ: బ్రోకలీలో విటమిన్ సి, ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని వండుకుని తినాలి. పరోటా, చపాతీ, ఇతర ఫుడ్‌తో కలిపి తినొచ్చు. దీనిని తినడం ద్వారా శరీరానికి అవసరమైన ఫైబర్ అందుతోంది.

కండరాల సమస్యతో చక్రాల కుర్చీకే పరిమితమయింది. కానీ ఆమె ఆలోచనలు మాత్రం అపరిమితంగా ప్రయాణించాయి. భారతదేశం మొత్తం ఆ ఆలోచనలు వ్యాప్తి చెందాయి. ఆమే అసోం రచయిత్రి **సర్మిష్ఠ ప్రీతమ్**. గ్రామీణ భారతీయురాలైన ఈ అమ్మాయి రచించిన రంగ్(రంగు) అనే పుస్తకానికి కమింగ్-ఆఫ్-ఏజ్ స్టోరీ అవార్డు సైతం అందుకుంది. ఆ పుస్తకం ఇటీవల ఆంగ్లంలో విడుదలైంది. పేదరికం, అసమానతలు, వివక్షల మధ్య మన దేశంలో పెరుగుతున్న ప్రతి యువతికి ఈ పుస్తకం ఓ మార్గదర్శకం అంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...




పదమూడేండ్ల కిందట సర్మిష్ఠ అసోంలోని అత్యంత పేదరికంలో కొట్టుమిట్టాడుతూ కుల వివక్షను ఎదుర్కొంటూ మద్యపానానికి బానిసలైన ఓ గ్రామంలో తన గుర్తింపు కోసం జీవితకాల పోరాటం చేసిన పరిధి అనే యువతి గురించి రంగ్ పేరుతో ఓ పుస్తకం రాశారు. జనవరి 2024లో ఈ పుస్తకాన్ని రంజితా బిస్వాస్ ఆంగ్లంలోకి అనువదించగా, సైమన్, షుస్టర్ ప్రచురించారు. అసోం గ్రామీణ ప్రాంతంలోని ప్రతి ఆడపిల్ల జీవితాన్ని దేశ వ్యాప్త పాఠకులు అర్థం చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

లోతుగా ఆలోచించాలి

'బినీత్ ది సిమోలు ట్రీ' అనే పేరుతో విడుదలైన ఈ ఆంగ్ల పుస్తకం పేద ప్రజల సామాజిక నిర్ణయాధికారులు, సాంస్కృతిక అసమానతలు, పితృస్వామ్య వ్యవస్థ, ఎదుగుదల, ఎంపికల విషయంలో సర్మిష్ఠ తన సొంత విలువలపై జీవితాన్ని నిర్మించుకున్న



ప్రధాన పాత్రతో ప్రయాణిస్తుంది. మహిళల జీవితాలు తరతరాలుగా ఎంతటి దుర్బలత్వంలో మగ్గిపోతున్నాయో ఆ పాత్ర మనకు తెలియజేస్తుంది. 'పరిధి అనేది గ్రామంలోని స్త్రీలందరి సమ్మేళనం. సంఘాలు, వయసు, వర్గాలు, సామాజిక స్థితిగతులు అన్నీ ఇందులో మిళితమై ఉంటాయి. ఎందుకంటే ఎన్నో ఏండ్లుగా వారి పోరాటాలన్నిటికీ సారథ్యం వహిస్తున్నది పితృస్వామ్య వ్యవస్థ. నేను ఈ పాత్రకు తన జీవితంలోని ప్రతి విషయంలో పోరాడే శక్తిని, ప్రతిస్పందించగలిగే భావోద్వేగ ఆలోచనలను ఇచ్చాను. ఎందుకంటే గ్రామీణ సమాజంలోని ప్రతి యువతి లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందని నేను నమ్ముతున్నాను' అని 38 ఏండ్ల సర్మిష్ఠ చెప్పారు.



జ్ఞాపకాలే ప్రాణం పోశాయి

సర్మిష్ఠ డిసెంబర్ 18, 1987లో అస్సాంలోని నాగావ్‌లోని పులగురిలో పుట్టారు. ఐదేండ్ల వయసులో ఆమెకు కండరాల సమస్య వచ్చింది. ఎనిమిదేండ్లు వచ్చే సరికి శారీరకంగా బలహీనమైపోయింది. దాంతో వీల్ చైర్‌కే పరిమితమయింది. తల్లి,దండ్రులు అందించిన ప్రోత్సాహంతో పులగురిలోని ఎల్‌పీ పాఠశాలలో తన ప్రాథమిక విద్యను పూర్తి చేసింది. తర్వాత అక్కడే ఉన్నత పాఠశాలలో చేరింది. తర్వాత కళాశాల విద్యను రాహా కాలేజీలో పూర్తి చేసింది. ఆ తర్వాత ఎకనామిక్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది. స్టోరీ చదువుతున్నపుడు అస్సాంలో సర్మిష్ఠ తన గ్రామంలో పెరుగుతున్న రోజులు మనకు గుర్తుకు వస్తాయి. 'బినీత్ ద సిమోలు ట్రీ' పాత్రలకు తన చిన్ననాటి జ్ఞాపకాలే ప్రాణం పోశాయని ఆమె చెప్పారు.

చూస్తూ పెరిగింది

పరిధి తండ్రి మత్తులో ఇంటికి వచ్చి తల్లితో పాటు ఆమెను కూడా చిత్ర హింసలు పెట్టేవాడు. తన ఇంట్లో మద్యపాన వ్యసనం వల్ల జరుగుతున్న దాడులను చూస్తూ పెరిగింది. ఆమె ఇంటి పక్కనే ఉండే జోయ్‌దేవ్ ఆ వ్యసనానికి బానిసై ఇంట్లోని సామాన్లు మొత్తం అమ్మేస్తుంటాడు. అతని నుండి రక్షించుకోడానికి ఆమె తల్లికి ఇంట్లో ఇక ఏమీ మిగిలి వుండవు. అయితే సర్మిష్ఠ తన వ్యక్తిగత జీవితంలో ఇలాంటి సమస్యలు ఎదుర్కోలేదు. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు. ఇంట్లో ఎప్పుడూ పుస్తకాలపై చర్చ జరుగుతూ జ్ఞానాన్ని పంచుకునేవారు. 'కానీ మా గ్రామంలోని అనేక గిరిజన కుటుంబాల జీవితాలను నాశనం చేసిన మద్యపానం, దాని వల్ల జరుగుతున్న హింసను నా యువ మనసు నుండి తీసివేయలేకపోయాను. ఆ కుటుంబాల్లోని స్త్రీలు భర్తల నుండి విడిపోయి సొంతంగా బతికే అవకాశం కూడా లేదు' అని ఆమె చెప్పారు.

కాదనలేని సంబంధం...

జోయ్‌దేవ్ తన గ్రామంలోని ఒక యువకుడి స్నేహంతో ఇలా తయారవుతాడు. అతను తన మద్యం కోరికను తీర్చుకునేందుకు అన్ని వస్తువులను అమ్మేస్తాడు. 'అతని తల్లి అతని నుండి వస్తువులను దాచడానికి మట్టి తవ్వి ఆ గుంటల్లో వాటిని దాచి పెట్టేది. 'నా వయసు పెరిగే కొద్దీ పేదరికం, వివక్ష, మానసిక ఆరోగ్యం, వ్యసనాల మధ్య కాదనలేని సంబంధం ఉందని గ్రహించాను. ఈ విషయాలనే నా పుస్తకంలో చూపించాలను కున్నాను' అని ఆమె చెప్పారు. పేదరికం, మద్యపానంతో పాటు సర్మిష్ఠ పాత్రలలో కుల ఆధిపత్యం చెలాయించే వ్యక్తులు, తరతరాలుగా అణచివేయబడిన వారు కూడా ఉన్నారు.

కుల వివక్ష ఎదుర్కొంటున్నారు

సర్మిష్ఠ ఎకనామిక్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు తనకు పరిచయమైన ప్రచురణకర్తను వివాహం చేసుకుంది. అతను బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. దాంతో తన జీవిత అనుభవం నుండి కూడా కొన్ని విషయాలను చిత్రీకరించింది. ఆమె తన 17 ఏండ్ల సంసార జీవితంలో విభిన్న కులాల కారణంగా ఎదుర్కొన్న సమస్యలు, కుటుంబాల నుండి ఎదురైనా సమస్యలను కూడా ఈ పుస్తకంలో చూపించారు. 'ప్రస్తుతం గిరిజన సంఘాలు పాఠశాల విద్య వల్ల అభివృద్ధి చెందాయి. డ్రాపౌట్ రేట్లు తగ్గాయి. కానీ వారు నేటికీ కులం పేరిట వివక్షను ఎదుర్కొంటున్నారు. కులాంతర జంటలను వారి కుటుంబాలు విడిచిపెట్టాయి. వారి పట్ల హింస, విభజన, అవమానం ఇప్పటికీ ఉన్నాయి' ఆమె చెప్పారు.

బలమైన మహిళగా...

పరిధి తన పుస్తకాలు, కళతో అనుభూతి చెందుతూ తన జీవితాన్ని తానే మలుచుకుంటుంది. వ్యవస్థతో పోరాడి మనుగడ సాగించిన బలమైన మహిళగా ఎదుగుతుంది. 'రంగ్' 2012లో విడుదల ఓ ఆత్మకథ. 2015లో రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కారాన్ని, 2019లో మునిన్ బోర్కటాకి అవార్డును, హోమన్ బార్గోహేనీ బాటా సాహిత్య అవార్డును, 2017లో డెవసన్స్ ప్రత్యేక సాహిత్య పురస్కారాన్ని గెలుచుకుంది. 2021లో చిత్ర నిర్మాత బాబీ సర్మిష్ఠ జీవితం ఆధారంగా అస్సామీ చిత్రం డియోకా (వాకింగ్ ఇన్ ది ఎయిర్)ను శర్మ బారువా ప్రకటించారు. అదే ఏడాది వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి చికిత్స ఖర్చుల కోసం ప్రభుత్వం సహాయం చేయాలని సర్మిష్ఠ ఓ న్యాయవాదిగా వాదించారు.

నేటినుంచి ఒంటిపూట బడులు

పది విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదో తరగతి విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. అయితే పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్న ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహిస్తారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినం. అదేనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి. రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి.

జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను గతనెల 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం విడుదల చేయగా, 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. అయితే డీఎస్సీ దరఖాస్తు గడువు వచ్చేనెల మూడో తేదీ వరకు ఉన్నదని తెలిపారు. దాన్ని జూన్ 20వ తేదీ వరకు పొడిగించామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర వివరాలకు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేను పార్టీ మారను

ఇవే నాకు చివరి ఎన్నికలు..మళ్లీ పోటీ చేయను

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్



తాను పార్టీ మారడం లేదని.. రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పష్టం చేశారు. అలాగే ఇవే తనకు చివరి ఎన్నికలు అని.. ఇంకో ఐదారేండ్లు మాత్రమే రాజకీయాల్లో ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బెంగళూరులోని ఓ హోటల్‌లో భేటీ అయిన ఫొటో ఒకటి గురువారం సోషల్ మీడియాలో వైరలైంది. కాంగ్రెస్‌లో చేరేందుకు డీకే శివకుమార్ ద్వారా పైరవీలు చేస్తున్నారంటూ వార్తలు వచ్చాయి. దాంతో ఈ భేటీపై మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు. వ్యాపారాల విషయంలో రెండ్రోజుల కిందట డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. డీకే శివకుమార్ తనకు ఆప్తమిత్రుడు అని చెప్పారు. ప్రస్తుతం తనకు 71 సంవత్సరాలు ఉన్నాయని.. ఈ వయస్సులో పార్టీలు మారి సాధించేది ఏమీ లేదన్నారు. వేరే పార్టీల నుంచి తన కుటుంబ సభ్యులు ఎవరూ పోటీ చేయరని స్పష్టం చేశారు. ఈ ఐదేండ్లు ప్రజాసేవ చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయనని.. ఇవే నాకు చివరి ఎన్నికలని స్పష్టత ఇచ్చారు.

కేంద్రం మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా 22న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు

సీఏఏను నిరసిస్తూ విస్తృత క్యాంపెయిన్ : వామపక్ష పార్టీల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్నదని వామపక్ష పార్టీలు విమర్శించాయి. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 22న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్టు ప్రకటించాయి. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో వామపక్ష పార్టీల సమావేశాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందే సీఏఏను అమల్లోకి తెచ్చిందని తెలిపారు. వచ్చింది. ఈ చట్టం మత రాజకీయ దురుద్దేశ్యాలతో కూడుకొని వున్నది. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలతో పాటు, సీఏఏను నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా విస్తృతంగా క్యాంపెయిన్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2024 మార్చి 22న సాయంత్రం 5.30 గంటలకు సుందరయ్య విజ్ఞానకేంద్రం, కళానిలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి కార్యాచరణను రూపొందిస్తాం. రాష్ట్రంలోని వామపక్ష పార్టీల సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ , నాయకులు హన్మేష్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్దన్, నాయకులు ఎం శ్రీనివాస్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి జి రవి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల సమస్యలను పక్కదోవ పట్టించడానికి మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదని విమర్శించారు. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నదనీ, దాడులకు పాల్పడుతున్నదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని గవర్నర్ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాలకోసం వాడుకుంటూ ఆయా ప్రభుత్వాలను పడగొడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈడీ, ఐటీ దాడులు చేయించి ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నష్టాల్లో చూపుతూ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దేశ సంపదను వాటికి దోచి పెడుతున్నదని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా లేబర్‌కోడ్‌లను తెచ్చిందని తెలిపారు. నల్లచట్టాలను తెచ్చి రైతుల నడ్డి విరుస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీ మతోన్మాద, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 22న నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మరోసారి టెట్

- సమర్పణకు తుది గడువు ఏప్రిల్ 10
- మే 20 నుంచి జూన్ 3 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరోసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను టెట్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పూర్తిస్థాయి నోటిఫికేషన్ ష్ట్రజూం://ఎప్రశీశీత్రీవఎట్.వశ్రీఖఅప్తుఖఖు.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఈనెల 20 నుంచి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వాటి సమర్పణకు తుది గడువు వచ్చేనెల పదో తేదీ వరకు ఉందని వివరించారు. మే 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. టెట్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. మూడు లక్షల మంది అభ్యర్థులకు ఊరట లభిస్తుందని తెలిపారు. డీఎస్సీ రాయాలంటే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి కావడంతో అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం మరోసారి నిర్వహించాలని నిర్ణయించింది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్, డిసెంబర్ నెలల్లో ఆ పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో టెట్ నోటిఫికేషన్‌ను విద్యాశాఖ ఇప్పుడు జారీ చేయడం గమనార్హం. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు సుమారు మూడు లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతనెల 29న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. టెట్ ఉత్తీర్ణులు కాని అభ్యర్థులు ఎంతో ఆందోళనకు గురయ్యారు. వారికి మరోసారి అవకాశం కల్పించడం కోసమే టెట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో చివరిసారిగా గతేడాది ఆగస్టు ఒకటిన టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 15న రాతపరీక్షలను నిర్వహించారు. అదేనెల 27న ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,23,582 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,90,047 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 29,073 (15.30 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. డీఎస్సీ కంటే ముందే టెట్ నిర్వహించుకునే విధంగా జీవో ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో మూడు లక్షల మంది నిరుద్యోగులకు మేలు కలుగుతుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షానే ఉంటుందనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ప్రజలు, నిరుద్యోగుల ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వింటుందని మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు రూ.267.34 కోట్ల వడ్డీలేని రుణాలు

2023 డిసెంబర్- మార్చి 2024 త్రైమాసికానికి విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వడ్డీలేని రుణాల పథకం కింద రాష్ట్రంలోని స్వయం సహాయ గ్రూపులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 267, 34,00,000 విడుదల చేసింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓ అనితా రామ చంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 2023 నుంచి మార్చి 2024 వరకు మూడు నెలలకు సంబంధించిన వడ్డీ రాయితీ అందనున్నది. దీని ద్వారా రాష్ట్రంలోని 2,53,864 ఎస్‌హెచ్ జీ గ్రూపులకు లబ్ది చేకూరనున్నది. ఈ రుణాలు నేరుగా ప్రభుత్వ ఖాతా నుంచి స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ కానున్నాయి. అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని 16,248 గ్రూపులకు రూ.17.09 కోట్ల రూపాయల ప్రయోజనం చేకూరనున్నది. ఆ తర్వాత నిజామాబాద్ జిల్లాలోని 15,300 గ్రూపులకు రూ.16.57 కోట్లు, ఖమ్మం జిల్లాలోని 14,355 గ్రూపులకు రూ.15.84 కోట్లు అందనున్నాయి. అత్యల్పంగా కొమ్రం భీం జిల్లాలోని 2759 గ్రూపులకు రూ.2.42 కోట్లు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 2,211 గ్రూపులకు రూ.2.49 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలోని 3282 గ్రూపులకు రూ.2.92 కోట్ల లబ్ది చేకూరనున్నది.

గ్రూప్స్-1 దరఖాస్తు గడువు రేపటి వరకు పొడిగింపు...

సాంకేతిక సమస్యలతో అభ్యర్థులకు ఇబ్బందులు : టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1కు దరఖాస్తు గడువును మరో రెండు రోజులపాటు (శనివారం వరకు) రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం సాయంత్రం ఐదు గంటలతో గ్రూప్-1 దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసిన విషయం తెలిసిందే. అయితే చివరి రోజు కావడంతో గ్రూప్-1 పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు సాంకేతిక సమస్యలు వచ్చాయి. ఫీజు చెల్లింపు, దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ చేపట్టేందుకు వీలు కాకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. ఈ సమాచారాన్ని టీఎస్‌పీఎస్సీ అధికారుల దృష్టికి అభ్యర్థులు తీసుకెళ్లారు. వాటిని పరిశీలించిన తర్వాత శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల సమర్పణ గడువును పొడిగిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటించారు. ఆ తర్వాత పొడిగించబోమని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో దరఖాస్తు చేయాలని కోరారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతనెల 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. అయితే పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిందేననీ, అయితే ఫీజు మాత్రం మినహాయింపునిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన, మెయిన్స్ రాతపరీక్షను అక్టోబర్ 21న నిర్వహించనుంది. బుధవారం నాటికి గ్రూప్-1కు 2.7 లక్షల దరఖాస్తులొచ్చాయి.

ముంబయి సాధించింది. 8 ఏండ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరదించింది. రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచి దేశవాళీ క్రికెట్‌లో మళ్లీ అగ్ర జట్టుగా అవతరించింది. ఉత్కంఠగా సాగిన రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ పోరాట పటిమ చూపినా.. పరాజయం తప్పలేదు. 538 పరుగుల రికార్డు ఛేదనలో విదర్భ 368 పరుగులే చేసింది. 169 పరుగుల తేడాతో ముంబయివిజేతగా నిలిచింది. ముంబయికి ఇది 42వ రంజీ ట్రోఫీ విజయం కావటం విశేషం.

టైటిల్ నం.42 చాంపియన్ ముంబయి

- రంజీ ట్రోఫీ విజేతగా అవతరణ
- టైటిల్ పోరులో విదర్భ ఓటమి



నవతెలంగాణ-ముంబయి

రంజీ ట్రోఫీ ముంబయిదే. ఉత్కంఠ రేపుతూ ఐదో రోజుకు దారితీసిన టైటిల్ పోరులో ఆతిథ్య ముంబయి వాంఖడేలో అదిరే విజయం సాధించింది. విదర్భపై 169 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఎనిమిదేండ్లుగా రంజీ ట్రోఫీకి దూరమైన ముంబయి.. ఎట్టకేలకు ఈ ఏడాదిలో టైటిల్ ముద్దాడింది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ లేకుండానే ముంబయి ఈ ఘనత సాధించింది. రికార్డు 538 పరుగుల ఛేదనలో విదర్భ 368 పరుగులకు కుప్పకూలింది. విదర్భ కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (102, 199 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అసమాన శతకంతో పోరాడినా ప్రయోజనం దక్కలేదు. కరుణ్ నాయర్ (74, 220 బంతుల్లో 3 ఫోర్లు), హర్ష్ దూబె (65, 128 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. 134.3 ఓవర్లలో 368 పరుగులకు ఆలౌటైన విదర్భ.. 169 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. టైటిల్ పోరులో ముంబయికి తలొంచి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ముంబయి యువ బ్యాటర్ ముషీర్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. ఆ జట్టు పేస్ ఆల్‌రౌండర్ తనుష్ కొటియన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు.

అక్షయ్ పోరాడినా..

విదర్భ లక్ష్యం 538 పరుగులు. తొలి ఇన్నింగ్స్‌లో 115 పరుగుల లోటు. 105 పరుగులకే కుప్పకూలిన దీన స్థితి. ఈ పరిస్థితుల్లో చివరి రెండు రోజుల్లో విదర్భ పోరాట స్ఫూర్తి చూపిస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ విదర్భ గొప్ప ప్రదర్శన చేసింది. రంజీ ట్రోఫీ ఫైనల్‌కు వన్నె తీసుకొచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 248/5తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన విదర్భ.. మరో 120 పరుగులు జోడించింది. కానీ స్పెషలిస్ట్ బ్యాటర్లు అందరూ నాల్గో రోజే పెవిలియన్‌కు చేరటంతో టెయిలెండర్లతో లక్ష్యం చేరేందుకు కుదరలేదు. అక్షయ్ వాడ్కర్ (102) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో విదర్భ ఛేదనను ముందుండి నడిపించాడు. నాల్గో రోజు ఆటలో కరుణ్ నాయర్ పోరాడగా.. ఐదో రోజు అక్షయ్ ఆ పని చేశాడు. హర్ష్ దూబె (65) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. కరుణ్ నాయర్, అక్షయ్ జోడీ 173 బంతుల్లో 90 పరుగులు జోడించగా... అక్షయ్, హర్ష్ దూబెలు 255 బంతుల్లో 130 పరుగులు జత చేశారు. ఈ రెండు భాగస్వామ్యాలతో విదర్భ శిబిరంలో ఆశలు చిగురించగా.. ఆ రెండు భాగస్వామ్యాల పతనంతో ఆశలూ ఆవిరయ్యాయి. టెయిలెండర్లలో ఎవరూ నిలబడే ప్రయత్నం చేయలేదు. ఆదిత్య (3), యశ్ ఠాకూర్ (6), ఉమేశ్ యాదవ్ (6), ఆదిత్య ఠాకరే (0) విఫలమయ్యారు. ఉమేశ్ యాదవ్ వికెట్‌ను గాల్లోకి గిరాటేసిన ధవళ్ కులకర్ణి ముంబయికి 42వ రంజీ ట్రోఫీ టైటిల్‌ను కట్టబెట్టాడు.

స్కోరు వివరాలు

ముంబయి తొలి ఇన్నింగ్స్	:	224/10
విదర్భ తొలి ఇన్నింగ్స్	:	105/10
ముంబయి రెండో ఇన్నింగ్స్	:	418/10
విదర్భ రెండో ఇన్నింగ్స్	:	368/10

భారీ ప్రైజ్‌మనీ

దేశవాళీ ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ విజేత భారీ నగదు బహుమతి అందుకుంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు అగ్ర తాంబూలం ఇచ్చిన భారత క్రికెట్ బోర్డు.. దేశవాళీ క్రికెట్‌కు అదే రీతిలో సముచిత ప్రాధాన్యం ఇస్తోంది. రంజీ ట్రోఫీ చాంపియన్ ముంబయి టైటిల్‌తో పాటు రూ.5 కోట్ల ప్రైజ్‌మనీ సాధించగా.. రన్నరప్ విదర్భ రూ.3 కోట్ల నగదు బహుమతి దక్కించుకుంది.

క్వార్టర్స్‌లో శరత్ కమల్

సింగపూర్ : భారత టేబుల్ టెన్నిస్ వెటరన్ ఆటగాడు అచంట శరత్ కమల్ సింగపూర్ స్మాష్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. మెన్స్ సింగిల్స్‌లో 11-4, 11-8, 12-10తో ఈజిప్ట్ ఆటగాడు ఓమర్ అస్సార్‌ను చిత్తు చేసిన శరత్ కమల్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. రెండో రౌండ్లో వరల్డ్ నం.13 డార్కోను ఓడించిన కమల్.. క్వార్టర్స్‌లో ఫ్రాన్స్ ఆటగాడు ఫెలిక్స్ లెబ్రున్, స్వీడన్ ఆటగాడు క్రిస్టియన్‌లో ఒకరితో తలపడనున్నాడు.

సింధు నిష్క్రమణ

- ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్



బర్మింగ్‌హామ్ : భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధు పోరాటానికి తెరపడింది. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్ షిప్స్ నుంచి నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో టాప్ సీడ్ అన్‌సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో సింధు 19-21, 11-21తో పరాజయం పాలైంది. 42 నిమిషాల పాటు సాగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు వరుస గేముల్లో చేతులెత్తేసింది. తొలి గేమ్‌లో 4-1తో ముందంజ వేసిన సింధు ఆధిక్యం నిలుపుకోలేదు. 4-4 వద్ద స్కోరు సమం చేసిన యంగ్.. 11-8తో విరామ సమయానికి ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థంలో పుంజుకునేందుకు సింధు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇక రెండో గేమ్‌లోనూ సింధు నిరాశపరిచింది. 3-3 నుంచి దూసుకెళ్లిన యంగ్ 11-6తో విరామ సమయానికి ఆధిక్యం సాధించింది. 21-11తో అలవోకగా రెండో గేమ్‌ను, సెమీఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది.

నవచిత్రం

బ్యాంకాక్‌లో 'కుబేర' తాజా షెడ్యూల్



ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సినిమా తాజా షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. ఇందులో నాగార్జునతో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. టాకీతో పాటు యాక్షన్ పార్ట్‌ను తెరకెక్కించబోతున్నామని, బ్యాంకాక్‌లో ఇప్పటి వరకు ఎవరూ చూడని సరికొత్త లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుతున్నామని చిత్ర బృందం పేర్కొంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ చేస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

నటి మమితాబైజుకు మరో ఛాన్స్



కోలీవుడ్ నటి మమితాబైజుకు మరో సినిమాలో నటించే అవకాశం లభించింది. ఇటీవల వచ్చిన 'ప్రేమలు' సినిమాలో ఆమె నటించిన విషయం తెలిసిందే. కోలీవుడ్ హీరో విష్ణువిశాల్ నటిస్తున్న 21వ చిత్రంలో కథానాయికగా మమితాబైజును ఎంపికచేస్తున్నట్లుగా సమాచారం. కోలీవుడ్‌లో జీవీ ప్రకాష్‌కుమార్ నరసన 'రెబల్' చిత్రంలో ఆమె మొదటిసారిగా నటిగా రంగ ప్రవేశం చేశారు. తాజాగా విష్ణువిశాల్ సినిమాలో అవకాశం వచ్చింది. దర్శకుడు రామ్‌కుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

నా సినిమాని కూడా నలుగురు పెద్దలు చూడండి..



విశ్వక్ సేన్, చాందిని చౌదరి ప్రధాన పాత్రల్లో వచ్చిన తాజా చిత్రం 'గామి'. మార్చి 8న విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందుతోంది. తాజాగా ఈ సినిమా ప్రెస్ మీట్‌లో పాల్గొన్న విశ్వక్ సేన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'చాలా రిస్క్ చేసి 'గామి' సినిమా తీశాం. ఇది కమర్షియల్‌గా హిట్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది. మేం ఆరేళ్లు కష్టపడి తీసిన సినిమా ఇది. మా సినిమాను కూడా నలుగురు పెద్ద మనుషులు చూసి.. మాట్లాడితే బాగుంటుంది. ఇది మన తెలుగు సినిమా. ఇలాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదని గర్వంగా చెబుతాను. మరో 20 ఏళ్ల తర్వాత తెలుగులో ఇలాంటి సినిమా వచ్చిందని గర్వంగా చెప్పొచ్చు. అంటూ విశ్వక్ వెల్లడించారు.

పశ్చిమ బెంగాల్‌లో 16 స్థానాలకు పోటీ

అభ్యర్థులను ప్రకటించిన లెఫ్ట్ ఫ్రంట్

సీపీఐ(ఎం) 13, సీపీఐ 1, ఫార్వర్డ్ బ్లాక్ 1, ఆర్ఎస్‌పీ 1



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ 16 లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని లెఫ్ట్ ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బసు అన్నారు. గురువారం కోలకతాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వామపక్ష కూటమి నేతలతో కలిసి బిమన్ బసు మాట్లాడారు. 16 మంది అభ్యర్థులలో 14 మంది కొత్తవారని, యువకులని పేర్కొన్నారు. "మేం 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాం. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తమ హైకమాండ్‌తో మాట్లాడటానికి ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉన్నారు. కాబట్టి, వారు తిరిగి వస్తే, ఆపై చర్చిస్తాం . ఏమి జరుగుతుందో చూద్దాం" అని బసు అన్నారు. మార్చి 16న లెఫ్ట్ ఫ్రంట్ లో భాగస్వామ్య పార్టీలైన సీపీఐ(ఎం), సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పీల మధ్య మళ్లీ చర్చలు జరుగుతాయని చెప్పారు.

కొత్త ముఖాలు సృజన్ భట్టాచార్య (జాదవ్‌పూర్), దీప్సితా ధర్ (సెరాంపూర్), దేబ్రాజ్ బర్మన్ (జల్పాయిగురి), మోనోదీప్ ఘోష్ (హుగ్లీ), నీలాంజన్ దాస్‌గుప్తా (బంకురా), శీతల్ కైబర్తా (బిష్ణుపూర్), నిరబ్ ఖాన్ (బుర్ద్వాన్-పుర్బా) సీపీఐ(ఎం) తరఫున పోటీ చేయనున్నారు. కోల్‌కతా సౌత్ నుంచి సైరా షా హలీమ్, డమ్ డమ్ నుంచి సుజన్ చక్రవర్తి, కలకత్తా హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయవాదులు సయన్ బెనర్జీని తమ్లుక్, సబ్యసాచి ఛటర్జీని హౌరా నుంచి అభ్యర్థులుగా బరిలో దింపింది. జమూరియా మాజీ ఎమ్మెల్యే జహనారా ఖాన్‌ను అసన్‌సోల్ నుంచి బరిలో దింపింది. సీపీఐ(ఎం)కి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం సాదీ కృష్ణానగర్ నుంచి పోటీ చేస్తారు. సీపీఐ నుంచి మిడ్నాపూర్ అభ్యర్థిగా విప్లవ్ భట్టా, కూచ్‌బెహార్ నుంచి ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన నితీష్ చంద్రరాయ్, బలూర్‌ఘాట్ నుంచి ఆర్ఎస్‌పీ నేత జోయ్‌దేవ్ సిద్ధాంతను బరిలోకి దింపాయి.

18 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు బ్లాక్

10 యాప్‌లు, 19 వెబ్‌సైట్లు, వాటి అనుబంధ 'సోషల్' ఖాతాలు కూడా

న్యూఢిల్లీ : బూతు, అసభ్యకరమైన, కొన్ని సందర్భాలలో అశ్లీల కంటెంట్‌ను పబ్లిష్ చేస్తున్నందుకు గానూ 18 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లను, వాటితో అనుబంధంగా ఉన్న సామాజిక మాధ్యమ ఖాతాలను కేంద్రం బ్లాక్ చేసింది. వీటితో పాటు 19 వెబ్‌సైట్లు, పది యాప్‌లు (గూగుల్ ప్లే స్టోర్ లో ఏడు, యాపిల్ యాప్ స్టోర్‌లో మూడు), వీటికి అనుబంధంగా ఉన్న 57 సోషల్ మీడియా ఖాతాలనూ నిలిపివేసింది.

ఈ మేరకు కేంద్ర సమాచారా, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. 'సృజనాత్మక వ్యక్తీకరణ' ముసుగులో అశ్లీలత, అసభ్యతను ప్రచారం చేయకూడదని ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యతలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ నొక్కి చెప్పారు.

బీజేపీ ఓటమికి ఐక్య పోరాటం

- రైతు, కార్మిక విరోధి మోడీ సర్కార్
- 23న దేశవ్యాప్త ఆందోళనలు
- ఎంఎస్పీ చట్టాన్ని చేయాలి : చారిత్రాత్మకంగా కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్



మాట్లాడుతున్న విజ్జూకృష్ణన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో కార్పొరేట్‌లతో కలిసి దేశ సంపదను దోచుకుంటున్న మోడీ ప్రభుత్వాన్ని కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ హెచ్చరించింది. గురువారం నాడిక్కడ రాంలీలా మైదానంలో ఎస్కేఎం ఆధ్వర్యంలో కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్ జరిగింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులు, యువకులు, న్యాయవాదులు, మేథావులు, రచయితలు సంఘీభావం తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చిన కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్‌ను జయప్రదం కాకుండా అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన అన్ని ప్రయత్నాలను రైతులు, కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. కేవలం ఐదు వేల మందిని మాత్రమే ఢిల్లీకి అనుమతిస్తామన్న పోలీసుల తీరుకు ప్రతిగా లక్షన్నర మంది హాజరయ్యారు.

చారిత్రాత్మక మహా పంచాయత్‌లో అపూర్వమైన మహిళల భాగస్వామ్యముంది. ఢిల్లీలోని పంజాబ్, హర్యానా వంటి పొరుగు రాష్ట్రాలతో పాటు, దక్షిణాది రాష్ట్రాల నుండి కూడా రైతులు, వ్యవసాయ కార్మికులు తెల్లవారుజామునే రాంలీలా మైదానంలో పోటెత్తారు. ఢిల్లీలో ఐటీవో సహా వివిధ ప్రాంతాల్లో రైతులను నిలువరించే ప్రయత్నం జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకే మైదానం దాదాపు నిండిపోయింది. మహా పంచాయత్ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసే సమయానికి పోలీసులు పెద్దఎత్తున నిరసన స్థలానికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం మంగళవారం అనుమతి లభించినా బుధవారం రాత్రి బురద నీటితో మైదానాన్ని నింపిన పోలీసుల కుయుక్తులు రైతుల ముందు ఫలించలేదు. బీజేపీని తరిమికొట్టండి, దేశాన్ని రక్షించండి అంటూ నినాదాలు ర్యాలీ వేదికగా మార్మోగాయి.

కేంద్రంపై ఉద్యమం ఉధృతం

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఐక్యంగా పోరాడాలని మహా పంచాయత్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. యునైటెడ్ పీపుల్స్ మూవ్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిల్లో ఆందోళనలు నిర్వహిస్తామని, కేంద్రంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. హర్యానాలో యువ రైతు శుభకరణ్ సింగ్‌ను కాల్చి చంపి రైతుల అణిచివేతకు కారణమైన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని మహా పంచాయత్ డిమాండ్ చేసింది. అమిత్ షాతో పాటు హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, మాజీ హెూంమంత్రి అనిల్ విజ్‌లపై హత్యానేరం మోపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరగాలని, 2020 నాటి చారిత్రాత్మక రైతు ఉద్యమం ముగించినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఎంఎస్పీ చట్టంతో సహా అనేక వాగ్దానాలను నెరవేర్చలేదని పేర్కొంది. లఖింపూర్‌ఖేరీ రైతు మారణకాండ సూత్రధారి, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బీజేపీ తిరిగి పోటీకి నిలపడాన్ని నిరసిస్తూ 23న అన్ని గ్రామాల్లో నిరసన కార్యక్రమం చేపట్టనుంది.

దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటంలో ప్రజలందరూ తరలిరావాలని మహా పంచాయత్ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్కేఎం నేతలు అశోక్ దావలే, విజూ కృష్ణన్, హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్, రాకేష్ టికాయిత్, దర్శన్‌పాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహన్, బల్బీర్ సింగ్ రాజేవాల్, సునీలం, సత్యవాన్, రావుల వెంకయ్య, హర్మీత్ కడియన్, బసవ రాజప్ప, లింగరాజ్ ఆజాద్, వికాస్ సిసార్, తేజిందర్ సింగ్ విర్క్, గుర్నామ్ సింగ్ చదువుని, అవిక్ సాహా, మేధా పాట్కర్, రాజారామ్ సింగ్, హరీందర్ లఖోవల్, కుల్వంత్ సంధు, చమ్రాసా మాలి పాటిల్, జోగిందర్ నయన్, జగ్తార్ బజ్వా, మంజీత్ ధనేర్, సుభాష్ కకుష్టే, సురేష్ కౌత్, రాజేంద్ర చౌదరి, అశోక్ బైతా, జంగ్వీర్ చౌహాన్, సత్యదేవ్ పాల్, బూటా సింగ్ బుర్జ్‌గిల్, రాజిందర్ సింగ్ దీప్సింగ్వాలా తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు పాఠశాల దుస్తుల కుట్టేపని

- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాఠశాల విద్యార్థుల దుస్తుల కుట్టు పనులను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు, వాటిల్లో మౌలిక సౌకర్యాల కల్పనను కూడా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగిస్తున్నట్టు ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పనితీరు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ ల స్టిచ్చింగ్ తదితర అంశాలపై కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, గనులు భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, కమిషనర్ అనితా రామచంద్రన్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, హ్యాండ్లూమ్స్ శాఖ కమిషనర్ అలుగు వర్షిణి తదితర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వాటిల్లో గుణాత్మక మార్పు వచ్చేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

రైతులకిచ్చిన హామీలేమయ్యాయి?

- మోడీ సర్కారు మాటలకే పరిమితం
- వచ్చే ఎన్నికల్లో గద్దెదించుతాం : ఎస్‌కేఎం మహాధర్నాలో నాయకుల హెచ్చరిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతాంగ ఉద్యమ సందర్భంగా రైతులకిచ్చిన రాతపూర్వక హామీలు ఏమయ్యాయని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర నాయకులు ప్రశ్నించారు. ప్రధాని మోడీ మాటలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. అన్నదాతలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని మోడీ అమలు చేయలేదన్నారు. ఎస్‌కేఎం అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు టి. సాగర్, పశ్య పద్మ బి. వెంకట్, రాయల చంద్రశేఖర్, మండల వెంకన్న, విస్సా కిరణ్, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, కాంతయ్య శంకర్, వి. కృష్ణ, బి. రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలన్నీ ఏకకాలంలో మాఫీ చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని మోడీ సర్కారును కోరారు. పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా మార్చాలని సూచించారు. రైతులకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు భూపాల్, సూర్యం, ఎం. శ్రీనివాస్, జనార్ధన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని సూచించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని విమర్శించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువజన, విద్యార్థి, వృత్తి సంఘాల నాయకులు అనగంటి వెంకటేష్, మహేష్, లెల్లెల బాలకష్ణ మాట్లాడుతూ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన మోడీ మోసం చేశారన్నారు. మహిళా సంఘాల నాయకులు ఝాన్సీ, సంధ్య, సజయ మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు పూనుకుంటున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలందరు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్. వెంకట్ రాములు (వ్యవసాయ కార్మిక సంఘం), ఎస్. రమ, వంగూరు రాములు, సోమన్న (సీఐటీయూ), మూడ్ శోభన్, మాటూరి బాలరాజు గౌడ్, రామచందర్, ముసలయ్య, తిరుపతిరెడ్డి, టి. కిషోర్ (తెలంగాణ రైతు సంఘం), కోట రమేష్ (డీవైఎఫ్ఐ), అరుణ, అనురాధ (ఐఎఫ్‌టీయూ) తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

పేటియంలో 20శాతం ఉద్యోగులపై వేటు

- నేటి నుంచి పిపిబిఎల్‌పై ఆర్‌బిఐ ఆంక్షలు

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించిందని



సమాచారం. సంస్థల్లో పని చేస్తున్న 20 శాతం మంది సిబ్బందిపై వేటు వేసిందని రిపోర్టులు వస్తోన్నాయి. మార్చి 15 నుంచి పేటియం పేమెంట్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ ఆంక్షలు ప్రారంభం కావడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పొదుపు చర్యల్లో భాగంగా ఇటీవలే 1000 మందిని తొలగించిన పేటియం తాజా చర్యలు ఆ సంస్థ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఉద్యోగుల వార్షిక పనితీరు ఆధారంగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారిని తొలగించాలని నిర్ణయానికి వచ్చింది. కాగా.. తన వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత సొల్యూషన్స్ అమలుపై కేంద్రీకరించడం కూడా ఉద్యోగుల తొలగింపునకు మరో కారణమని ఆ సంస్థ లీకులు ఇచ్చినప్పటికీ.. అసలు కారణాలు వేరే ఉన్నాయని తెలుస్తోంది. తొలగింపులు అంశంపై హెచ్‌ఆర్ విభాగం అధికారులు వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఒక్కొక్కరిని పిలిచి సమాచారం ఇస్తున్నారు.

పేటియం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్‌పై శుక్రవారం నుంచి ఆర్‌బిఐ ఆంక్షలు అమల్లోకి రానున్న నేపథ్యంలో గురువారం స్టాక్ మార్కెట్లలో ఓ దశలో పేటియం షేర్ విలువ 5 శాతం శాతం పతనమైంది. బిఎస్‌ఇలో తుదకు స్వల్ప నష్టంతో రూ.350.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.334-362 మధ్య కదలాడింది. గడిచిన ఐదు సెషన్లలో 11.99 శాతం నష్టపోయింది. థర్డ్ పార్టీ పేమెంట్ యాప్‌గా అనుమతించాలని పేటియం పెట్టుకున్న దరఖాస్తును నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) పరిశీలిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ షేర్ పతనం కావడం గమనార్హం. ప్రస్తుతం పేటియం ఫాస్టాగ్ ఉపయోగిస్తున్న వినియోగదారులు ఇతర విత్త సంస్థల వద్ద కొత్త ఫాస్టాగ్ తీసుకోవాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) సూచించింది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని నివారించేందుకు, ప్రయాణం సులభతరం చేసేందుకు మార్చి 15లోగా ఏదైనా బ్యాంకు నుంచి కొత్తగా ఫాస్టాగ్ తీసుకోవాలని బుధవారం తన అడ్వైజరీలో పేర్కొన్న విషయం తెలిసిందే.

రిలయన్స్ చేతికి పారామౌంట్ వాటా



న్యూఢిల్లీ : వయాకామ్18లో పారామౌంట్ గ్లోబల్‌కు ఉన్న 13 శాతం వాటాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోలు చేయనుంది. ఇప్పటికే వాల్ట్ డిస్నీతో తమ మీడియా వ్యాపార కార్యకలాపాలను విలీనం చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. భారత టివి వ్యాపారంలో తమకున్న వాటాలను రిలయన్స్‌కు విక్రయించనున్నట్లు అమెరికాకు చెందిన పారామౌంట్ గ్లోబల్ తెలిపింది. దీనిపై ఇప్పటికే ఇరు సంస్థలు ఓ ఒప్పందానికి వచ్చాయి. దీనికి నియంత్రణా సంస్థల అనుమతులు లభించాల్సి ఉంది. వయాకామ్ 18 మీడియా ప్రయివేటు లిమిటెడ్‌లో పారామౌంట్ గ్లోబల్‌కున్న 13.1 శాతం వాటాలను రూ.4,286 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఒప్పందం ఖరారు చేసుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. దీంతో వయాకామ్‌లో రిలయన్స్ వాటా 70.49 శాతానికి పెరుగుతుంది.

వచ్చే ఏడాది 7శాతం వృద్ధి

- ఫిచ్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. దేశీయంగా పెరిగిన డిమాండ్, వ్యాపారం స్థిరంగా కొనసాగడమే ఇందుకు కారణమని పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 7.8 శాతం పెరుగుదల ఉండొచ్చని అంచనా వేసింది. గడిచిన మూడు త్రైమాసికాలుగా దేశీయంగా 8 శాతం కంటే అధికంగా జిడిపి పెరుగుతోందని.. చివరి త్రైమాసికంలోనూ అదే స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ పేర్కొంది.

సామ్‌సంగ్ నుంచి

సరికొత్త 'ఎఐ' వాషింగ్ మెషిన్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా 11 కిలోల విభాగంలో ఎఐ ఆధారిత ఆటోమెటిక్ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఎఐ ఎకోబుబుల్ పేరుతో అందుబాటులోకి తెచ్చిన వీటి ప్రారంభ ధరను రూ.53వేలుగా నిర్ణయించింది. ఎఐ ఆధారిత క్విక్ డ్రైవ్‌టిఎం సాంకేతికతతో 39 నిమిషాల్లో పూర్తి లోడ్‌ను వాష్ చేస్తాయని ఆ కంపెనీ తెలిపింది.

ఫిలిప్పిన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ

- రెనల్ థెరపీ సొల్యూషన్స్ స్వాధీనం

హైదరాబాద్ : ప్రముఖ డయాలసీస్ సేవల సంస్థ నెఫ్రోప్లస్ ఫిలిప్పిన్స్‌లో తన సేవలను మరింత విస్తరించింది. ఆ దేశంలోని రెనల్ థెరఫీ సొల్యూషన్స్‌ను స్వాధీనం చేసుకోవడం మరో ఆరు క్లినిక్‌లను పెంచుకున్నట్లయ్యింది. దీంతో అక్కడ 27 శాఖలకు విస్తరించి నట్లయ్యింది. ఇప్పటికే భారత్, నేపాల్, ఉజ్బకిస్తాన్, ఫిలిప్పిన్స్ దేశాల్లో కీలక కార్యకలాపాలను కలిగి ఉంది. కిడ్నీ రోగులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే తమ లక్ష్యంలో భాగంగా సామర్థ్యాన్ని పెంచుకుంటూ 14 ఏళ గా ఈ రంగంలో రాణిస్తున్నామని నెఫ్రోప్లస్ సిఇఒ, వ్యవస్థాపకులు విక్రమ్ వుప్పల పేర్కొన్నారు. ఫిలిప్పిన్స్ ప్రజలకు మరింత నాణ్యమైన డయాలసీస్ సేవలను అందించనున్నామన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
- డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్కకు సీఐటీయూ బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, వారి వేతనాల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆరేడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రాన్ని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు పి.సుధాకర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, జె.చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి వారు తీసుకెళ్లారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు సహాయకార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. మల్టీపర్పస్ విధానం వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. జీపీ కార్మికుల్లో దళితులు, బలహీన సామాజిక తరగతులకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని చెప్పారు.పాత కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.9,500 వేతనాన్ని అదనంగా నియమించిన కార్మికులకు పంచి ఇవ్వడంతో నెలకు రూ.3,500, రూ.4 వేలకు మించి రావడం లేదనీ, ఆ వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోవడంతో కార్మికులు అర్ధాకలితో, అప్పులు చేసుకుని బతుకుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

మల్లన్న సాగర్ నిర్వాసితులను ఆదుకోవాలి

- మంత్రి కొండా సురేఖకు వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మల్లన్నసాగర్ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయం లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను వారు కలిశారు.

'సగటు'తో సతమతం

గృహజ్యోతి పథకంలో బాలారిష్టాలు

- మీటర్ రీడింగ్ సకాలంలో తీయక అనర్హత
- 200 యూనిట్ల ఫ్రీ కరెంటు కోసం పాట్లు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

'గృహజ్యోతి' పథకంలో భాగంగా జీరో కరెంట్ బిల్లు వచ్చిన లబ్దిదారుల్లో సంతోషం వెల్లివిరుస్తుండగా.. అర్హతవున్నా మీటర్ రీడింగ్ సకాలంలో తీయకపోవడంతో సున్నా బిల్లుకు నోచుకోని వినియోగదారులు నైరాశ్యంలో ఉన్నారు. 30 రోజుల బిల్లును 36 రోజులకు తీసి.. నెలరోజులకు యావరేజ్ కట్టడంతో అర్హత కోల్పోయిన వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.


ఎంపీడీవో కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రభుత్వం ఈనెల నుంచి అమలు చేస్తున్న 200 యూనిట్ల లోపు ఫ్రీ కరెంట్‌కు అర్హతున్నా నోచుకోలేకపోయిన వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. ఒక్కొక్కరికి ఒక్కో సమస్య ఉత్పన్నమవు తుండటంతో కరెంట్ ఆఫీసులు, పంచాయతీ, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈనెలతో బాలారిష్టాలను అధిగమించి వచ్చేనెల నుంచి అర్హులందరికీ సంపూర్ణంగా ఉచిత విద్యుత్ అమలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లను సైతం నెలకొల్పింది.

వారం రోజుల క్రితం ప్రారంభమైన ఈ కౌంటర్లకు వినియోగదారులు బారులు తీరుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో లోపాల కారణంగా కొందరు అర్హత కోల్పోగా.. కొందరు దరఖాస్తు సమయంలో సరైన ఆధారాలను సమర్పించకపోవడం కూడా సమస్యగా మారింది. కొన్ని ఆన్‌లైన్ సమస్యలు కూడా వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలో చాలా చోట్ల ఈ సమస్య ఉంది. కొంతమందికి జీరో బిల్లు వచ్చి మరికొందరికి రాకపోవడంతో అసంతృప్తిలో ఉన్నారు. దీనిపై ఒక్కొక్క చోట వేలల్లో దరఖాస్తులు అందుతున్నాయి.

ఖమ్మం కార్పొరేషన్‌లోనే ఒక్కరోజే 5వేల దరఖాస్తులు..

ప్రజాపాలన దరఖాస్తుల్లో లోపాలను సరిదిద్దేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లకు జనం భారీగా బారులు తీరుతున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో సోమవారం ఒక్కరోజే ఐదువేల మందికి పైగా దరఖాస్తులు సమర్పించారు. పది కౌంటర్ల ద్వారా వీటిని స్వీకరించారు. సిబ్బంది కార్యాలయానికి రాకముందు నుంచే బాధితులు బారులు తీరుతున్నారు. కార్పొరేషన్‌లో 1,00,736 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆన్‌లైన్ చేసినా జీరో కరెంట్ బిల్లు రాకపోవడంతో ఎక్కడ తప్పిదం జరిగిందో తెలియక వినియోగదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. వేలాదిగా దరఖాస్తులు సమర్పిస్తుండటంతో సర్వర్ బిజీ వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 4.27 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో 3.85 లక్షల మంది 200 యూనిట్ల లోపు కరెంట్ వినియోగిస్తున్నట్టు ప్రజాపాలనలో దరఖాస్తు చేశారు. ఆధారాలను పరిశీలిస్తే 3.55 లక్షల మంది సరైన ఆధారాలు సమర్పించారు. వీరిలో 2.29 లక్షల మంది మాత్రమే జీరో బిల్లుకు అర్హులుగా అధికారులు గుర్తించారు.

యావరేజ్ పేరుతో అనర్హత..

మీటర్ రీడింగ్ సకాలంలో తీయకపోవడంతో యావరేజ్ (సగటు) ప్రాతిపదికన బిల్లు కౌంట్ చేస్తున్నారు. ఒక నెల 36 రోజులకు మరో నెల 27 లేదంటే 28 రోజులకు రీడింగ్ తీస్తున్నారు. సగటు నెలరోజులకు లెక్కిస్తుండటంతో యూనిట్లు 200కు పైగా చేరుతున్నాయి. దీనివల్ల 200 యూనిట్ల సమీపంలో22కి వచ్చిన వారి సగటు లెక్కించడంతో అర్హత కోల్పోతున్నారు.

193 యూనిట్లు వాడినా సగటు పేరుతో అనర్హత..


193 యూనిట్లు వాడినా రాని మైనస్ బిల్లు

ఎర్రుపాలెం మండల కేంద్రానికి చెందిన కోటి శివారెడ్డి ఖమ్మం బుర్హాన్ పురంలోని (ఏరియా జోన్ 11) ఆర్. అనురాధ (యూఎస్‌సీఎన్‌వో :15420138) ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ప్రయివేటు అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. జనవరిలో 4వ తేదీన ఆయన కరెంట్ బిల్లు తీశారు. తిరిగి ఫిబ్రవరి 9వ తేదీన అంటే 36 రోజుల తర్వాత రీడింగ్ చేశారు. మొత్తం ఆయన 292 యూనిట్లు వాడితే సగటు లెక్కించి 251 యూనిట్లుగా తేల్చారు. మొత్తం నెట్ ఎమౌంట్ రూ.1818 పేర్కొంటూ బిల్లు ఇచ్చారు. ఫిబ్రవరిలో 9వ తేదీన బిల్లు చేసిన అధికారులు తిరిగి 27 రోజుల తర్వాత మార్చి 7వ తేదీన ఈనెల బిల్లు తీశారు. మొత్తం 193 యూనిట్లు వాడినట్టు తేల్చారు. గత నెల 36 రోజులు, ఈనెల 27 రోజులు వెరసి 30 రోజుల సగటు తీశారు. దాంతో శివారెడ్డి వాడిన యూనిట్ల సంఖ్య 207.30కు చేరింది. దీనివల్ల అతను గృహజ్యోతి జీరో కరెంట్ పథకానికి అర్హత కోల్పోయాడు. ఇలా ఎంతో మంది సగటు గణాంకాలు తెలియక సతమతమవుతున్నారు.

బార్డర్లోకి వస్తే ఇలాంటి ఇబ్బందులే.. : - ఎ. సురేందర్, ఖమ్మం సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్



200 యూనిట్ల లోపు వాడితే జీరో కరెంట్ బిల్లు వస్తుంది. కానీ మీటర్ రీడింగ్ వివిధ కారణాల రీత్యా ఒకనెల 27 రోజులకు తీయవచ్చు.. ఒక నెల 36, 37 రోజులకు కూడా తీయవచ్చు. దీనిబట్టి నెల సగటు (యావరేజ్) లెక్కించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు బార్డర్‌లో ఉన్నవారి యావరేజ్ 200 యూనిట్లు దాటే అవకాశం ఉంది. కాబట్టి వీలైనంత వరకు 170-180 యూనిట్ల లోపు వాడితే సగటు తీసినా ఇబ్బంది ఉండదు. ఈనెల తక్కువ యూనిట్లు వాడితే ఇలాంటి వారు వచ్చేనెల అర్హత పొందుతారు. ఈనెల 200 యూనిట్ల లోపు వాడినా వచ్చేనెల అంతకుమించి వాడితే ఆ నెల బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. మరుసటి నెల యావరేజ్ యూనిట్లు తగ్గితే చెల్లించాల్సిన అవసరం ఉండదు.

ఇఫ్తార్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

రంజాన్ ఏర్పాట్లకు నిధుల కొరత లేదు

- మైనార్టీ సంక్షేమ శాఖకు రూ.2263 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాన్సెప్ట్ తరహాలోనే మైనార్టీ రెసిడెన్షియల్స్: డిప్యూటీ సీఎం మల్లు భటి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. అందు కోసం మొదటి శుక్రవారం రోజే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రంజాన్ ఏర్పాట్లకు నిధుల కొరత లేదని చెప్పారు. ఈ గురువారం ఎల్బీస్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో ఇఫ్తార్ విందు కార్యక్రమ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. బందోబస్తు, పార్కింగ్, విద్యుత్, మెడికల్, మంచినీటి సరఫరా, ప్రోటోకాల్, రవాణా తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.అనంతరం డిప్యూటీ సీఎం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మైనార్టీ సంక్షేమ శాఖ, పోలీస్, సమాచార శాఖ, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, వాటర్ బోర్డు, అగ్నిమాపక శాఖ తదితర శాఖలు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. మైనార్టీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం రూ.2263 కోట్లను బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. గడిచిన మూడు నెలల్లో మైనార్టీల సంక్షేమానికి రూ.478.56 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.

కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాన్సెప్ట్ తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభిస్తామని చెప్పారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలను సేకరించాల్సిందిగా ఆదేశించారు. మైనార్టీ సంక్షేమ శాఖకు సంబంధించిన వివిధ విభాగాల్లో ఐదుగురు చైర్మెన్లను భర్తీ చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీలో మెట్రోలైన్, మీర్-ఆలమ్‌లో కేబుల్ వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు ఒబేదుల్లా కొత్వాల్, సయ్యద్ అజ్మతుల్లాహ్ హుస్సేనీ, తాహెర్ బిన్ హమ్దాన్, అఫ్జల్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్, క్రాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

గుత్తికోయగూడెంను అధికారుల సందర్శన

- రవాణా సౌకర్యం లేక ట్రాక్టర్‌లో పయనం



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండల శివారులోని సుమారు 12 కిలోమీటర్ల దూరంలో రోల్ బండ అటవీ ప్రాంతంలో గుత్తి కోయల గూడెం ఉంది. ఇక్కడ సుమారు 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కానీ, రవాణా, రోడ్డు సౌకర్యం సరిగా లేదు. ఎవరైనా గూడెంను సందర్శించా లన్నా.. గూడెం వాళ్లు అవసరాల రీత్యా బయటకు వెళ్లాలన్నా 12 కిలోమీటర్లు దూరభారం పడాల్సిందే. ఈ క్రమంలో గురువారం మాతా సంరక్షణ, పోషణ జాయింట్ డైరెక్టర్ (ఎంహెచ్ఎన్) డాక్టర్ పద్మజ, డాక్టర్ సౌజన్య స్థానిక మెడికల్ ఆఫీసర్ చీర్ల శ్రీకాంత్ డాక్టర్ పవన్ కుమార్‌తో కలిసి గూడెంను సందర్శించేందుకు వచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం గురించి డాక్టర్ రిషితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల రిజిస్టర్లు పరిశీలించి ఫార్మసిస్ట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో 12 కిలోమీటర్లు అడవిలో ప్రయాణించి రోల్ బండకు చేరుకొని అక్కడ నివాసం ఉంటున్న గుత్తి కోయల వద్దకు వెళ్లి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వారందరికీ అవసరమైన మందులను అందజేశారు. దాంతో అధికారుల సేవలు భేష్ అంటూ పలువురు కొనియాడారు. ఇప్పటికైనా గుత్తికోయగూడెంకు కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సదానందం, హెచ్ఈ భాస్కర్, ఏఎన్ఎంలు స్వప్న, అనురాధ, వజ్రమ్మ, ఎల్లి కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్రాన్‌ను భయపెట్టిన

ఉక్రెయిన్ నివేదికలు - మరియాన్నే



ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ కీవ్‌కు సహాయం చేయడానికి దళాలను పంపడం గురించి చేసిన ప్రకటన ఉక్రె యిన్ యుద్ధంపై ఫ్రెంచ్ మిలిటరీ చేసిన మూడు అత్యంత నిరా శాజనక అంచనాల ద్వారా ప్రేరేపించబడి ఉండవచ్చని మరి యాన్నే మ్యాగజైన్ రాసింది. 2023లో ఘోరంగా విఫలమైన ప్రతిదాడి క్రమంలో ఉక్రెయిన్ తన పాశ్చాత్య సైనిక శిక్షకుల దళా న్ని ధ్వంసం చేసిందని, సైన్యంలోకి సమీకరించ డానికి మనుషు లు కరువయ్యారని, అవదీవ్కాలో రష్యాకు వ్యతిరేకంగా కనీసం తన రక్షణ రేఖను కాపాడుకోలేకపోయిందని తనకు అందిన వివిధ నివేదికల ఆధారంగా మరియాన్నే విశ్లేషించింది. 2023 లో విఫలమైన వినాశకరమైన ఉక్రెయిన్ ప్రతిదాడి తరువాత ఉక్రెయిన్ ఈ యుద్ధాన్ని సైనికంగా గెలవ జాలదు అనే వాక్యంతో ఫ్రెంచ్ మిలిటరీ మొదటి నివేదికను ముగించారు.

రక్షణాత్మక కార్యకలాపాలను నిర్వహించటంలోను, కొత్త వ్యూహాత్మక, సాంకేతిక ప్రమాణాలను సాధించటం లోను రష్యన్ దళాలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాయని ఆ నివేదిక ప్రశంసించింది. రష్యా తన సైనికులను పెద్ద సంఖ్యలో కోల్పోయిందని మీడియా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కూడా ఆ నివేదిక పేర్కొంది.

పశ్చిమ దేశాలు ఉక్రెయిన్ సమస్యను సైనికంగా పరిష్కరించాలనుకోవటం వెనుక "అత్యంత లోప భూయిష్టమైన అవగాహన, విశ్లేషణ" ఉన్నాయని మరియాన్ ఉటంకించిన ఆ క్లాసిఫైడ్ డాక్యుమెంట్ పేర్కొంది. ఉక్రెయిన్‌కు ఫ్రెంచ్ దళాలను పంపడం ఏ మాత్రం సమంజసం కాదు" అని ఒక సీనియర్ అధికారి అన్నాడు. రష్యన్ సైన్యాన్ని ఎదుర్కోవటం అంత తేలిక కాదనే విషయాన్ని మనం మరువకూడదు! అని కూడా సదరు అధికారి చెప్పాడు.

ఉక్రెయిన్‌కు నెలకు 35,000 మంది పురుషులు అవసర మని, అయితే ఆ సంఖ్యలో సగం కంటే తక్కువ రిక్రూట్ మెంట్ మాత్రమే జరుగుతోందని, రష్యా నెలకు 30,000 మంది వాలంటీర్లను తన సైన్యంలో చేర్చుకుంటోందని 2024లో అవకాశాలను వివరిస్తూ రెండవ నివేదిక పేర్కొంది. 2023లో ఉక్రెయిన్ చేసిన విఫల ప్రతిదాడి యుద్ధంలో పాల్గొన్న ఉక్రెయిన్‌కు చెందిన 12 బ్రిగేడ్‌లలో సగం సర్వ నాశనం అయ్యాయి అని రెండవ నివేదికలో పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాలు డ్రోన్లు లేదా మందుగుండు సామగ్రిని తయారు చేయడానికి త్రిడీ ప్రింటర్లను అందించగలవేమోగానీ పురుషులను సరఫరా చేయలేవు కదా అని ఆ రెండవ నివేదిక పేర్కొంది.

ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాల దళాలను యుద్ధ క్షేత్రం వెనుక సహాయక విధులను నిర్వహించడానికి పంపడం ద్వారా ఉక్రేనియన్లను ఫ్రంట్‌లైన్ డ్యూటీ మీద తమ దృష్టిని కేంద్రీకరించేలా చేయవచ్చని ఆ నివేదిక సూచించింది. పాశ్చాత్య ప్రత్యేక దళాలు, సివిల్ దుస్తులలో ఉన్న సైనికులు అధికారికంగా గుర్తించిన దాని కంటే ఉక్రెయిన్‌లో చాలా ఎక్కువ ఉనికిని కలిగి ఉన్నారని, ఇందులో కొంతమంది బ్రిటీష్ అలాగే ఉక్రేనియన్లకు శిక్షణనిస్తున్న ఫ్రెంచ్ నావికాదళ కమాండోలు కూడా ఉన్నారని రెండవ నివేదిక అంగీకరించింది.ఫిబ్రవరి 17న అవదీవ్కా నుంచి ఆకస్మికంగా, ఏ మాత్రం సన్నద్ధత లేకుండా నిష్క్రమించటాన్ని ఉక్రేనియన్ దళాల ఓటమి ఎందుకు భావించాలో, రోజుకు 1,000 మందికి పైగా ప్రాణనష్టం చేయడానికి భారీ గ్లైడ్ బాంబులను ఉపయోగించడం ద్వారా ఉక్రేనియన్ దళాలకు రష్యా సృష్టించిన భయంకర నరకం ఎలా వుందో అనే విషయాలను అభివర్ణించిన మూడవ మరియు తాజా నివేదికతో ఫ్రెంచ్ పరిశీలకులకు చెమటలు పట్టాయి.

ఉక్రెయిన్‌కు సహాయం చేసేందుకు కావలసిన అన్ని అవకాశాలు ఉండాలని మక్రాన్ ఫిబ్రవరి చివరలో నాటో సభ్యులకు సూచించాడు. దీని వెనుక ఉక్రెయిన్‌కు సైనిక దళాలను పంపే ఉద్దేశం ఉంది. అయితే అమెరికా నేతృత్వంలోని నాటో కూటమిలోని చాలా సభ్య దేశాలు ఈ ఆలోచనను బహిరంగంగా తిరస్కరించాయి.

పాలస్తీనియన్లను మానవతా ద్వీపాలకు తరలించాలనుకుంటున్న ఇజ్రాయిల్



పాలస్తీనా భూభాగంలో చివరి హమస్ కోట ను నిర్మూలించడానికి ఇజ్రాయిల్ సమాయత్త మౌతోంది. గాజా దక్షిణ కొనలోవున్న రఫాలో లక్షలాది మంది స్థానభ్రంశం చెందిన పౌరులు నివాసమున్న ప్రాంతంపై దాడి చేసే ముందు అక్కడి పౌరులను సురక్షిత జోన్‌లకు తరలించటం జరుగుతుందని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. 1.4 మిలియన్ల మంది ప్రజలు లేదా కనీసం 1.4 మిలియన్ల మందిలో గణనీయమైన మొత్తం తరలి వచ్చేలా మేము చూసుకోవాలి అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రతినిధి డేనియల్ హగారి బుధవారం విలేకరుల సమావేశంలో అన్నారు. అంతర్జాతీయ సమాజం సహకారంతో మేము సృష్టించే "మానవతా ద్వీపాల"కు ఈ ప్రజలను తర లించాలి.

ఈ ఆశ్రయ స్థలాలు స్థానభ్రంశం చెంది న పౌరులకు తాత్కాలిక ఆశ్రయం, ఆహారం, నీటి ని అందజేస్తాయని హగారి చెప్పాడు. గాజాలోని వివిధ ప్రాంతాలను ఇజ్రాయెల్ వైమానిక దాడు లు నేలమట్టం చేసిన తరువాత ఆయా ప్రాంతా లలో నివసించే లక్షలాది ప్రజలు గాజా దక్షిణాగ్రం లో వున్న రఫాకు పారిపోయి అత్యంత దయనీయ పరిస్థితులలో నివసిస్తు న్నారు. ఇజ్రాయెల్ దళాలు వారి వివాదాస్పద రఫా దాడిని ప్రారంభించే ముందు పౌరులను రక్షించడానికి విశ్వసనీయ ప్రణాళికనందించాలని ఇజ్రాయిల్ అనుంగు మిత్రుడు అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ పట్టు బట్టాడు. ఇ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటికే గాజాలో 31,00మందికిపైగా పాలస్తీనా ప్రజలు మరణించినట్లు స్థానిక అధికారులు తెలి పారు. గాజాలోని 2.3 మిలియన్ల నివాసితులలో 85% మంది ఇజ్రాయెల్ బాంబు దాడుల వల్ల స్థాన భ్రంశం చెందారు. అలాగే ముట్టడి చేయ బడిన పాలస్తీనా భూభాగంలో నివసిస్తున్న 570, 000 మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్య రాజ్య సమితి అంచనా వేసింది. రఫాపై ఇజ్రా యిలీ సైనిక బలగాలు తమ దాడిని ప్రారభించ డానికి ముందు తరలింపులు ఎప్పుడు ప్రారంభమ వుతాయి లేదా ఎంత సమయం ఇవ్వబడుతుందనే విషయాలను హగారి పేర్కొనలేదు గాజా శరణా ర్థులను తమ భూభాగంలోకి తరిమికొటవద్దని కోరిన పొరుగున ఉన్న ఈజిప్తుతో సమయాన్ని సమన్వయం చేసుకుంటామని ఆయన చెప్పాడు.రఫాపై ఇజ్రాయిల్ చేయబోతున్న దాడి మానవతా విపత్తుకు కారణమవుతుందని అంత ర్జాతీయ భయాలు ఉన్నప్పటికీ అది జరిగి తీరవల సిందేనని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పట్టుపడుతున్నాడు. ఎందుకంటే ఆయన దృష్టిలో హమాస్‌పై విజయం సాధిం చటంపైనే ఇజ్రాయిల్ మనుగడ ఆధారపడివుంది. గాజాలోని 24 హమాస్ బెటాలియన్లలో 18ని ఇజ్రాయెల్ ఇప్పటికే ధ్వంసం చేసిందని, మిగిలిన నాలుగు యూనిట్లు రఫాలో కేంద్రీకతమై ఉన్నా యని ఇజ్రాయిల్ ప్రధాని గత నెలలో చెప్పాడు.

మమతా బెనర్జీకి తీవ్ర గాయం..



కోల్‌కతా: టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తీవ్ర గాయమైంది. పార్టీ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఆమె నుదుటిపై గాయానికి సంబంధించిన ఫొటోలను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. దీదీ కోలుకోవాలంటూ ప్రార్థించాలని విజ్ఞప్తి చేసింది. సీఎం ప్రస్తుతం కోల్‌కతాలోని ప్రభుత్వ ఎస్-ఎస్‌కేఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. అయితే గాయానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మమతా బెనర్జీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోడీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీడీపీ అధినేత చంద్రబాబు, రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.

జనవరిలోనూ ఓ కారు ప్రమాదంలో మమతా తలకు స్వల్ప గాయమైంది. అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం బర్ధమాన్ నుంచి కోల్‌కతాకు తిరిగి వస్తుండగా.. ఆమె కాన్వాయ్‌కు ఎదురుగా ఉన్నట్టుండి మరో వాహనం రావడంతో దాన్ని తప్పించేందుకు డ్రైవర్ కారుకు బ్రేక్‌లు వేశాడు. దీంతో ముందు సీట్లో కూర్చున్న సీఎం.. విండ్‌షీల్డ్‌కు ఢీకొనడంతో తలకు స్వల్ప గాయమైనట్టు అధికారులు వెల్లడించారు.

హామీలు అమలు చేయడం లేదు : దేవీ ప్రసాద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అరచేతిలో వైకుంఠం చూపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వంద రోజులైనా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నేత దేవి ప్రసాద్ విమర్శించారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్ వచ్చాక ఉద్యోగులను పట్టించుకోవడం లేదనీ, చాలా మందికి నెల మొదటి తేదీన జీతాలు రావడం లేదని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద పంటలు ఎండిపోతున్నా నిర్లక్ష్యం వీడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే ఉద్యోగులకు డీఏ ఇతర సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బ్యాంక్‌ల్లో 25 శాతం వరకు వాటాల విక్రయం

- ఆ ఐదు బ్యాంక్‌ల్లో ఉపసంహరిస్తాం : ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి

న్యూఢిల్లీ : ఐదు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో 25 శాతం వరకు వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయిస్తామని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి అన్నారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌ల్లో వాటాల ఉపసంహరణ ఉంటుందన్నారు. సెబీ రూపొందించిన మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్ (ఎంపిఎస్) నిబంధనల ప్రకారం.. 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఐదింటిలో ప్రభుత్వ వాటాను 75 శాతం కంటే దిగువకు తగ్గించుకోవాల్సి ఉందన్నారు. స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయిన వాటిలో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లో 98.25 శాతం, ఐఒబిలో 96.38 శాతం వాటా, యూకో బ్యాంక్‌లో 95.39 శాతం వాటా, సెంట్రల్ బ్యాంక్‌లో 93.08 శాతం, బిఒఎంలో 86.46 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వం వాటాలు కలిగి ఉంది.

రుణాలివ్వటం బ్యాంకర్ల సామాజిక బాధ్యత

ఈము రైతులకు వన్ టైం సెటిల్‌మెంట్ చేయండి

- స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలివ్వాలి
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎస్ఎల్‌బీసీ సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బ్యాంకర్లు రుణాలివ్వటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

గురువారం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 40వ త్రైమాసిక సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నదని చెప్పారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను ముందుకు తీసుకుపోవటానికి బ్యాంక్లరు సహకరించాలని కోరారు. గత పాలనలో చాలా మంది రైతులవి ఇర్రెగ్యులర్ అకౌంట్స్‌గా మారాయని వారికి కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలిచ్చే విషయంలో రైతుల పట్ల నిర్లక్ష్యం, అసహనం ప్రదర్శిస్తే సాగు పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారనీ, రుణ భారం తీరక అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పట్ల మానవీయ కోణంలో బ్యాంకర్లు వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయం, హౌసింగ్, విద్యకు ఇచ్చే రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో బ్యాంకర్లు వన్ టైం సెటిల్‌మెంట్ చేయాలని కోరారు. రైతులు, నిరుద్యోగులకు రుణాలిచ్చే విషయంలో బ్యాంకర్లు ఆస్తులను తప్పనిసరిగా తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదన్నారు. స్వయం ఉపాధి కోసం యువతకు రుణాలివ్వాలని కోరారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళ సభ్యులను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలివ్వలన్నారు. రానున్న ఐదేండ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ. లక్ష కోట్లను వడ్డీ లేకుండా ప్రభుత్వం రుణాలు ఇప్పించబోతున్న కార్యక్రమానికి సహకరించాలన్నారు. మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల డబ్బులను బ్యాంకర్లకు ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా తాను ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభమయ్యాయనీ, 20 ఏండ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసి సంపదను కింది వర్గాలకు తీసుకెళ్లిందన్నారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు అవ్వడం వల్ల రాష్ట్రంలో సృష్టించే సంపద ప్రజలకు పంచవచ్చని వివరించారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు మధ్యన ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేయబోతున్నదని తెలిపారు. వీటి మధ్యన పరిశ్రమల స్థాపన పెద్ద ఎత్తున ఉండబోతుందన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజలకు ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. రుణాలిచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దేశ సంపద రైతులనీ, ఆర్థిక వ్యవస్థలో ప్రధానం వ్యవసాయమని చెప్పారు. దేశంలో వ్యవసాయం సంక్షోభంలోకి పోతే ఆహార కొరత ఏర్పడే ముప్పు ఉందన్నారు. అందుకనే రైతులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రంలో విచ్ఛిన్నమైన వ్యవస్థలను సరి చేసి ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో, అంకితభావంతో పనిచేస్తున్న ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ఆ లక్ష్యాలను చేరుకునే విధంగా బ్యాంకర్ల పనితీరు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గట్టుగా పాల ఉత్పత్తి లేదనీ, పాడి పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. . బ్యాంకింగ్ వ్యవస్థ నిబద్ధతగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కావొద్దని హితవు పలికారు. వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తే సమాజాన్ని విచ్ఛిన్నం చేసినట్టే అవుతుందన్నారు. అనంతరం పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1,83,41వేల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పిపి ఉషా, అధికారులు శారద, జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీజోన్-2లో జీహెచ్ఎం పదోన్నతులు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మల్టీజోన్-2 పరిధిలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) పదోన్నతులను వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు స్టే ఉత్తర్వుల కారణంగా గత సెప్టెంబర్‌లో నిలిచిపోయిన మల్టీజోన్-2 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులపై సోమవారం ఆ స్టేను కోర్టు ఎత్తేసిందనీ, పాత షెడ్యూల్‌ను కొనసాగించేందుకు అనుమతించిందని తెలిపారు. దీంతో పదోన్నతులను వెంటనే చేపట్టాలని కోరారు. సీనియార్టీ జాబితా సిద్ధంగా ఉన్నందున, వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తే రెండు రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని గుర్తు చేశారు. శుక్ర లేదా శనివారం పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని పేర్కొన్నారు. వెంటనే పదోన్నతులు ఇవ్వకపోతే ఎన్నికలయ్యే వరకు అవకాశం ఉండబోదని వివరించారు. మార్చి నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. దీంతో వచ్చే మూడు నెలల్లో పలువురు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ పొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఐదు నెలలు వెనుకబడిపోయారని పేర్కొన్నారు. ఇంకా విద్యాశాఖ మీనమేషాలు లెక్కించటం సమంజసం కాదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఎకో టూరిజం అభివృద్ధిపై కమిటీ

- చైర్మెన్‌గా వ్యవహరించనున్న మంత్రి కొండా సురేఖ
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎకో టూరిజం ప్రదేశాల గుర్తింపు, ప్రాజెక్టుల అభివృద్ధిపై అధ్యయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆ కమిటీకి చైర్మెన్‌గా వ్యవహరించనున్నారు. మొత్తం ఆ కమిటీలో 16 మంది సభ్యులుంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కొండా సురేఖ చైర్మెన్‌లో ఉన్న కమిటీలో సీఎస్, పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి, పీసీసీఎఫ్(హెడ్ ఆఫ్‌ది ఫారెస్ట్ ఫోర్స్), పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), నీటిపారుదల శాఖ కార్యదర్శి, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ వైస్ చైర్మెన్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ వైస్ చైర్మెన్, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ నుంచి నామినీ, జూపార్కుల డైరెక్టర్, ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి, ఎన్జీవోల నుంచి ఓ ప్రతినిధి ఉండనున్నారు. అటవీ చట్టాలకు లోబడి ఎకో టూరిజం అభివృద్ధి చేయడంపై ఈ కమిటీ ఓ పాలసీ రూపొందించనున్నది. ఈ కమిటీ కనీసం మూడు సార్లు భేటీ అయ్యి రికమండేషన్స్‌పై చర్చించి మూడు నెలల్లోగా పూర్తిచేయాలి.

రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆటో నడవడం లేదని భార్యతో సహా ప్రాణాలు కోల్పోయిన ఆటో కార్మికుని బిడ్డకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు. అనాథగా మారిన బిడ్డ బాధ్యత ఎవరు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో వరుసగా ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి, ప్రభుత్వం వెంటనే ఆటో డ్రైవర్ల జీవన సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రూ. 12 వేల భృతి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో సోదరులు ధైర్యంగా ఉండాలని, తొందరపాటు చర్యలకు పాల్పడొద్దని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు

టెట్ నిర్వహించాలని ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీ తరపున లేఖ రాసినట్టు మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఆయన గురువారం ట్వీట్ ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. టెట్ అర్హత కోసం రాష్ట్రంలో 7 లక్షల మంది ఎదురు చూశారని ఆయన చెప్పారు.

ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

- త్యాగాలు, బలిదానాలతో సాగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలు :రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



నవతెలంగాణ - బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులపై అక్రమంగా పెట్టిన కేసులను, కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రజలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తేయాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. లౌకిక ప్రజాస్వామిక ఐక్యకార్యాచరణ కమిటీ, తెలంగాణ ప్రజాస్వామిక రక్షణ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పాశం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడుతూ.. కొన్ని ప్రత్యేక అంశాలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ఆమోదించామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదటి, మలిదశ పోరాటాలు వందలాది మంది త్యాగాలు, బలిదానాలతో సాగాయని తెలిపారు. కొన్ని వందల మంది విద్యార్థులు, పోరాటయోధులు ఈ ఉద్యమంలో అమరులయ్యారని చెప్పారు. అమరుల కుటుంబాల్లో ఈనాటికీ వెలుగులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. త్యాగాల చరిత్రపై అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ కాలం నాటి కేసులను పూర్తిగా రద్దు చేయలేదని.. పైగా కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వందలాది మంది ఉద్యమకారులపై, ప్రజలపై తప్పుడు కేసులు బనాయించారని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ఉద్యమకారులకు, ప్రజలకు కష్టాలు, జైళ్లు, కేసులు, గద్దెనెక్కిన వారికి సౌఖ్యాలు అన్నట్టుగా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనేక మందిపై అణచివేత కొనసాగిందన్నారు. కేసీఆర్ ఒక చక్రవర్తిలా, కేటీఆర్ ఉపచక్రవర్తిలా.. ఆయన కుటుంబం అంతా యువరాజు యువరాణుల్లా వ్యవహరించారని విమర్శిం చారు. అధికార యంత్రాంగం ముఖ్యంగా నాటి పోలీస్ యంత్రాంగం బీఆర్ ఎస్‌కు బానిసగా పనిచేసిందని ఆరోపించారు.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, కేసీఆర్ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీల నాయకులపై పెట్టిన కేసులను కూడా ఉపసంహరించాలని కోరారు.

ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్దన్, తెలంగాణ ఉద్యమకారుడు పృథ్విరాజ్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, జర్నలిస్ట్ రఘు, తెలంగాణ జర్నలిస్ట్ ఉద్యమకారుడు విటల్ కరుణాకర్ దేశాయ్, సోగరా బేగం, జర్నలిస్ట్ శ్రావ్య, పర్వీన కళిదాజియ, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, ఎంసీపీఐ తుకారం నాయకు సతీష్ కుమార్, కామేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

45 కంపెనీలపై దాడులు

- ఈబీల ద్వారా దండుకున్నది రూ.400 కోట్లు : బీజేపీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ : ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. నలభై ఐదు కంపెనీలపై దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించిందని, వాటి నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.400 కోట్లు దండుకున్నదని మండిపడింది. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా తన ఆర్థిక వనరులపై బీజేపీ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు జరిపిన తర్వాత మరో పదిహేను కంపెనీలు కూడా బీజేపీకి విరాళాలు అందించాయని తాజా విచారణలో బయటపడిందంటూ మీడియాలో వచ్చిన వార్తలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రస్తావించారు.

'మరిన్ని విరాళాలు పొందేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం బ్లాక్‌మెయిల్ కాదా? దోపిడీ కాదా? బలవంతం చేయడం కాదా? ఈడీ, సీబీఐ, ఐటీ దాడుల తర్వాత మరో పదిహేను కంపెనీలు బీజేపీకి విరాళాలు ఇచ్చాయని తాజా విచారణ తేల్చింది. వీటితో కలిపి మొత్తం 45 కంపెనీలు బీజేపీకి రూ.400 కోట్ల విరాళం అందించాయి' అని ఖర్గే తెలిపారు. తనకు అందిన సమాచారం ప్రకారం నాలుగు షెల్ కంపెనీలు కూడా బీజేపీకి నిధులు సమకూర్చాయని ఆయన చెప్పారు. ఓ వైపు కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటూ సొమ్ము దండుకున్న నిరంకుశ మోడీ ప్రభుత్వం మరోవైపు కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిందని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగవిరుద్ధమైన, చట్టవిరుద్ధమైన ఎన్నికల బాండ్లను ఉపయోగించుకోవడం ద్వారా బీజేపీ తన దోపిడీ సొమ్మును పది రెట్లు పెంచుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీకి ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా తన ఆర్థిక వనరులపై స్వతంత్ర విచారణ ద్వారా శ్వేతపత్రాన్ని తీసుకురావాలని ఖర్గే డిమాండ్ చేశారు. నాలుగు షెల్ కంపెనీలు, పదకొండు కంపెనీలు సహా మొత్తం పదిహేను కంపెనీలు కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ఎదుర్కొన్నాయని, మరో 30 కంపెనీలు ఐటీ, ఈడీ దాడులను ఎదుర్కొని బీజేపీకి రూ.335 కోట్లు సమర్పించుకున్నాయని మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ప్రస్తావించారు.

కార్మిక, రైతాంగ సమస్యలే ఎన్నికల ఎజెండా

73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు కరువు

- 1500 పరిశ్రమల్లో 2.50 లక్షల మంది కార్మికులు
- లేబర్ కోడ్‌లు తెచ్చిన మోడీ పట్ల తీవ్ర వ్యతిరేకత
- పంటలకు దక్కని కనీస మద్దతు ధరలు
- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభావం చూపుతున్న సమస్యలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రాబోతుంది. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మెతుకు సీమగా పేరొందిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ చేయనున్నాయి. రెండు దశాబ్దాలుగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో జాతీయ పార్టీల అభ్యర్థులు గెలవలేకపోయారు. బీఆర్ఎస్ వరుసగా ఐదు పర్యాయాలు గెలుస్తూ వచ్చింది. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా బీఆర్ఎస్‌ను ఓడించి గెల్చి తీరాలన్న పట్టుదలతో కాంగ్రెస్, బీజేపీలున్నాయి. పార్టీల బలాబలాల పరిస్థితి పక్కన పెబడితే.. పారిశ్రామిక, వ్యవసాయక ప్రాంతంగా ఉన్న మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కార్మిక, రైతాంగ సమస్యలే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్నాయి. నియోజకవర్గం పరిధిలో ఉన్న వేలాది పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులున్నారు. వీరికి సంబంధించి షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల సవరణ జరగట్లేదు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తేనుంది. బీడీ కార్మికుల సమస్యలూ ఉన్నాయి. వీటిపైనా కార్మిక వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. అదే విధంగా పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, కేంద్రం నల్ల చట్టాల్ని తెచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చేస్తున్న నిర్ణయాల ప్రభావం కూడా తీవ్రంగా ఉండనుంది.

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంతో ప్రత్యేకత ఉంది. 18.12 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో కార్మికులు, రైతులే పది లక్షల వరకు ఉన్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోకజవర్గాల్లో భారీ, మధ్యతరహా పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల్లో బీడీ పరిశ్రమ విస్తరించింది. అదే విధంగా మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక వంటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉంది. కాళేశ్వరం, సింగూరు జలాల వినియోగంతో పటాన్‌చెరు మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ వరి, పత్తి, చెరకు, మామిడి వంటి పంటలు 10 లక్షల ఎకరాల్లో పండుతున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడాలనే విషయాలపై అసెంబ్లీ ఎన్నికలు నిర్ణయించినా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల ఆలోచన వేరుగా ఉండనుంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే తమకు మేలు చేకూరుతుందనే విషయాల్ని ఓటర్లు ఆలోచించే అవకాశముంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇంత కాలం తీసుకున్న నిర్ణయాలు మేలు చేశాయా.. కీడు చేశాయా..? అనే అంశాలను కూడా ఓటరు పరిశీలన చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు.. నాలుగు లేబర్‌కోడ్స్

పటాన్‌చెరు మినీ ఇండియాగా మారింది. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం, పటాన్‌చెరు, బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి, ఆర్‌సీపురం ప్రాంతంలోనే 1300 పరిశ్రమలున్నాయి. సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వందలాది పరిశ్రమలున్నాయి. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ ఎన్నికల వేళ చర్చనీయాంశమైంది. 2 నెలల గడువిచ్చి అభ్యంతరాలను కోరింది. ప్రిన్సిపల్ అడ్వైజరీ ప్లానింగ్ కమిషన్ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన రికమండేషన్స్, కనీస వేతనాల సలహా మండలి సూచనలు, పెరుగుతున్న ధరలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని కార్మిక వర్గం అభిప్రాయపడుతోంది. ఇప్పటికే అమల్లో ఉన్న పాత జీవోల వేతనాలకు కొత్తగా ప్రతిపాదించిన వేతనాలకు ఒక్క రూపాయి కూడా పెరకపోగా కొన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో వేతనాలు తగ్గుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యకం చేస్తున్నారు. పెరిగిన ధరలు, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చేందుకు పూనుకుంది. లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న రెండున్నర లక్షల మంది కార్మికులు రోడ్డున పడనున్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్మికుల పొట్టగొట్టాలని చూస్తున్న బీజేపీకి ఎందుకు ఓటు వేయాలనే ప్రశ్న కార్మికుల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండు కూడా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయనే చర్చ ఉంది. దుబ్బాక, మెదక్, సిద్దిపేట ప్రాంతాల్లో 30 వేల మంది బీడీ కార్మికులున్నారు. వీరంతా శ్రమ దోపిడికి గురవుతున్నారు.

రైల్వే లైన్లు, విద్యా సంస్థల సమస్యలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేంద్రీయ విద్యాలయాల్ని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో పోట్లాడుతున్నా పదేండ్ల పాలనలో మోడీ ఒక్క పాఠశాలను కూడా మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం మూడు ప్రభుత్వ మెడికల్ కళాశాల్ని నెలకొల్పినప్పటికీ కేంద్రం ఎలాంటి సాయమూ చేయలేదు. అదే విధంగా కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, డబుల్ లైన్ల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ తరపున గెలిచిన ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైల్వేకు సంబంధించి కొన్ని పనులు పూర్తి చేసినట్టు తెలిపారు.

నల్ల చట్టాల ప్రభావం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తేవాలనుకుంటున్న నల్ల చట్టాల ప్రభావం కూడా ఈ నియోజకవర్గంలో ఉంది. రైతులు పండించిన పంటలకు కనీస మద్ధతు ధర రావట్లేదు. ప్రాజెక్టుల నిర్మాణం, ఉచిత కరెంట్, రైతు భరోసాతో పంటల సాగు విస్తీర్ణం రెండింతలైంది. పది లక్షల ఎకరాల్లో పత్తి, వరి ఇతర పంటలు సాగవుతున్నాయి. వరికి మద్ధతు ధర, బోనస్ దక్కట్లేదు. ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరణ జరిగే ప్రక్రియను కేంద్రం ఆపేసింది. దాంతో ధాన్యం రైతులకు ధర రాకుండా పోయింది. సిద్ధిపేట జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైతే సీసీఐ చేతులెత్తేసి వ్యాపారుల లాభాల కోసం ఏజెంట్‌గా పనిచేసింది. 15 వేల ఎకరాల్లో చెరకు సాగుతున్నా కేంద్రం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో చెరకు రైతులు నష్టాల పాలయ్యారు. సన్న, చిన్నకారు రైతుల్ని వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు నల్ల చట్టాలు చేస్తున్నారని బీజేపీ ప్రభుత్వాన్ని రైతులు విమర్శిస్తున్నారు.